పంచపాదికకు వివరణమనెడి వ్యాఖ్య గలదు. ఈ దృక్పథమునకు వివరణ ప్రస్థానమని పేరు. భామతీప్రస్థానమున వాచస్పతీ మిశ్రునిచే వివరింపబడెను. దీనికి వ్యాఖ్యానము కల్పతరు. దీనికి మరల పరిమళమను వ్యాఖ్యానము అప్పయ్య దీక్షితులవారిచే వ్రాయబడెను.

కాశ్మీర శైవులు వివర్తవాదము నంగీకరింపరు. వీరికి జగత్తు ప్రాతిభాసికమేగానీ ఈశ్వర మాయా విలాసముగు కారణముచే సత్యప్రతిభాసమేయగుగాని, మిథ్యాప్రతిభాసముగాదు. These are non Sanka-rites. Their's is not Vivartha Vada. They are Triyambakites. This mode of Abhasa is mentioned here for contrast only.

శ్రీ శంకరుల వివర్త (మాయా) వాదమందలి వైవిధ్యము.

సృష్టిదృష్టివాదము	దృష్టిసృష్టివాదము
ఇది వ్యావహారికసత్త నంగీకరించునది లేక వివర్తవ్యవహారము. వీరికి జాగ్రత్త వేరు స్వప్నము వేరు కనుక జాగృతిని ప్రాతిభాసిక మనరాదు. వీరికి జగత్తు సత్య ప్రాతిభాసికము.	వీరిది వివర్తప్రతిభాస. జాగ్రత్త కూడ. స్వప్నతుల్యముగ గ్రహించుటచే వీరికి ప్రతిభాస, మిథ్యాపూర్వకమైనది.

సృష్టి దృష్టి - దృష్టి సృష్టి వాదములు రెండును జగత్తంతయు ఒకే బ్రహ్మమైన ఆరోపితమని అంగీకరించును. ఇందు సృష్టివాదము సద్వారకబోధ. అనగా ముందు జీవునికి ప్రత్యగాత్మ భావమును సిద్ధింప జేసి తరువాత పరమాత్మభావమును ప్రతిపాదించు విధానము. దృష్టివాద బోధ "స్వాత్మానమే బోధ్యయం" అనగా ప్రత్యగాత్మ పరమాత్మల

అనన్యభావముతోడనే ప్రారంభమగును. ఇక వీరికి తత్త్వత్రయ విషయక భావము లెవ్వియన :

సృష్టి దృష్టి వాదము

1. జగత్తుకు అజ్ఞాతసత్త లేక వ్యావహారికసత్త అంగీకరింపబడినది. అనగా ఈశ్వరసృష్టిపైననే నీకు భ్రాంతిజ్ఞానము గలిగినదందురు.

2. జీవుడు : ఈశ్వర ప్రతిబింబము లేక అవిచ్ఛిన్నాంశ (పరిచ్ఛిన్న or divided) అనియు కనుకనే జీవులు అగ్ని విస్ఫులింగములవలె నానాత్వాత్మకులని భావింతురు. నేను ప్రమాతను, జీవుడను అంతః కరణాభిమానుడను అని ముందుతెలిపి, తరువాత వీనిని ప్రత్యగాత్మగా నిరూపించి, ఆ పైని బ్రహ్మతో ఐక్యమును చెప్పుదురు. అనగా ప్రత్య గాత్మమే పరమాత్మయను చరమస్థాయి బోధజేయుదురు గనుక వేదాన్తులచే ఈ వాద మంగీకరింపబడినది.

3. పరమాత్మ : మాయోపాధికుడు, జీవభిన్నుడందురు.

దృష్టి సృష్టి వాదము

1. జగత్తుకు జ్ఞాతసత్త లేక ప్రాతిభాసికసత్త నంగీకరింతురు. ఈశ్వర సృష్టి యనబడునది ప్రత్యగాత్మవగు నీ చేతనే కల్పింపబడినదందురు. అట్టి ప్రత్యగాత్మను నేనని తెలిసికొనిన వ్యావహారికము (జాగ్రత్తు) స్వప్నమువలె ప్రాతిభాసికము మాత్రమే యగునందురు.

2. జీవుడు : పరమాత్మాభాసాంశ లేక ఏకాంశయనియు, ప్రత్యగాత్మ జీవునికి సాక్షియనిగాని, అంతఃకరణ సాక్షియనిగాని అంతఃకర ణాభిమానియనిగాని చెప్పరు. పరమాత్మ జీవాత్మలకు ఏకత్వము లేక అనన్యత్వమునే బోధింతురు. (direct Identity)

3. పరమాత్మ మాయోపలక్షితుడు మాత్రమే; ప్రత్యగ భిన్నుడే అనగా ఉపాధి నభిమానించక అతీతుడుగనే యుండువాడు. కనుక మాయా సహితుడుగాడు.

II [illegible]న వాదములు

i. ఆభాసవాదము : ఆభాసయన ఆవిర్భావము (manifestation). ఇది రెండు విధములు (1) శంకరుని వివర్త ప్రక్రియయందు మొదటిది శ్రీమదభినవ గుప్తాచార్య ప్రతిష్ఠితమగు సృష్టిదృష్టి ప్రక్రియ. ఇది కాశ్మీరు దేశమునందు శైవశాక్త మతకర్తలచే ప్రతిపాదింపబడినది. దీనికి ఆభాస పరమాత్మ వాదమనియు పేరు. (The theory that maintains that manifestation is truth). (2) రెండవ ప్రక్రియ శంకరుని దృష్టిసృష్టి వాదము లేక వివర్తాభాసవాదము. దీనిని కాశ్మీరీయులు వివర్తముగ పరిగణించక పారమార్థికముగనే విశ్వసించిరి. ఇందు శైవులు చిద్రూపుడగు శివునకు, శాక్తేయులు "చిత్ శక్తి" యని స్త్రీ పుమాది సర్వరూపమున భావింపబడిన ఆయన శక్తికిని ప్రాధాన్యము నిత్తురు. వీరు జగత్కారణమును శక్తిలేక శివ ఆభాస (manifestation of the Supreme) అందురు. అనగా దృశ్యములు "పరమాత్మ విభూతిమాత్ర ఐశ్వర్యములు." పరమాత్మ స్వరూప మాత్రము చేతనే ఉనికి కలది గనుక. అవి సత్యములే గానీ మిథ్యగాదందురు (They say that the manifester and manifestation are both essential truths). కనుకనే అద్వైతవాదమని తెలుసు. "భూరంభాంస్యనలోనిలోంబర మహర్నాథోహిమాంశుః పుమా" అను శ్లోకతాత్పర్యము మీ వాదమును అంగీకరించును. అందు అద్వైతులు చెప్పుమిథ్యయే ఆభాస లక్షణమని తెలుపబడినది.

అందు ఈ విశ్వమంతయూ అనగా మూర్త్యష్టకము, జగత్కారణమగు పరమేశ్వరునికంటె అభిన్నమనియే సిద్ధాంతీకరింపబడినది. మృత్తుకంటె అన్యమగు ఘటము అసత్యమైనట్లే పరమేశ్వరునికంటె అన్యముగ దోచు నీవిశ్వముకూడ అసత్యమే యని (మిథ్యయే) భావము. అద్వైతులు చెప్పు ఆభాస, మిథ్యాత్వరూపము, శాక్తేయులు చెప్పు ఆభాస, విభూతి ఆవిర్భావమని తాత్పర్యము. జగత్కారణమును దర్శించుటకు పరమేశ్వర విభూతిరూపమగు మూర్త్యష్టక ముపకరించునని శంకరుల హృదయము. కనుక అష్టమూర్తులు పరమాత్మయేయైన సత్యమని భావము. ఐనను మిథ్యా భావమునకు విరుద్ధమైనదిగాదు. దృశ్యములు నిజాంతర్గతమనివివర్తవాదులు, ప్రాతిభాసిక సత్యములని శైవశాక్త ఆభాసవాదులు చెప్పుదురు. సూక్ష్మ గ్రాహులుగానివారికి సద్వారక బోధ జేయుటకే యీ విభూతి ఆభాస ప్రసక్తియని గ్రాహ్యమగుచున్నది. పై ఆభాసవాదము ఆవిర్భావరూపమున జగత్తునకుకూడ వర్తించునని గ్రహించితిమి.

వీని ప్రయోజనము సోఽహమా దాసోఽహమా యని దెలిసికొని తరువాత తన సాధనా విధానమును నిర్ణయించుకొనుటకు "కర్మణి ద్వైతినః భక్తౌవిశిష్టా ద్వైతినః జ్ఞానే అద్వైతినః యను సత్యమును గ్రహించుటయే యగును. ఈ సందర్భమున రామాంజనేయ యుద్ధ సమయమున శ్రీ ఆంజనేయ ప్రోక్తవచనము మననయోగ్యము. వేదాంత మును అనుభవ విరుద్ధము లేకుండ అనుష్ఠించుటకు సహకరించును.

దేహబుద్ధ్యాతుదాసస్తే జీవబుద్ధ్యాత్వదంశకః ।
ఆత్మబుద్ధ్యాత్వమేవాహం ఇతి మే నిశ్చితామతిః ॥

(2) అవచ్ఛేదము : అవచ్ఛేదమనగా అనంతమగు దానిని పరిమిత పరచుట (the theory which conditions or limits

the limit-less or the Infinite is Avacheda). విశాలాకాశము మనకు పరివ్యాప్తముగ భాసించుచున్నది. ఒక కుండ లోపలి భాగము నందంతయు ఆ యాకాశమే యున్నది. ఐనను కుండయొక్క పరిమితిని బట్టి అందు వ్యాప్తమైయున్న ఆకాశము పరిచ్ఛిన్నమైనదివోలె భాసించును. దానిని ఘటాకాశమను చున్నాము. చైతన్య మనంతము (Infinite), అంతఃకరణము కుండవలె చిన్నది. అందలి ఆకాశము పరిమితము (limited). ఆకాశమును పరిమితపరచు కుండవలె బ్రహ్మకు మనస్సు అవచ్ఛేదకము. కానీ, అంతఃకరణ సంబంధముచే చైతన్యముకూడ, ఘటాకాశమువలె, పరిచ్ఛిన్నమైనదివోలె భాసించును. కనుక ఈ అవచ్ఛేద వాదము బ్రహ్మను అంతఃకరణముతో జతపరచి ఆయనను పరిమితిగల వానినిగ రూపొందించి తెలుపు చున్నది.

అంతఃకరణమునకును చైతన్యమునకుగల మరొక విధమగు సంబంధమును బింబ ప్రతిబింబవాదమున మనము తెలిసికొందము. అది ఉపహితత్త్వము – అనగా కూడియుండుట. ఈ కూడిక ఎట్లు పొసగి నట్టిది? యథార్థమున తాత్వికముగ కూడియుండకున్ననూ కూడియున్నట్లే తెలియబడుట ఉపహితమందురు. ఉదాహరణకు "కాకవంతో దేవదత్త గృహః" అనగా కాకి వాలియున్నదే దేవదత్తునిగృహము అన్నప్పుడు-కాకి వాలిన సమయమందేగాక, ఉత్తృణత్వము ఉపహితమగును. అనగా అది లేనప్పుడును చెదిరి పైకి లేచియున్న తృణవిశేషణముచే అది సదా కాకవంతమై దేవదత్తుని గృహమేయని వ్యవహరింపబడును. కనుక కాకవంతమనగా కాకోపహితమైన గృహము అని శాస్త్రభాషలో వ్యవహారము గలదు. ఈ చైతన్యము అంతఃకరణమునకు సంబంధించి యున్నట్లు దోపింపజేయుటయే ఉపహితభావము. అవచ్ఛేద బింబప్రతిబింబ ఆభాసవాదములు మూడింటిని శఙ్కరులు ఆమోదించిరి. ఏలనన, యీ

మూడు వాదములయందును బ్రహ్మచైతన్యమునకు-అంతఃకరణమునకు గల సంబంధ రీతులు వివరింపబడినవిగాని విషయము మాత్ర మొకటియే. గనుక, అవి ప్రాతిభాసికములుమాత్రమేయని తెలుపబడి, యీ యంతఃకరణముతోగల సంబంధము నపనయించుకొన్నయెడల పర్యవసించునది శుద్ధచైతన్యమే యని తెలుపుటచేతనే యోగ్యములుగ గ్రహింపబడినవి. అనగా "త్వం" పదవాచ్యుడగు జీవుని స్వరూపమును వివరించి, శోధించి, అంతఃకరణమునకు చైతన్యమునకు గల సంబంధము తాత్వికము (వాస్తవము) గాదని దెలుపుసు. సాధారణముగ జగత్తును గురించిన వ్యవహారములన్నియు అంతఃకరణము ఇంద్రియములద్వారా (ప్రమాణములద్వారా) ప్రమను (విషయ జ్ఞానమును) పొంది ప్రమాత యగునంతవరకు విపులీకరించునుగాని, అంతఃకరణమునకంటె అతీతమగు (Supramental or transcendental Principle) తత్త్వముగ కూడ జీవుడు భాసింపగలడని విస్పష్టముగ దెలుపవు.

3. బింబ ప్రతిబింబ వాదము : ఇందు మన సాధారణ అనుభవమునందలి యొక చిన్నవిషయమును ఉదాహరణగ దీసికొని విచారించినయెడల నొక ప్రధానసూత్రము స్ఫురణకుదెచ్చి దానితో బ్రహ్మస్వరూపమును చిత్రించును. ఈ వాదమునందలి భావము చక్కగా మనసుకు పట్టినయెడల "విశ్వందర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం" అను శ్లోకభావము సుబోధకమగును. ఒక వెన్నెలరాత్రియందు ఒక నిర్మలమగు సరస్సుగట్టున కూర్చొనిచూచిన ఆ నీటి యుపరితలమున చంద్రుని ప్రతిబింబము మనకు గన్పించును. నీటిపైని ప్రతిబింబమును ఆకాశమునందలి చంద్రబింబమును పరికించిన అదేయాకారము, అదేరంగు, అదే శీతల భావము మనకు స్ఫురించును. మనము మరల యీ గట్టున కొలనుకు ప్రతిముఖముగ కూర్చొని చూచినయెడల ప్రతిబింబము

గోచరించదు. అప్పుడు చేతిలో నొక యద్దమును బట్టుకొని చంద్రుని కభిముఖముగా నుంచినయెడల మరల నట్లే ప్రతిబింబము గన్పించును. దీనినిబట్టి మనము గ్రహించదగిన దేమన! (1) అనువగు నొక యుపాధి యున్నప్పుడే ప్రతిబింబము గోచరింపగలదు. (2) అది ఆ యుపాధి యందే అంతర్గతముగాని దానికన్న వేఱుగాదు. (3) చూచుటకు రూప మున్నను అది ప్రాతిభాసికమేగాని పారమార్థికముగాదు. (4) అదిదేని ప్రతిబింబమో ఆ వస్తులక్షణములనే స్ఫురింపజేయుననియూ తెలియును. ఈ యుపమానమునందు చంద్రబింబమునకు జలము, అద్దము ఉపాధులుగ నుపకరించినవి. ఈ యుపమానమును శాస్త్ర విషయములకు వర్తింప జేసి చూచుకొందము. మన యంతఃకరణ మొకసరస్సు వంటిది లేక అద్దము వంటిది. అనగా ప్రతిబింబ గ్రహణ యోగ్యమైనది. దీనియందు శుద్ధచైతన్యము జీవచైతన్యముగా ప్రతిఫలించినదని శాస్త్రము జెప్పు చున్నది. ఈ ప్రతిబింబమునే అంతఃకరణోపహిత చైతన్యమనియు లేక అందఱికి తెలియు పదము జీవుడనియు అందురు. కాని యొక చిన్న చిక్కుప్రశ్న నెదుర్కొనవలసి వచ్చుచున్నది. ఏమనగా ! చంద్ర బింబము మనకు కనిపించుచున్నది. గనుక అద్దమందు గన్పించినది చంద్రుని ప్రతిబింబ మనుకొన్నాము. కాని యీ యంతఃకరణ దర్పణము నందలిది, ఎవరి లేక దేని ప్రతిబింబ మనుకొనవలయును ? అని మనము ఎట్లు జూచినను బింబమేదియు గన్పించుటలేదే ? బింబము గోచరించక ప్రతిబింబమనునది భాసించుటనే భ్రమయందురు. ఇచ్చట తెల్లని స్ఫటిక మున్నదని, దానికి కొంచెము దూరమున నొక ఎఱ్ఱని గులాబి యున్నదను కొనుడు. ఆ గులాబియొక్క వర్ణవిశేష ప్రభావముచేత ఈ స్ఫటిక మెఱ్ఱగా గన్పించును. ఒకరి దాని రంగు మరియొక దానియందు భాసించుటనే అన్యథాఖ్యాతియందురు. గులాబీని తీసివైచిన స్ఫటికము స్వస్వరూపముననే గోచరించును. పూవు నచ్చటనే యుంచి దానికొక మరుగు నేర్పాటుజేసి,

వెట్టని పువ్వొక్కటి యున్నదను భావము మనకు స్ఫురింప కుండునట్లు జేసిన స్ఫటికమునందలి యెఱ్ఱదనము ఆ స్ఫటికమునకు నైసర్గికమే యని మనము భ్రాంతినొందుదుము గదా ! ఇది యిట్లుండ బింబమగు శుద్ధ చైతన్యము మనకు కనిపించినదనే అనుకొందము. అప్పుడు యీ బింబము, ఆహా! సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, మాయాశక్తిని తన వశము నందుంచుకొని సృష్టి స్థితిలయములకు సమర్థుడుగ నున్నాడు— ఈ ప్రతిబింబించిన చిన్నదేవుడు లేక జీవుడు దేశకాలములకు పరిమితుడు, కించిజ్ఞుడు. పుట్టుచున్నాను చచ్చుచున్నాననుకొను చున్నాడు, సుఖదుఃఖ భోక్తగానున్నాడు— ఆ బింబమునకి విరుద్ధ గుణసంపన్నుడగు ప్రతి బింబమేమిటయ్యా ? అనిపించును. అయితే ప్రతిబింబమునకు ఆధారము ఉపాధియని గ్రహించినాము గదా! మరి ఈ ప్రతిబింబమును ప్రకాశింప జేయు ఉపాధి అగుఅంతఃకరణము రాగద్వేషయుక్త మలిన సత్వరూప మగునది గదా! ఈ మలినములో కాలుపెట్టు చిన్నదేవుడు, కొన్ని జన్మల వాసనలు, సంస్కారములు, మూటగట్టుకొని వాటిని ప్రారబ్ధ రూపమున ననుభవించుటకుగదా ఈ ఊబిలో కాలుపెట్టుట ? కనుక ఈ యుపాధియే ఈయనకు గిరి గీయుచున్నది గాని, లేనియెడల ఆయనంత (బింబమంత) బ్రహ్మాండ నాయకుడే, విశ్వనాథుడే, యీయన కూడను. కనుక యిక్కడ విశేషమేమన యీ ప్రతిబింబముగా మనము పోల్చి తెలుసుకొన్నది బింబాంతర్గతమే, చైతన్యమగు సత్యవస్తువేగాని ప్రాతిభాసికముగాదు. అది ఆత్మయే-సర్వాత్మయే. అద్దమునందలి, జలము నందలి ప్రతిబింబములు ప్రాతిభాసికములేగాని స్వరూపములుగావు. ఇదియే మనము గ్రహించవలసిన సత్యము. ఏలయన యిచ్చట మనకు కనిపించని సర్వవ్యాప్త బింబము గలదు. ఈ స్ఫురించు ప్రతిబింబము యొక్క గుణములు నైసర్గికములుగావు. అనగా ఈ చిన్నదేవునికి (జీవుడు) ఆ పెద్దదేవునికి (ఈశ్వరుడు) గల అంతఃకరణ, మాయ

యను ఉపాధులచేత భేదభావము స్ఫురించునుగాని వస్తుతత్త్వ రీత్యా భేదభావములు లభింపవు. ఈ యుపాధులునూ ఆరోపితములేగాని పారమార్థికములుగావు. ఇది ప్రబోధచే గ్రహించిన వారికి చిన్నదేవుడూ లేడు, పెద్దదేవుడింకొకడు లేడు. అంటే బింబము ప్రతిబింబము ఒక్కటే. పూర్ణముగ, నిర్వైరచైతన్యముగనే తెలియబడును. తత్త్వమసి వాక్యార్థమే సిద్ధించును. ముఖ్యభావము : ఉపాధియందున్న జీవచైతన్యము ప్రతిబింబమని మనము బోధనా సౌలభ్యము కొరకు చెప్పుకొన్న, ఉపాధి రహిత సర్వాత్మక చైతన్యముకన్న అది వేరుగాదని తెలియుటయే. అజ్ఞాన దోషమున్నంతవరకే భేదభావము స్ఫురించును. రేడియో ప్రసారములలో అప్పుడప్పుడు వినవస్తూ ఉంటుంది. ఈ చిన్నపాటను పాడుకుంటూ ఉందాము.

శ్లో॥ యద్వత్తోయే చంద్రద్విత్వమ్ ।
తద్వద్బ్రహ్మణ్యఖిలు జీవత్వం ।
యద్వన్మనసి ప్రతిబింబత్వమ్ ।
తద్వద్బ్రహ్మణ్యఖిలు జీవత్వం ॥

God reflects himself (in His Universal mind) as eeva. If you rise above the mind (నీవు దక్షిణామూర్తి వైన) u are He in his entirity.

ఈ అవచ్ఛేద, బింబప్రతిబింబ, ఆభాసవాదములు జీవుడు ప్రమాత త్రమేగాదు - ఒక యుపాధియందు అంతఃకరణ కంటే విలక్షణుడగు చైతన్య తత్త్వముగ భావింపగలడని తెలుపును. ఆ యంతఃకరణము చైతన్యము [illegible] సంబంధ [illegible] తెలియబడినను స్తవముగ అట్టి సంబంధము లేనిదియే యగునని యీ వాదముల

యందలి భావము. కనుక జీవునియందలి జీవత్వము అనిర్వచనీయ తత్త్వమే యగును. వాస్తవముగ జీవుడు శుద్ధచైతన్య రూపమగు సత్తత్త్వమే యనియు, చైతన్యమునందు గల్పింపబడిన జీవత్వమపవదింపబడిన తెలియబడునది అద్వితీయ చైతన్యమేననియు సారాంశము. జీవునకు అంతఃకరణమునకు గలది ప్రాతిభాసిక సంబంధమేగాని పారమార్థికము గాదు. ఆ సంబంధమును తొలగించుకొనిన ప్రమాతపరమాత్మయే యగునని గ్రహించుటకే వాదము ఉపకరించును. కాశ్మీరులుకూడ జీవుని ఈశ్వర ప్రతిభాసమనియే (appearance) అంగీకరింతురు. కాని, ఇది విభూతి పూర్వకము. వేదాంతులన్ననో మిథ్యా ప్రతిభాసమందురు. కనుక వీరికి అభేద ప్రతిపత్తి కుదురును. కాశ్మీరులకు భేద ప్రతిపత్తి ముందుగా ఏర్పడి పిమ్మటగాని అభేద ప్రతిపత్తి కుదురదు. కనుక వారిది భేదాఽభేద అద్వైతవాద మందురు. అందుచేత జగత్ప్రక్రియలోని ఆభాస వాదమున విభూతి (manifestation) అని కాశ్మీరు లెట్లు భేదించిరో జీవప్రక్రియలోని ఆభాసవాదమున సైతము వారిది పృథక్ దృష్టియే. కాశ్మీరులది స్వాతంత్ర్య వాదమందురు. ఇది వివర్తమూగాదూ పరిణామమూగాదు. భాస్కరుని భేదాఽభేద వాదమును నింబార్కుని ద్వైతాఽద్వైతమును ఒకే వర్గమునకు చెందినవి. కాని నింబార్కుని బ్రహ్మము సగుణము, సవిశేషము. భాస్కరుని బ్రహ్మము, నిర్గుణము, సవిశేషము. ఏది ఎట్లున్నను ఈ భేదాఽభేదవాదము అద్వైత పరమగు భావములకును, ద్వైతపరములగు భావములకును కొంత సామరస్యమును కల్పించి సమర్థించినట్లే దోచుచున్నది. బ్రహ్మయను జీవుడును భిన్నాఽభిన్నులను భావముచే భేదాభేదాఽద్వైతము సిద్ధించుచున్నది. మరియు బ్రహ్మ సగుణమును నిర్గుణమును అగుటచే ద్వైతాద్వైతమను పదము సిద్ధించుచున్నది.

2 వ వి భా గ ము

జీవతత్త్వ ఈశ్వరతత్త్వవాద సమీక్ష

జీవతత్త్వ విషయమున పై చెప్పబడిన ఆభాసవాదమ్ము, అవచ్ఛేద వాదము, ప్రతిబింబవాదములు అద్వైత సిద్ధాంతానుగుణములే. జీవునకు ప్రమాతృత్వము మిథ్యయనియు, ప్రత్యగాత్మత్వము తథ్యమేననియు, గాన, ప్రత్యగభిన్నబ్రహ్మత్వము జీవునకు పారమార్థికమనియు పై వాద ప్రతిపాదకులు మువ్వురును అంగీకరించి యుండిరి. ప్రమాతృత్వ నిరూపణమున మాత్రము వీరికి భంగిభేదము కలదు. మాధ్వరామానుజీయ వాల్లభ నింబార్కాది సాంప్రదాయక భేదవాదులన్ననో జీవతత్త్వ విషయమున ప్రత్యేక వాదమును లేవెత్తించిరి. (1) జీవుడు పరమాత్మయొక్క స్వరూపాంశము గాదనియు (2) అస్వరూపాంశముగాన పృథక్చేతన మనియు (3) అణుపరిమాణుడేగాని మహత్పరిమాణుడు గాదనియు మోక్షావస్థలో కూడ నితడు అణుమాత్రుడేయనియు (4) సహాయుజ్యోర్భావ స్సాయుజ్యమ్ అనిన చెప్పున ఇతనికి పరమాత్మతో భోగమాత్ర సామ్యరూపమైన సాయుజ్యమేదప్ప, ఏకీభావాత్మక సాయుజ్యము పొసగ దనియును ఈ భేదవాదులందరును ఏకకంఠముతో వాదింతురు.

(సహాయుజ్యోర్భావమన ఇద్దరు కలిసి తుల్య భోగమును అనుభవించుట).

ఈ భేదవాదుల భావము లిట్లుండ జైనమతస్థులు జీవునకు మధ్యమ పరిమాణమును మన్నించెదరు. అనగా శరీరమాత్ర పరిమాణమును జెప్పుదురు. ఎంతటి శరీరమున అంతటి పరిమాణము గలవాడై యుండు నందురు.

జీవుని ప్రత్యగాత్మనుగా, కనుకనే మహత్పరిమాణుడుగ అంగీకరింపని పై వాదులు భ్రాంతులనియు, వీరి నిర్ణయములప్రతిష్ఠితములనియు, "దేహంప్రాణ మపీంద్రియాణ్యపి చలాంబుద్ధించ శూన్యం విదుః స్త్రీ బాలాంధ జడోపమా స్త్వహమితి భ్రాంతాభృశంవాదినః మాయాశక్తి విలాస కల్పిత మహావ్యామోహ సంహారిణే" అనెడి పద్యమునందు నిరసింపబడినవి. జీవుడు ప్రత్యగభిన్న బ్రహ్మమేగాక మహత్పరిమాణుడే యని సిద్ధాంతము.

శివ. విభాగము

జాతీశ్వర - నియతేశ్వర వాదములు

ఇక ఈశ్వరతత్త్వ విషయక వాదభేదములగూడ ఇంచుకంత విచారింతము. పూర్వోక్తప్రభేదవాదులు జీవేశ్వరులకు అత్యంత భేదమును అంగీకరింతురు, ఈ భేదము కేవలము తాత్త్వికమైనదేగాని మిథ్యాభూతమైనదిగాదు. కనుక జీవేశ్వర చేతనములకు వైజాత్యమేగాని సాజాత్యమెంతమాత్రమును కుదురదు. అనగా చేతన తత్త్వమునందు జీవజాతియొకటియు, ఈశ్వరజాతి యొకటియు గలదను ద్వైవిధ్యము ప్రాప్తించుచున్నది. ఇట్టి ఈశ్వరుడే జాతీశ్వరుడని భావింపబడినాడు. ఈ భేదవాదులు తమ జాతీశ్వరుడు సర్వథా మూర్తిరూపుడనియు, ఈ మూర్తిసైతము శివకేశవాది రూపమున నియతరూపుడేగాని యథేష్టముగ భావింపదగినవాడు కాడనియు వీరి మతసరణి కనుకనే భేదవాదులందరి శైవులు శివమూర్తిని, వైష్ణవులు విష్ణుమూర్తిని. ఇట్లే శాక్తులు, సౌరులు వైనాయకులు [illegible]గువారు వారివారికి అభిమతులైన నియత మూర్తులనే

ఈశ్వరజాతి మూర్తులుగ, తదితర మూర్తులను జీవజాతి వారినిగను నిర్ణయించుకొనిరి. ఇట్టి వీరి సాంప్రదాయములను జాతీశ్వర వాదమనియు నియతేశ్వర వాదమనియు కోవిదులెన్నెదరు.

మరియును భేదవాదులు తమ ఈశ్వరుడు సగుణుడు నిర్గుణుడును కూడనై యున్నాడందురు. కళ్యాణగుణ సహితుడుగాన సగుణుడనియు, ప్రాకృతగుణ రహితుడుగాన నిర్గుణుడనియు చెప్పుదురు. ఈ సరణిని ఉభయలింగత్వ మందురు. అనగా ఉభయలక్షణ లక్షితుడని భావము.

ఇంకనూ భేదవాదులు కొందరు తమ ఈశ్వరుని, జగత్తునకు కేవలము నిమిత్త కారణునిగా అంగీకరింతురు. కొందరు నిమిత్తో పాదాన ఉభయ కారణునిగా అంగీకరింతురు. మొదటి పక్షము తటస్థేశ్వర వాదమనియు రెండవ పక్షము ఉభయకారణ వాదమనియు చెప్పబడు చున్నవి.

ప్రకృతము శ్రీ దక్షిణామూర్తి స్తోత్రమున ప్రతిపాదింపబడిన ఈశ్వరతత్త్వము పై భేదవాదుల ఈశ్వర తత్త్వముకన్న విలక్షణ మైనది. ఈయన ప్రత్యగాత్మయే గాన జీవాభిన్నుడే. కనుక జాతీశ్వ రత్వము ఈయనకు లేదు. అఖండాద్వితీయ చైతన్య స్వరూపుడు. కనుకనే ఏతదభిన్నుడగు జీవుడు అణుపరిమాణుడుగాని మధ్యమ పరిమాణుడుగాని రానేరడు. మహత్పరిమాణుడే యగును. మరియును ఇతడు ప్రధానముగ అమూర్తియు నిర్గుణుడును— "సాక్షిచేతా కేవలో— నిర్గుణశ్చ" అనిగదా చెప్పబడినది. మాయావీవ (వశె) మహాయోగీవ, దేశకాల కలనా వైచిత్ర్యాత్మకం జగత్ విజృంభయతి" అని మాయా వశమున నితడు సగుణుడుగాను, సాకారుడుగను, భాసించునేగాని పరమార్థతః నిర్గుణుడు నిరాకారుడును. "స్ఫురణం సదాత్మకమ్,

మహాదీప ప్రభాభాస్వరం. జ్ఞానమ్" అనినట్లు ఈయన స్వరూపము కేవలము ప్రజ్ఞానాత్మకమైనదే అగును. కనుక ఈయన ఉభయలింగి యగుట ఉపపన్నముగ లేదు. పారమార్థిక మూర్తిత్వము లేదు. గాన నియతమూర్తి వాదము వర్తించదు. శ్రీ దక్షిణామూర్తి యను పదమున కిట్లు పరమార్థ దృష్ట్యా నిర్వచనము చెప్పబడినది చూడుడు:- 1. శ్రియా= అనాద్యచింత్య మాయాశక్త్యా: దక్షిణః = సృష్టిస్థిత్యంత, విరచనా నిపుణశ్చ; 2. అసౌపరమార్థతోఽమూర్తిశ్చ ఆకార విశేషరహితః— అస్థూలమనణు ఇత్యాదిశ్రుతేః॥ అని. అనాద్యచింత్య మాయాశక్తి యుతుడై, నియతమైన యెట్టి మూర్తియునూ లేనివాడై, సృష్టిస్థితి లయములను నిర్వహింపజాలిన అఖండ నైపుణ్యము గలవాడు అని భావము. కనుకనే అద్వైత పరబ్రహ్మమున కెట్టి నియతమూర్తియు లేదు. "స్యాత్ పరమేశ్వర స్యాఽపి ఇచ్ఛావశాత్ మాయామయం రూపం సాధకానుగ్రహార్థమ్"॥ అని స్వేచ్ఛానుసారము సాధకుల ననుగ్రహించు టకై ఆ యా మూర్తుల నీశ్వరుడు తాత్కాలికముగ పరిగ్రహించునేగాని, ఆయనకు నియతమూర్తిలేదు అనియే వేదాన్త సిద్ధాన్తము.

మరియు జగత్కారణత్వ విషయములో అభిన్న నిమిత్తోపాదానత్వ మునే ఈశ్వరునకు వేదాన్తులు నిర్ణయించిరి. కాని ఈ ఉభయకారణత్వము విశిష్టాద్వైతులు భావించునట్టిదిగాదు. వారు, మాయను ఉపాదానమనియు, ఈశ్వరుని నిమిత్తమనియు, ఈ ఉభయ తత్త్వములును ప్రత్యేకములే యైనను అపృథక్సిద్ధములు, పరస్పరానపేతములును గాన, ఈశ్వరుడు ఉభయకారణుడగు నందురు. వేదాన్తులు ఈశ్వర మాయలు పృథక్తత్త్వ ములు గావనియు, మాయ పరమాత్మయొక్క స్వరూపశక్తియే యనియు, కనుక ఉభయవిధ కారణత్వ మీయనపట్ల కేవలమొక్కనికే చెల్లుననియు పరిష్కరించిరి. "తమేవభాన్త మనుభాత్యే తత్సమస్తంజగత్" —

వ్యావృత్తాస్వను వర్తమానమ్" కార్యకారణతయా మాయాపరిభ్రామితః"- నాన్యత్కించన, విద్యతే విమృశతాం యస్మాత్పర స్మాద్విభోః" అని బహుథా ఏకాత్మకమైన ఉభయ కారణత్వము నిర్దేశింపబడినది.

సారాంశమేమన— వేదాన్తుల పరమేశ్వరుడు అద్వితీయుడు, అగుణుడు, అమూర్తి, కార్యకారణ భావాతీతుడు. ఇతడే ప్రత్యగాత్మ— సర్వద్వైతరూపుడు ఇది ఈతని అచింత్య మాయా వైభవము.

శ్లో॥ నిధయే సర్వవిద్యానాం భిషజే భవరోగినామ్
గురవే సర్వలోకానాం దక్షిణామూర్తయే నమః॥

అద్వైత సిద్ధాన్త ప్రముఖ సూత్రములు

పరబ్రహ్మ ఔపనిషదతత్త్వము. ఐనను, ప్రత్యక్షానుమానాది ప్రమాణములు ఉపనిషత్ప్రమాణోపజీవ్యములు మాత్రమే గనుక "తంత్వౌపనిషదం పురుషం పృచ్ఛామి ఇతి" అనగా ఉపనిషత్ప్రతిపాదిత పురుషుని గూర్చి అడుగుచున్నాను చెప్పుడని మైత్రేయి యాజ్ఞవల్క్య మహర్షి నడిగెను. ఆయన యిట్లు చెప్పెను.

(1) జగన్మిథ్యాత్వం— "మాయామాత్ర మిదం ద్వైతం। అద్వైతం పరమార్థతః" (మాండూక్యము). స్ఫురించునది బ్రహ్మ (ద్వైతము), నామరూపములు మిథ్య. ముందు మిథ్యాత్వమును దెలిసికొని, స్ఫురణము త్రోసిపుచ్చిన, అభాసగా గోచరించునది వివర్తమని తెలిసి ఆ స్ఫురణ బ్రహ్మగా గ్రహింపనగును.

(2) బ్రహ్మము అపరిణామి— గనుక బ్రహ్మేతరమగు జడ ప్రకృతి అవస్తువుగను గ్రహించిన విశ్వప్రతీతి, వివర్త వికారమనియే తెలియనగును.

(3) శూన్యము జగత్కారణము గానేరదు. నిరధిష్ఠాన భ్రాంతి ఉపపన్నముగాదు. రజ్జుసర్పాది భ్రాంతి సాధిష్ఠానముగనే యున్నది. ఇట్లే జగద్విషయక భ్రాంతియు సాధిష్ఠానమే. ఈ యధిష్ఠానము బ్రహ్మయే.

(4) "జీవో బ్రహ్మైవ నాఽపరః" ఇది బ్రహ్మజీవవాదము. "జీవయతి ఉజ్జీవయతి దేహాది సంఘాతమితి. జీవః" అనెడి వ్యుత్పత్తితో పరమార్థ చైతన్యమే జీవసంజ్ఞతో గ్రహింపనగునని నిర్ధరింపబడెను.

(5) "ఆత్మాహి బ్రహ్మ" మన స్వస్వరూపమే బ్రహ్మము. స్వస్వరూపమును దేహేంద్రియ బుద్ధ్యాదికముగ తాదాత్మ్యాధ్యాసవలన ప్రమాద పడుటచే, ఆత్మయే బ్రహ్మమన అవగతముగాదు. దృశ్యదేహమున కంతకును జ్ఞాతగా నుండెడి చైతన్యమును ఆత్మగా గ్రహించితిమేని జ్ఞాతృత్వముకూడ అచింత్యమని బోధపడును. అపుడు జ్ఞేయమైన ఉపాధి మిథ్యగా తెలియును. జ్ఞానము మాత్రమే స్వాత్మయని అనుభూతమగును.

(6) "నవయం కార్యకారణయో రభేదం బ్రూమః । కింతు భేదం వ్యాసేధామః" అనగా అద్వైతమున కారణమొకటే సత్యము. కార్యమసత్యము కనుక జగత్తుకు కార్యకారణ భావముపపన్నముగాదు; అది మిథ్య. కనుక ఈ రెంటికి భేదమును నిషేధించి, కారణ రూపమున నున్న దొకేటక పదార్థమని నిర్ధరించుట.

(8) వివర్తమున నొక సునిశిత విషయము గమనించుటావశ్యకము. అది ప్రమాతృ వివర్తము, సాక్షి వివర్తముల యందలి సునిశిత భావము: ప్రమాతయన అంతఃకరణ ప్రతిబింబిత చైతన్యము, ఇదియే జీవసంజ్ఞ. ఈ జీవుడు అవిద్యాదశలో శుద్ధచైతన్యమును దేహేంద్రియాదులుగ గోచరింపు కొనును. ఇది ప్రమాత్రాఽధ్యాస లేక ప్రమాతృ వివర్తము. సాక్షియన అంతఃకరణమునందలి ప్రతిబింబమునకు బింబము. దీనికి సంజ్ఞ ప్రత్యగాత్మ లేక సాక్షి. శుద్ధచైతన్య రూపుడగు నీసాక్షి దృష్ట్యా దేహేంద్రియ బుద్ధ్యాదులు కేవల స్వవివర్తమే; యోగి తనయందలి కల్పించుకొనెడి ఆభరణము వంటిది. ఇది స్వతంత్రావరకము లేక స్వతంత్ర్యాధ్యాస లేక స్వతంత్ర వివర్తము అనబడును.

సూత్ర వివరణ : వేదాంత శాస్త్రమునకు వస్తువు జగత్తు-జీవుడు-పరమాత్మ, మూడుగా తెలియబడుచున్న ఈ తత్త్వములకు గల పరస్పర సంబంధము, లేక కార్యకారణ సంబంధము, ఈ విషయముల విమర్శించి గ్రహించుటకు ప్రముఖ సిద్ధాంతములు మూడు గలవు. అవి ద్వైతము, విశిష్టాద్వైతము, అద్వైతము.

అద్వైతము : బ్రహ్మతత్త్వము నుండి జీవజడ తత్త్వములను విడదీసి తెలియవచ్చునను ప్రసక్తిలేని సిద్ధాంతము. ద్వైతము : ఈశ్వరున కతిరిక్తముగ (అంటనివి) జీవజడములున్నవి గనుక వానిని విడమరచియే గ్రహింపవలెనను సిద్ధాంతము. విశిష్టాద్వైతము : జీవజడములనునవి ఉన్నను పరమాత్మను అంటియుండి విడిపరచి చెప్ప వీలులేదను సిద్ధాంతము. అనగా జీవజడ విశిష్టుడు పరమాత్మ అని చెప్పు సిద్ధాంతము.

భూమిక : పరమాత్మ విషయమున శ్రుతిని ప్రమాణముగ నంగీకరించి— ఆయన అనంతుడు (Infinite) కేవలుడు అద్వయుడు

(The only one without a second) అనగా ఏకైక తత్త్వమని విశ్వసించవలయును. "నేహ నా నాస్తి కించన" అను శ్రుతియే యిందుకు ప్రమాణము. ఆ తత్త్వము త్రికాలాబాధ్యము. అనగా తాత్త్విక సత్యము ఇదియే చైతన్యము అనగా జ్ఞానము. అందుచే దృక్; కనుకనే స్వభావము ఆనందము. ఈ ఆనందానుభూతియే తత్త్వశాస్త్ర పఠనమునకు లక్ష్యము. అందుకు సాధన అత్యంతావశ్యకము.

(I) విశ్వము : అనగా దృశ్యము (భూగోళ సూర్య చంద్ర నక్షత్ర గ్రహాదులు). ఈ విశ్వమంతయు శుద్ధచైతన్య వివర్తము. వివర్తమన విశేషముగ భాసించునది: చైతన్యాంతర్గతమే (Immanent). చైతన్యమే అధిష్ఠానముగ, దానియందే విమర్శగ భాసించునది. విమర్శయన భిన్నత్వమును భాసింపజేయు అనాదియగు అజ్ఞానము. ఇదే పరాశక్తి— పదార్థగుణ, క్రియాత్మకము. ప్రకాశమన ఈ పదార్థ, గుణ, క్రియలనబడు వాని కేవలానుభూతి. ఈ విశ్వమంతయు చైతన్య తత్త్వాంతర్గతమే, అయినను, శక్తి ప్రభావముచే ఆ పరమాత్మకు బహిర్గతములుగనున్నట్లే స్ఫురణ నిచ్చుచున్నవి. అందుచే జగత్తు మిథ్య యందురు. మిథ్యయన అనిత్యమగు దానియందు నిత్యత్వబుద్ధి. ఇందుచే జగత్తుకు మిథ్యాత్వము ఔపచారికము మాత్రమే. ఔపచారికమన ఒకరి లక్షణములు మరియొకరి యందు జూపట్టిన, అసలువాని పేరు ఈ లక్షణ యుక్తునికి ఆరోపించుట. ఉ॥ వాడు సింహమయ్యా! అనగా సింహముయొక్క సత్త్వము, స్థైర్యము, గాంభీర్యము గలవాడనుటయే. అందుచే ఔపచారికముగ మాత్రము జగత్తుకు మిథ్యాత్వము జెప్పబడినది. వ్యావహారికమున సత్యముగనే అంగీకరింపబడుటచే — జగత్తునందు నిత్యత్వ బుద్ధికి శాస్త్ర దృష్ట్యా మిథ్యాత్వము జెప్పబడెను. జగత్తు బ్రహ్మకంటె అన్యము గాదు. గనుక, బ్రహ్మకు జెప్పబడిన స్ఫురణమను లక్షణము జగత్తుకు

అన్వయించి జగత్తు స్ఫూర్తియనియు జెప్పనొప్పును. జగత్తునందు సత్యత్వ బుద్ధి (మిథ్య) ఆత్మాధిష్ఠానకభ్రమచే గలుగు నందురు. దీనిని ఆత్మాశ్రయ భ్రమయనుట యుక్తముగ దోచుచున్నది. మననముజేసి, ఏ పదమున కౌచిత్యము గలదో నిర్ణయించుకొనుడు. వివర్తమన అధిష్ఠాన మొకటియుండగ — దృశ్యవస్తువు నందలి దోషము చేతనో, ఇంద్రియ శక్తుల యందలి దోషము చేతనో అజ్ఞానము పరిణమించి అధిష్ఠానముపై నొక అసత్య అనిత్యవస్తు స్ఫూర్తి గలుగుట యని విపులముగ గ్రహించనగును.

N. B. :- మహాభారతములోని కర్ణుడు భ్రమ. ఆయన ఒక దశలో సూతపుత్రుడు, మరొక దశలో అంగరాజు. సూతపుత్రుడుగ ఆత్మాధిష్ఠానక భ్రమ యుండుండును. ఇందు ఆత్మ అధిష్ఠానముగను ప్రమాత ఆశ్రయముగ నుండును. (ic) Ignorence not self evolved but super imposed by the Pramaata. అంగరాజుగ శాసించగల సమర్థుడు. ఇది ఆత్మాశ్రయ భ్రమకు సామ్యము. ఇందు ఆత్మ అధిష్ఠానము. భ్రాంతి ఆశ్రయము. (This is self enolved and ordered to be super imposed by the self itself.)

ఈ అధిష్ఠానక ఆశ్రయ పదములందు ఇంచుక భేదభావ ద్వైవిధ్యము గమనీయము, గణనీయము, గనుక ప్రమాతృ సాక్షి, వివర్తముల గ్రహించుటకు వాలెపు చెప్పితిని.

విశ్వము బ్రహ్మయందలి శక్తి పరిణామమేగాని కేవల పదార్థ పరిణామముగాదని తెలియుచున్నది.

శ్లో॥ ఆత్మన ఆకాశస్సంభూతః । ఆకాశాద్వాయుః ।
వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ ।
పృథివ్యా ఓషధయః । ఓషధీభ్యోఽన్నం । అన్నాత్పురుషః ॥

అని యిట్లు కార్యకారణముల క్రమముటంకించబడినది. కనుక సర్వాధిష్ఠాన మగు ఆత్మకంటె కార్యకారణములు భిన్నములు గావు. అద్వితీయ బ్రహ్మయే కార్యము, అదియే కారణము అని అభిన్న నిమిత్తోపాదాన కారణమను పదముతో (Intelligent cause immanent in the material cause) స్ఫుటీకరించిరి. జగదృష్ట్యా కార్యకారణములు భిన్నములు. ఆత్మదృష్ట్యా అభిన్నములు లేక అనన్యములు. కనుక జగద్విషయమున అజ్ఞానము పరిణామ్యుపాదాన కారణము. పరమాత్మ వివర్తోపాదాన కారణము అని సిద్ధాంతము; కనుకనే పరమాత్మ నిర్వికారుడు—(the changeless eternal principle,)

రెండు సత్యవస్తువులను అభేద రూపమున అంగీకరించుట ముఖ్య సామానాధి కరణ్యమందురు. రెంటిలో నొకదానిని మిథ్యగ తెలిసికొని అపవదించి ఒకేవస్తుత త్త్వము నంగీకరించుట బాధసామానాధి కరణ్యము. (what you perceive as effect is nothing other than the cause itself.) అనగా జగత్తు మిథ్యగా త్రోసిపుచ్చి బ్రహ్మనే ఏకైక సత్యపదార్థముగ అంగీకరించుట

శూన్యమునుండి సృష్టి జరుగదు : సర్వము సదాత్మకమే "యస్యైవ స్ఫురణం సదాత్మకి మసత్కల్పార్థగంభాసతే." దృశ్యము నపవదించి తరువాత అపవదించిన పర్యవసించునది శూన్యముగాదు, అధిష్ఠానమే— పరమాత్మయే. పరమాత్మ సర్వమున కధిష్ఠానము. ఈ సర్వమనబడున దంతయు ఆ పరమాత్మ యందారోపితము (Super imposition) అధిష్ఠానము లేనిదే ఆరోపమను పదమర్థవిహీనము. అధ్యారోపము, మాయాశక్తియందలి రజస్తమోగుణ ప్రభావములగుఆవరణ (veiling), విక్షేపపూర్వకము, the projection of a distorted thought అధిష్ఠానమును పరిగణించని హీనయాన బౌద్ధులు మాత్రము పర్యవ

సించునది శూన్యమని చెప్పుదురు. అద్వైతమునందు పరాఽపరా ప్రకృతుల ననువదించి, ఒకటిగ భావించి తరువాత అపవదించిరి. కనుక అద్వైత స్థాయియందు ప్రకృతి యుండదు.

II) జీవుడు : వేదాన్తులు జీవుడు మహత్పరిమాణుడందురు. ఇది ఏకజీవవాదము. జీవుడు ఒక భూమికయందు ప్రమాతగ పరిగణింప బడినను మరొక భూమికయందు అంతఃకరణమునకన్న విలక్షణుడగు శుద్ధచైతన్య తత్త్వముగ భాసించు సదాత్మకుడే యని సిద్ధాంతము. అన్యోన్యాపేక్షవలన సత్తా, కారణకార్యములు రెంటియందును తెలియబడు చున్నది. ద్వైతులు అణుపరిమాణులగు బహు జీవవాదులు. జైనులు ఎంత పరిమాణముగల శరీరమున కంతపరిమాణుడగు జీవుడు ఉండు నందురు; ఇది మధ్యమ పరిమాణము. జీవుడు మహత్పరిమాణుడగు పరమాత్మయనిన భ్రమ ఎవరికి గలుగును? ఎవరికి నివర్తించి మోక్షము గలుగునన, అది ఆత్మాశ్రయక భ్రమయే గాపున ఆత్మయందే అంతర్గత ముగ నుండి ప్రకాశింపబడుచు, నివృత్తి బొందుచుండును. స్వప్నావస్థకు వేదాంత శాస్త్రమున గల ప్రముఖపాత్ర ఈ సత్యమును హృదయంగమము జేయుటకేనని తెలియవలయును. *అద్దము జడము గనుక ప్రతిబింబ ప్రాప్తికొరకు బింబము నపేక్షించును. శంకరులిచ్చిన దర్పణము కేవల చైతన్య స్వరూపమే గనుక ప్రత్యేకమగు నొక బింబములేకయే, తన యందే, తన విమర్శ శక్తిచే ఆభాసను (a reflection like state) కల్పింప సమర్థము. తన ప్రకాశశక్తిచే వస్తు, గుణ, క్రియాత్మకమగు సర్వాన్ని ఎరుంగనూ శక్తుడే.

III) ఆత్మ : అద్వైతులు ప్రకృతిని ఒక తత్త్వముగ నంగీక రింపరు. పర-అపరా ప్రకృతులు రెంటిని ఒకే తత్త్వముగ అనువదించి

ఆ తత్త్వమును అపవదింతురు. "నిర్దోషంహి సమం బ్రహ్మ" అనగా సజాతీయ, విజాతీయ స్వగత (Homogeneous, hetrogeneous, and ingrained) భేదముల పరిత్యజించి ఈ దోషములు లేని "సమ" శబ్దవాచ్యుడే బ్రహ్మయందురు. ఈ సమమే ఆధేయము, ఉపాధులాధారములు. "విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః॥ (గీత V-18) అనగా సకలోపాధులయందును బాహ్యదృష్టికి తెలియబడనట్టియు, పండితునిచే మాత్రమే తెలిసికొనబడునట్టిదియు అగు సమమను ఒకే వస్తువు బ్రహ్మ. అంతియగాని ఉపాధులన్నిటిని సమతత్త్వముగ మన్నించ వలయుననుటగాదు యిందలి భావము.

శ్లో॥ ఈశావాస్య మిదగ్ం సర్వం యత్ కించ
జగత్యాం జగత్ । తేనత్యక్తేన భుంజీథా ।
మాగృధః కస్యస్విద్ధనమ్ ॥

ప్రకృతి సర్వము పరమాత్మునిచే కప్పబడియున్నది; కనుక తేనత్యక్తేన భుంజీథాయన నామరూపముల నిషేధించిన శిష్టమగునది ఆత్మేశ్వరతత్త్వమే. అట్టి సత్ శబ్దవాచ్యమగు దాని అనుభూతి పొందుము. జగల్లక్షణములగు నామరూపముల త్యజించి అస్తి - భాతి - కనుక ప్రియం అను ఆత్మ లక్షణములుగల దాని అనుభూతి పొందుము. అన్యోన్యాపేక్షచే కార్యకారణములు రెంటికిని సత్తానిశ్చితమే. ఎట్లన :

"చిదేవశక్తిః" అను దానిలో చిత్ యే శక్తి అని భావము, చిత్ యొక్క శక్తియని గాదు. శక్తి శక్తిమంతుల కనన్య బోధయే అద్వైతబోధ. ఇదియే కార్యకారణముల కనన్యతా భావము లేక అభిన్న నిమిత్తోపాదాన కారణము.

ద్వితీయ భాగము

జ్ఞానాష్టక స్తోత్ర శ్లోకములు : వివరణ

భూమిక : శ్రీ శంకర భగవత్పాదులు సమస్త మానవలోక సముద్ధరణ నుద్దేశించి అపార వేదాన్తశాస్త్ర హృదయమును గ్రహింప నాకాంక్షించు ముముక్షు జనప్రయోజనమునకునై "విశ్వందర్పణదృశ్యమాన నగరీతుల్యం నిజాన్తర్గతం" అను శ్లోకముతో నుపక్రమించి "భూరంభాంస్యనలో నిలోంబర" మను శ్లోకముతో నుపసంహారముజేసి తొమ్మిది శ్లోకములతో, వేదాన్తగ్రంథకోటియందు చర్చింపబడిన విషయములు : జీవేశ్వర జగత్తత్త్వముల తాత్త్వికస్వరూపమును, వీటిపై మాయాశక్తికిగల ప్రభావమును, మాయాశక్తియొక్క విలాస, విలసన, అభాసలను మాయాప్రభావజనిత వృత్తిజ్ఞానముల లయింపజేయ, ప్రాప్య స్వరూపజ్ఞానము, సదాత్మక ప్రజ్ఞానపూర్వక ఏకైక పదార్థానుభూతియు, సుస్వరూపజ్ఞానము, సదాత్మక ప్రజ్ఞాపూర్వక ఏకైక పదార్థానుభూతియు, సుస్పష్టముగ బోధింపబడెను. పూజ్యపాదు లీబోధల జేయునప్పుడు అచ్చట పరివేష్టించియున్న శిష్యులు, ఋషిగణము ఆ బోధలయందలి గంభీర భావముల తెన్నుగ గ్రహించిరయు నిష్ప్రవృత్తియోగిర బ్రహ్మాకారవృత్తిని ప్రాప్తించుకొనజాలనందున పరబ్రహ్మతత్త్వానుభూతిలేక యుండిరి. అందుచేత "యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" అను ఉపనిషద్వాక్యభావమును బోధించుటకు ఉపకరించు మౌన వ్యాఖ్యను ప్రదర్శించి చూపెను. అనగా మనస్సు, తన కల్పనా సామర్థ్యమును వాక్కుతో ఎంతవరకు ప్రస్ఫుటించి, తార్కికశక్తి కుంటుపడి, యిక నిస్సహాయముగ నిలిచిపోవునో — ఆ స్థాయియందు కేవల అనుభూతివలన మాత్రమే పరబ్రహ్మతత్త్వ సాక్షాత్కారము (అనుభూతి) అగునని

తెలుపుటకు మౌనవ్యాఖ్యను ప్రదర్శించెను. ఇచ్చట మౌనమన మానసిక, కాయిక, వాచక వ్యాపారరహిత పూర్వక సర్వేంద్రియమౌనమని తెలియవలయును. వ్యాఖ్యయన వి + ఆఖ్య = వ్యాఖ్య, వి=విశేషముగ, ఆఖ్య = తెలియునట్లు, ప్రకటితం = వెలువరించుట. బ్రహ్మనుగూర్చి చెప్పుటకు శబ్దములుగాని, భాషగాని లేదని కేవలాఽనుభూతిచే మాత్రమే తెలియబడగలదనియు సూచించుట. కేవల నిస్సంగత్వపూర్వక మగునదియే పరబ్రహ్మతత్త్వమని సూచించుటకు ప్రదర్శించిన ఒక దివ్యసమాధిస్థితియే ఈ మౌనవ్యాఖ్య. ఇది ఆవరణశక్తి తొలగకయే గలుగు జడసమాధిస్థితి (a trance of a higher order) గాదు. బ్రహ్మజ్ఞానముచే, మూలాజ్ఞానము నశించగా. తత్కార్యములగు జీవభావములు తొలగిపోవగా లభించు దివ్యసమాధిస్థితి. ఈ స్థితియందలివాడే ఆచార్యేంద్రుడు.

ఈ స్థితియందు మాత్రమే - పంచక్లేశములును తొలగిపోయి; చిత్తశుద్ధి పొందియున్న ముముక్షువులకు అనుగ్రహపూర్వకముగ (through divine grace) పరా వాక్ప్రసారముచే మాత్రమే మౌనవ్యాఖ్యాపూర్వకబోధ ఉపపన్నము అని నిశ్చయముగ గ్రహింపవలసియున్నది. పంచక్లేశములన ;- అవిద్యాఽస్మితా రాగద్వేషాభినివేశాః క్లేశాః" (యో।ద। 2—3) The five miseries are ignorence, egoism, attachment, aversion and clinging to life. These are to be conquered, only by their respective opposite concepts ఇవి ప్రతిపక్ష భావనాబలముచే మాత్రమే జయింపబడగలవు.

ఈ విధముగు మౌనవ్యాఖ్యచే ఉద్దిష్టబోధను గ్రహించి బ్రహ్మనుభూతిని పొందినశిష్యులు తమ గురుదేవులగు శ్రీ శంకర భగవత్పాదులను, ముముక్షువుల తరింపచేయు దాక్షిణ్యవృత్తి స్వరూపుడగు పరమశివునిగ

దర్శించి శ్రీ దక్షిణామూర్తి యనిరి. వారికిగలిగిన అనుభూతిని "మౌన. వ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం" "సర్వాత్మత్వమితి స్ఫుటీకృత మిదం" అను శ్లోకములయందు పొందుపరచి, తమకు బోధింపబడిన తొమ్మిది శ్లోకములతో జతపరచి శ్రీ దక్షిణామూర్తి స్తోత్రరూపమున మనకనుగ్రహించిరి. ఇందుచేతనే, బ్రహ్మవిద్యా హృదయగ్రహణమును, బ్రహ్మానుభూతిని ఆకాంక్షించు శిష్యులు ఉదాత్తమగు వృత్తిజ్ఞానముచే. తమతమ గురువులను శ్రీ దక్షిణామూర్తి తత్త్వముగనే సందర్శించి "నగురోరధికం - శివశాసనతః" అని నాలుగుమారులు ప్రవచించి తమ శాస్త్రపాఠముల నుపక్రమించుట సంప్రదాయమై స్థిరపడినది.

గనుక ముముక్షువులమగు మనమును మన చిత్తభాండముల శుద్ధి పరచుకొని మనగురువులను దక్షిణామూర్తి స్వరూపులుగ సందర్శించి శ్లోకభావములను ఆత్మసంచన జేసికొనరయే, విశ్వాసనీయముగనే గ్రహించి, సాధనలేనివారికి సిద్ధిదుర్లభమని విశ్వసించి, సాధన నుపక్రమించి. వేదాంతమున చరమస్థాయిబోధగా శ్రీవారి శిష్యులు గ్రహించిన "మౌనవ్యాఖ్యను" "చిన్ముద్రను" మనమును గ్రహించి, అందుచే ప్రాప్య మగు సర్వాత్మత్వమును, సగుణ నిర్గుణపూర్వక బ్రహ్మనుభూతిని పొంది తరింప దీక్షను చేసికొందము.

మంగళాచరణము :

శ్లో॥ మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వంయువానం।
వర్షిష్ఠాన్తే వసదృషిగణై రావృతం బ్రహ్మనిష్ఠైః।
ఆచార్యేంద్రం కరకలిత చిన్ముద్ర మానందమూర్తిం
స్వాత్మారామం ముదితవదనం దక్షిణామూర్తి మీడే॥

టీక :- బ్రహ్మనిష్ఠైః = బ్రహ్మవిచారణాశీలురగు; వర్షిష్ఠాన్తే వస దృషిగణైః = వృద్ధశిష్య మునిబృందములచే; ఆవృతం = పరివేష్టింప బడిన (చుట్టును కూర్చుండబడియున్న); మౌనవ్యాఖ్యా ప్రకటిత పర బ్రహ్మతత్త్వం = మౌనము అనెడి వ్యాఖ్యచే పరబ్రహ్మ పరమార్థ స్వరూపమును ప్ర క టిం చు చు న్న; యువానం = యువకుడగు; ఆచార్యేంద్రం = ఆచార్యశ్రేష్ఠుడు అగు; కరకలిత చిన్ముద్రం = హస్త మున జ్ఞానముద్రను ధరించినవాడును; ఆనందమూర్తిం = ఆనందమే స్వరూపలక్షణముగ గలవాడును; స్వాత్మారామం = తన ఆత్మస్వరూపము నందే తాను ఆనన్ద మనుభవించునట్టి; ముదితవదనం = సంతోషముతో వికసించిన ముఖము గలవాడును; (అగు), దక్షిణామూర్తిం = దక్షిణ దిగభిముఖుడగు పరమేశ్వరుని; ఈడే = (ప్రబోధ ప్రాప్తి కొరకు, ఆత్మానుభూతికొరకు) స్తుతించుచున్నాను.

తా॥ బ్రహ్మవిచారణా శీలురగు వృద్ధులైన మునిగణము చుట్టును కూర్చుండియుండి పరబ్రహ్మతత్త్వమును తెలియగోర, చిన్నవయసు వాడు, పరమేశ్వర జ్ఞానావతారమూర్తియునగు దక్షిణామూర్తి గురు దేవుడు, ఆత్మానన్దసంతుష్ట ముఖారవిందముతో, మాట్లాడకయే, ఉపనిష దర్థపరబ్రహ్మతత్త్వమును వివరించుచుండెను. జీవబ్రహ్మైక్య సూచకమగు అఙ్గుష్ఠతర్జనీ సంయోగరూప జ్ఞానముద్రను చేతధరించి చూపుచున్న అట్టి సర్వలోకగురుండు విద్యానిధియగు ఆ శ్రీ దక్షిణామూర్తిని జ్ఞానసముద్భవ మునకు స్తుతించుచున్నాను.

ఈ శ్లోకభావమును హృదయంగమముగ గ్రహించుటకు మననము జేయవలసిన ప్రధాన పదములు : 1. మౌనవ్యాఖ్య 2. ఆచార్యేంద్రం 3. చిన్ముద్ర.

వివరణ : బోధనా సౌలభ్యముకొరకు విషయమును గురుశిష్య బోధ్యబోధక ధర్మమును పెద్దలు పరిపాటించుట మనభారతీయ సంప్రదాయము. తదనుసారముగ ఈ స్తోత్ర ముపక్రమింపబడినది. దక్షిణాభిముఖుడై కూర్చొనియున్న యువకుడు దక్షిణామూర్తిగ, అయనచుట్టు వయస్సుచేతను విషయ పరిజ్ఞానముచేతను గొప్పవారు బ్రహ్మనిష్ఠులగు ఋషులు కూర్చొనియున్నట్లు, పరబ్రహ్మతత్త్వమును దెలిసికొన వారాకాంక్షించుచున్నట్లు, మానసిక చిత్రరచన జేయబడెను. ఆ చిత్రమున గురుస్థానము నలంకరించియున్న శ్రీ దక్షిణామూర్తి ఆచార్యేంద్రుడనియు, కేవలమౌనముతో, చిన్ముద్రతో మాత్రమే సూచనాపూర్వకముగ (Symbolic and suggestive method) గంభీరార్థ ప్రతిపాదకమగు నిగూఢతత్త్వమును బోధించినట్లు జెప్పబడెను. మౌనవ్యాఖ్యనుగురించి పైన వ్రాసిన భూమికయందు చర్చించి గ్రహించితిమి. ఇక ఆచార్యేంద్రుడన :- ఇంద్ర శబ్దమునకు ఇంద్రియదత్త జ్ఞానమును గ్రహించువాడనియు (జీవుడు), అట్టి ఇంద్రియ సంజనిత జ్ఞానమును నియమించి ఆ యా ఇంద్రియముల జయించినవాడే "ఆచార్యేంద్రుడు" లేక గీతయందు పేర్కొనబడిన "స్థితప్రజ్ఞుడు" అనియు తెలియనగును.

ఇక చిన్ముద్రయన :

శ్లో॥ అంగుష్ఠ తర్జనీ యోగముద్రా వ్యాజేన దేహినాం।
ప్రత్యగ్రం। బ్రహ్మణో రైక్యం దర్శయన్నో ఽ
వతాచ్ఛివః॥

శ్లో॥ అంగుష్ఠం శబ్దితం ప్రోక్తం తర్జనీ త్వంపదే స్థితం।
తయోర్యోగ్యం తమోస్సంధి శ్చిన్ముద్రా
సా ప్రకీర్తితా॥

అంగుష్ఠముతో (చేతి బొటన[్రవేలు) తర్జనిని (చూపుడు [్రవేలును) కలిపిచూపు ముద్రావిశేషమును చిన్ముద్రయందురు. "ముదం ద్రాతీతి ముద్ర" అనగా ఆనందభావ ద్యోతకమగు శారీరకచిహ్నము ముద్ర ఇట్టిదే నాట్యమునందలి భంగిమయును. నమస్తే ! అనినప్పుడు చేతులు ముకుళించిచూపుటచే ముదము గలుగుచున్నదిగదా ! ముద్రలన ఇట్టి ప్రమోదకారక శారీరక భంగిమలు. చిన్ముద్రయన జ్ఞానముద్ర. దీనిచే దేని విషయక జ్ఞానము ద్యోతకమై ముదము గలిగించుచున్నది? అంగుష్ఠము "తత్" అనగా బ్రహ్మమును సూచించును తర్జని "త్వం" పదమును (శరీరధారియైన జీవుని) సూచించును. ఈ రెంటికలయిక పూర్ణభావస్ఫోరకము. అనగా సమస్త శ్రుతులకు జీవబ్రహ్మైక్యము నందే తాత్పర్యమని గ్రాహ్యము. ఈ కలయికతో లభించు పుచ్ఛము ఏకాత్మసూచకము మధ్యమనుండి చిటికెన వేలువరకు గల మూడువేళ్ళు సచ్చిదానంద లక్షణ సూచకములనియు జెప్పుదురు. కనుక నీ చిన్ముద్ర తత్త్వమసి మహావాక్యమునకు రేఖారూపమగు భంగిమయని గ్రహింపవలయును. (A graphic representation of the identity of the ego and the Supreme principle). ఇది పంచకోశాతీతమగు తత్త్వసూచకము. చార్వాకులు అన్నమయకోశము వరకే పరిమితులు. దివ్యజ్ఞాన సమాజమువారు విజ్ఞానమయకోశమువరకు తత్త్వదర్శనమును జేసిరి. విశిష్టాద్వైతు లానందమయకోశమువరకు తత్త్వమును విస్తరించి గ్రహించిరి. శంకరు లానందమయకోశము నతిక్రమించి కోశరహితతత్త్వమును బోధించిరి.

వైదికవాఙ్మయమున జ్ఞానప్రబోధమునకు నాల్గు రీతు లున్నవి. 1 పదము 2 బీజము 3 సంఖ్య 4 రేఖ. దృశ్యమంతయు నామ రూపములనబడు రెండుతెరగులుగ వ్యవహరింపబడును. అందు నామము

పద, బీజ, సంఖ్యాత్మకము, రూపము రేఖాత్మకము (graphic representation). 1. పదముచే చతుర్వేదములు, స్మృతులు, దర్శనములు గ్రహింపవలయును. అనగా నిది శబ్ద ప్రమాణ రూపము. ఇందుకు సంజ్ఞ "ఓం". 2. బీజము : అర్థసృష్టికి పూర్వము శబ్దసృష్టిజరుగునని శాస్త్రీయులు చెప్పుదురు. ఈ శబ్దము (శబ్దమన నిచట అనాహతధ్వని యని గ్రహింపవలయును; వేదముగాదు) బీజాక్షరరూపమున నుద్బుద్ధమగును. ఇవియే మంత్రములకు మంత్రశక్తులకు మూలము. ఈ ధ్వనియే కుండలినిగా, మూలాధార చక్రమునుండి ప్రసరించి వర్ణమాల (అక్షర సముదాయము)గ రూపొందును. దీనినుండియే జ్ఞానము వటవృక్షముగ వర్ధిల్లును. వటవృక్షము అపారముగ విస్తరించగలదు. గనుక మనస్సుకు జ్ఞానమునకు లింగముగ (Symbol) పరిగణించిరి. శౌనకాదులు వట వృక్షముక్రిందనే తత్త్వబోధలు చెప్పినట్లు గ్రంథములయం దుదహరింపబడుచున్నది. కనుక బీజమనునది ఉపాసన కుపకరించు మంత్రమే. వీటినుండియే విజ్ఞానవికాసము ప్రాప్తించును. గనుక వీటిని బీజములని, యిందలి యక్షరముల బీజాక్షరములని వ్యవహరించుచున్నారు. 3. సంఖ్య ఇది బీజాంతర్గము. ఇది పదమునకు బీజమునకు అనుసంధానముగ నుపకరించును. వైదిక వాఙ్మయమునకు, సంఖ్యకు అవినాభావ సంబంధము గలదు. సంఖ్యచే తెలియబడునదే "ఛందస్సు". 1 నుండి 9 వరకుగల సంఖ్యలకు, వృత్తము నకు అతీతమగు సంఖ్యయే అనంతము (Infinite) దీనినే 'పర' యందురు. పరబ్రహ్మయన అనంతుడు.

4. రేఖ : ఒక పవిత్రభావమునకు, కాగితమ్ముపై, రూపము రేఖలతో (గీతలతో) వ్రాయుట (graph or a geometrical representation of a holy thought) ఈ రేఖలవలననే యంత్రములు, చక్రములవంటి చక్రములు సిద్ధములై, గంభీర భావస్ఫోరకములై

సాంకేతికములుగ నుపకరించుచున్నవి. శ్రీకృష్ణుని చక్రము అజ్ఞానమును భేదించునది. మంచి తాత్త్వికదృక్పథమును జూపునది గనుకనే "సుదర్శన చక్రమని ప్రశస్తికి వచ్చెను. కనుకనే మంత్రములచే ప్రభావితములై ఉపాసన కుపకరించు ఈ చక్రములు, యంత్రములు పవిత్రభావములకు, రూపకల్పన జేయబడిన ప్రతినిధులు. పద, బీజ, సంఖ్యలు నామమును. రేఖలు రూపమును స్ఫురింపజేయును. పై నాల్గురీతులలో రేఖావిధాన బోధకు ప్రాధాన్యము, ప్రాశస్త్యము గలదు. (త్రైత్తిరీయోపనిష దంతర్గత భావము.)

ప్రకృతము : దక్షిణామూర్తి యీ నాలుగురీతులలో నే రీతిని బోధింపగడంగెను ? నేను గ్రహించిన మేరకు 1. సమాధిస్థితిని సూచించు సర్వేంద్రియ మౌనముద్రతోను 2. అంగుష్ఠ తర్జనులు రేఖలుగా రచించిన చిన్ముద్రతోను. రేఖారీతిననే తెలుపవలసిన భావమును బోధించెను. ఇందు మొదటిది సాధనావిధానము. రెండవది జీవేశ్వరుల కభేదభావముతో తత్పద – త్వంపదముల కనన్యతను సూచించు పూర్ణభావ స్ఫోరకముద్ర. "పూర్ణమదః, పూర్ణమిదం, పూర్ణాత్పూర్ణ ముదచ్యతే" యను సత్యమును రేఖారూపముగ బోధించెను. ఇదియే మౌనవాఖ్యా ప్రకటితమగురీతి గానిచో కేవల మౌన "వ్యాఖ్య" యెంత సునిశిత బుద్ధికిని ప్రయోజనము సమకూర్పజాలదేమోనని తోచుచున్నది. It was a symbolic and geometrical representation that was pressed into service to convey the idea of Para-Bramha Tatwam and was known as maunavyakhya prakatitam. నామ, రూప, క్రియా వాచకములచే చెప్పసాధ్యపడని విషయముగనుక సమాధిస్థితి ప్రదర్శనతోనూ, చిన్ముద్రతోనూ బోధించెనని గ్రహించవలసియున్నది. పెదవివిప్పి చెప్పినయడల విశిష్టాద్వైతమే

సిద్ధమగునుగనుక అద్వైత బోధకు లక్ష్యమగు అపరోక్షానుభూతికి ఆచరణ యోగ్యము మౌనవ్యాఖ్యయే.

ఈ భావము నిక మననముజేతము. జ్ఞానసముపార్జనతో, స్వాధ్యాయముతో, సాధనతో కాలచక్రము పరిభ్రమించి పోవుచుండ, గడ్డములు పెరిగియు నెరసియు జడలుగట్టిపోయిన విద్వద్వరిష్ఠులగు ఋషులు, యువకుడగు దక్షిణామూర్తి చుట్టూ నేలచేరిరి? కాలచక్రము పరిభ్రమించి పోవుచున్ననూ ఆయన యువకుడుగనే యెట్లుండెను? విత్యకర్మాచరణకైనను, ప్రశస్తముగాదని చెప్పబడు దక్షిణదిక్కు కభిముఖుడై ఏల కూర్చుండెను? పెద్దలు యువకులచే నుపదేశమును గోరుటయం దర్థమేమి? వారికి గురు దక్షిణామూర్తి యెట్లు యేమి యుపదేశించెను? అను విషయముల మన మాలోచించినయెడల, జుట్టునెరసి, జడలుగట్టిననూ, దేహమున వలీపలితములు గన్పించిననూ, విషయపరిజ్ఞానము మెండుగ నుండిననూ, ప్రయోజనము గలుగదు. వారి యంతఃకరణము, సంపూర్ణముగ అంతర్ముఖమై, యింద్రియార్థముల సంపర్కమునుండి నివృత్తి బొంది, ఏకాగ్రమై కేవల బ్రహ్మాకార వృత్తినిపొంది, అనగా అపరోక్షానుభూతి పొందినప్పుడే, పరబ్రహ్మతత్త్వము బోధపడగలదని భావము. అది చిన్ముద్రచే సూచింపబడుచున్నదనియూ, గ్రహింపవలసియున్నది. సర్వేంద్రియ మౌనపూర్వకమగు సమాధిస్థితి నధిగమించినవారికే పరిపూర్ణుని ప్రాప్తప్రాప్తి తెలియబడునని భావము. దక్షిణదిక్కున కధిపతి యగు యముని నిర్జించి మృత్యుంజయుడై త్రికాలాబాధిత సత్యరూపుడని తెలుపుటకే దక్షిణాభిముఖుడాయెను. అప్పుడు మాత్రమే స్వాత్మారామము నిరతిశయానందముతో గలుగు ముదితవదనము, దేశకాలముల భావముల కతీతుడు గనుక, సదా, యౌవనయువక స్థాయీభావములు సంభావ్యములు. సాధకునకు ఈ శ్లోకమున మననయోగ్యపదము "ఆచార్యేంద్రం"

అనగా ఆసన ప్రణాయామములచే ఏకాగ్రతనొంది, ప్రత్యాహారముచే యింద్రియముల స మీ క రి ం చు కొ ని, ధారణ, ధ్యాన, సమాధులచే తురీయావస్థను పొంది మనోలయముపొంది. సర్వేంద్రియములు మౌన స్థితికి వచ్చిన ఆచార్యేంద్రునకే అపరోక్షానుభూతి, బ్రహ్మానందప్రాప్తి యని భావము. ఇదియే అమృతత్వము నొందుట. "అమృతత్వమానశుః" అను వాక్య లక్ష్యార్థము.

కేవల జ్ఞానయోగమునే అంగీకరించు కొందరు, సాధనకు అష్టాంగ యోగమవసరముగాదు లేక అంగీకార యోగ్యముగాదు, ఉపాసనతో చిత్త శుద్ధి ప్రాప్తించిన పిమ్మట శ్రవణమనన నిదిధ్యాసలచే బ్రహ్మాభ్యాసము జేయుటియే ఋజుమార్గమని వక్కాణింతురు. బ్రహ్మాభ్యాసమనః—

శ్లో॥ తచ్చింతనం తత్కథనం । అన్యోన్యం తత్ప్రబోధనం ।
తదేవైకపరత్వంచ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః ॥

ఇంకనూ నిర్గుణ బ్రహ్మోపాసనను జెప్పుదురు. అహంగ్రహోపాసనను జెప్పుదురు.

ఎట్లనిన :—

శ్లో॥ అహంబ్రహ్మ, పరంబ్రహ్మ । వాసుదేవార్చమవ్యయం।
నారాయణోఽహం నరకాంతకోఽహం ।
స్వయంబ్రహ్మ స్వయం విష్ణుః
స్వయందేవ స్సదాశ్శివః ॥

శక్తిభేదమును రుచిభేదమునుబట్టి యోగ్యమని తోచిన భంగి అనుష్ఠించవలెను. వ్యక్తిగతముగ నాకు మాత్రమష్టాంగయోగ సాధనమే

అభిలషణీయము. ఇందు అంతరింద్రియ బాహ్యేంద్రియ నిగ్రహ విధానములు, ప్రాణశక్తిని పెంచి నియమించు విధానములు, కేవల బ్రహ్మాకార వృత్తి ప్రాప్యమగు సంయమన విధానము బోధింపబడి యుండుటయే యోగము నాకు గల్పించిన ఆకర్షణ. మహాతపస్సంపన్నుడై సాక్షాత్పరమశివసాక్షాత్కారానుభవము లభించిన భస్మాసురుడు, తాను అర్థించిన క్షుద్రాతిక్షుద్రవరము, తరువాత ఆ వరసిద్ధిచే పొందిన ప్రయోజనము యమనియమముల నభ్యసించ నందుననేమో యని నాకు స్ఫురించుచున్నది. (The rays of the midday sun can exercise the effect of heat only when passed through a double convex-lense and concentrated to form a speck of intensive heat; disseminated—they will be ineffective.)

చిన్ముద్రతో జీవబ్రహ్మైక్యబోధ జేయుటన అద్వైతసిద్ధాంతరేఖా రూపబోధయే. కనుక నీస్తోత్ర మద్వైతసిద్ధాంతపరము. ఈ సిద్ధాంతమునకు "కార్యకారణములకు అనన్యత తెలుపుటయే" లక్ష్యము. ప్రయోజనము జీవబ్రహ్మైక్యభావ స్ఫుటీకరణము. ఇందుకు శంకరులు వివర్తవాదమును ప్రతిష్ఠించి దానిని విపులీకరించుటకే మాయావాదమును ప్రతిపాదించిరి. ఆ మాయస్వరూప స్వభావములను దర్పణమునందలి ప్రాతిభాసిక ప్రతిబింబమును, ఐంద్రజాలికసృష్టిని, బాల్యయౌవనాది దశలను, బీజమునందలి అంకురము విస్తరించు విధానమును ఉదహరించి తెలిపిరి. సదాత్మకతత్త్వమును కార్తీకదీప ఛిద్రఘటము నుపమానముగ నుదహరించి బోధించిరి. ప్రతిశ్లోకమునందును మాయాస్వరూపమును స్పృశించి చూపించిరి. చూడుడు :-

1. పశ్యన్నాత్మని మాయయా యని 1 వ శ్లోకమునందున
2. మాయావీవ విజృంభయత్యపియని 2 వ శ్లో॥న

3. అసత్కల్పార్థగంభాసతే యని 3 వ శ్లో॥న

4. మాయాశక్తి విలాస కల్పిత మహావ్యామోహమని 7 వ శ్లో॥న

5. రాహుగ్రస్థ దివాకరేందు సదృశో మాయాసమాచ్ఛాదనాత్. అని 8 వ శ్లో॥న

6. వ్యావృత్తాస్వను వర్తమాన మహమిత్యంత స్ఫురంతం. అని 9 వ శ్లో॥న

7. స్వప్నేజాగ్రతి వాయ ఏష పురుషో మాయాపరిభ్రామిత. అని 10 వ శ్లో॥న

ఇదియంతయు గమనింప కర్ణుడే లేని భారతమా యన్నట్లు-మాయకు వివరణ లేని వేదాంతశాస్త్ర మేమిటనిపించును. ప్రతి శ్లోకము నందును మాయయొక్క ప్రసక్తిని దెచ్చి దాని కార్యముల సూచించి నందున ఈ మాయను గురించి విశేషముగా గ్రహింపవలసిన అవసరము సుస్పష్టమగుచున్నదనుట ప్రధాన విషయము. ఈ విషయమున గ్రమించి ఆ మేలిముసుగును తొలగించిన ప్రత్యగాత్మవగు నీవే పరమాత్మవు, నీవే పశుపతివి అను రెండవ ప్రధానాంశము సుస్పష్టమగును.

ఈ భావమును చిత్తశుద్ధితో గ్రహించిననే భ్రాంతి యననేమో, దానిని తొలగించుకొని తన్నుతాను సాక్షాత్కరించుకొనుట యెట్లో తెలిసి అద్వైత సిద్ధాంత భావము స్థిరపడును. చరమ శ్లోకమున ఫలశ్రుతియందు "సర్వాత్మత్వ మహావిభూతి సహితం స్యాదీశ్వరత్వం స్వతః" అను వాక్యమునగల "సర్వాత్మత్వము" అను పదమే నాలుగు మహావాక్యము లకు యీ స్తోత్రమునకును లక్ష్యము. ఈ స్థితిని బొందుటకు సాధకుడు ఆచార్యేంద్రుడు గావలయును. అట్టి ఆచార్యేంద్రుడగు దక్షిణామూర్తిని అంతర్ముఖత కొఱకు, ఏకాగ్రతకొఱకు, బ్రహ్మాకారవృత్తి ప్రాప్తికొఱకు స్తుతించుచున్నాను. ఇక విషయ విచారణ కుపక్రమింతము.

వి ష య ప్రా రం భ ము

శ్లో॥ విశ్వం దర్పణ దృశ్యమాన
నగరీతుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా
బహిరివోద్భూతం యథా నిద్రయా
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే
స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం
శ్రీ దక్షిణామూర్తయే ॥ 1

టీక : దర్పణ దృశ్యమాన నగరీతుల్యం = అద్దములో కనుపించు నగరముతో సమానమగు; నిజాంతర్గతం = తనయందే స్ఫూర్తి గలిగియున్న; విశ్వం = జగత్తును; యథానిద్రయా = ఎట్లు నిద్రచేతనో (తథా = అట్లు): మాయయా = మాయాశక్తిచేత; ఆత్మని = తనయందు; బహిః ఉద్భూతమ్ ఇవ = వెలుపల నున్న దానివలె; పశ్యన్ = చూచుచు; యః = ఎవ్వడు: ప్రబోధసమయే = బ్రహ్మసాక్షాత్కార సమయమున; అద్వయం = నిష్ప్రపంచమగు అనగా ఆత్మతత్త్వమగు; స్వాత్మానమ్ ఏవ = బ్రహ్మాఽభిన్న (సచ్చిదానన్ద) ఆత్మస్వరూపమునే; సాక్షాత్కురుతే = అవ్యవధానముగ అనుభవించునో, తస్మై = ఆ, శ్రీ గురుమూర్తయే = తత్త్వజ్ఞానోపదేశకాచార్యుడగు; శ్రీ దక్షిణామూర్తయే = శ్రీ దక్షిణామూర్తి కొఱకు; ఇదం నమః = ఈ నమస్కారము.

తాత్పర్యము : విశ్వము అనగా చరాచర ప్రపంచము. అద్దములో కనిపించు నగరమును పోలినదియై తనయందే యున్నది. నిద్రావశమున స్వప్నద్రష్టకు బాహ్యదేశము నందున్నట్లు తోచిన యట్లు, మాయా శక్తివలన, జాగ్రదవస్థయందును ఆత్మయందే, బాహ్యదేశము నందువలె స్ఫూర్తినిచ్చును. స్వప్నమును అనుభవించి తిరిగి జాగ్రదవస్థకు వచ్చినప్పుడు, అనగా మెలకువరాగానే ద్రష్టయగు ఆత్మ యొక్కడే మిగులును. స్వప్న ప్రపంచమంతయు అదృశ్య మగును. అట్లే బ్రహ్మాత్మైక్య సాక్షాత్కారము (ప్రబోధము) కలుగగా జాగ్రత్ప్రపఞ్చము లుప్తమగును. అధిష్ఠాన బ్రహ్మాత్మ సచ్చిదానంద స్వరూపము అనుభవగోచర మగును. అట్టి బ్రహ్మా త్మానుభవ సంపన్నుడైన గురుమూర్తి శ్రీ దక్షిణామూర్తికి ఈ నమస్కారము.

వి వ ర ణ :

ఈ స్తోత్రమునగల శ్లోకములకు యీ శ్లోకము మకుటము వంటిది. బీజమునందు అంకురము, మొక్క, చెట్టు, పత్ర పుష్పఫలములు కారణ రూపమున నున్నట్లు యీ శ్లోకమున అద్వైత సిద్ధాంత మౌలిక సూత్ర ములు గర్భితముగ నున్నవి. ఇందు "నిజాంతర్గతం" "యథానిద్రయా" అను పదములు మనన యోగ్యములు. జీవేశ్వర జగత్తులను అధ్యారోప త్రయము, సర్వాధిష్ఠానమగు పరమాత్మయందు అంతర్గతములే. కనుక జాగ్రదవస్థ యందును ఏవేవి ఏ ఏ రూపముల భాసించిననూ, ఏకాత్మయగు పరమాత్మ యందే వివర్తమున ప్రతిభాసించునుగాని 'ఏకమేవా అద్వితీయం' అన్నట్లు ఆ బ్రహ్మపదార్థము కేవలము ఒక్కటియే-దానికన్న రెండవది యగునది లేనేలేదు. ఆ భాసించు నామరూపములకు స్వతంత్ర సత్తలేదు. మాయాశక్తిచే ఆత్మకు బాహ్యదేశమున నున్నట్లు స్ఫురించిననూ ఆత్మాం

ర్గతములే: అన్యములుగావు. కనుక ఏకైక స్వరూపుడు సర్వాత్మ. ఈ భావములను తేటమాటలతో నిట్లు జెప్పవచ్చును. సూర్యచంద్ర నక్షత్ర ములతో దృశ్యమానమగుచున్న ఈ విశ్వము సర్వము అద్దములో మనకు గన్పించు పట్టణ ప్రతిబింబమువలె పరమాత్మయందు మాత్రమే భాసించు చున్నది. ప్రతిబింబించిన రూపము అద్దమునకన్న భిన్నముకాదు. అద్దము నందే అంతర్గతమై, దానినుండి వేరుజేయ వీలులేకున్నది. పోనీవస్తువు అందు లేదాయనిన పొడుగు, వెడల్పు, ఎత్తు అను మూడు కొలతలతో సహజ వర్ణములతోసహా మేధావుల మనుకొనుచున్న మనకే కనబడు చున్నదే. ఉన్నయెడల అద్దమునుండి విడిపరచుటకు సాధ్యముగ లేదే! పోనీలోపల యున్నదేమో అద్దమును పగులగొట్టి చూతమన్న, అద్దము పగిలిన యీ ప్రతిబింబమునకు ఆధారమే లేక అది అదృశ్యమే యగును. కనుక దానికి స్వతంత్రసత్త లేదనియు తనకాధారమగు అద్దము నందే అంతర్గతముగ అద్దమునకు భిన్నముగాకయే యున్నదని పర్యవసించు చున్నది.

కనుక ఇప్పుడు విచారణీయాంశ మేమన :— ఈ ప్రపంచమునకు వస్తుసత్త యున్నదా లేదా? లేనియెడల నిది యథార్థముగ నున్నట్లే మూడు కొలతలతో నామ, రూప, గుణ, క్రియావాచక యోగ్యముగ ఎట్లు తెలియబడుచున్నది? ఈ విషయమును విశదపరచుటకే "యథానిద్రయా" అను పదమును ప్రయోగించినారు. అజ్ఞాన దోషముతో గలిగిన నొక స్థితి నిద్ర. ఈ నిద్రయందు, జాగ్రదవస్థయందు గలిగిన యనుభవములు సంస్కార బలముచే వాసనలు (repressed reminiscences) కారణ రూపముగ నేర్పడి, మనస్సునందే స్థిరపడియుండి, వాని కుత్తేజము గలిగినప్పుడు ఆత్మసత్తా మాత్రముగ కలలుగ పరిణమించును. ఒక గ్రామఫోను రికార్డును పరిశీలింపవలెను. అందుగల గాడుల (grooves)

యందు సూది రాపిడిచే నుత్తేజము గలిగినప్పుడు శబ్దముద్భద్ధమగు చున్నది. ఒక ఫిలిం రీలుపై దాని అందున గల తేజోరూపమగు రేఖపై వెలుగు ప్రసరింపబడ, క్షోభ ప్రారంభమై, చలన చిత్రములు, మాటలు పాటలు, భావములు, భంగిమలు, నవరసములొలుక ప్రాదుర్భావము పొందును. అదియొక జగత్తే, చిత్రజగత్, జాగ్రత్ నందలిజగత్తే— రూపొందును. మన అంతఃకరణమునందలి, వాసనలు. సంస్కారములు, కారణరూప కర్మబీజములు యిట్లే ప్రభావితము లైనప్పుడు ఏదో ఒక విధమగు అజ్ఞాన దోషమువల్ల స్వప్నజగత్తుగనో, జాగ్రత్‌నందలి జగత్తు గనో ప్రాదుర్భవించు చుండును. ఇందు లేనివి యున్నట్లుగను, ఉన్నవి లేనట్లుగను భావింప నవకాశములున్నవి. ఇపుడు మనము గమనింప వలసిన యంశము లేవియన :—

స్వప్న ప్రపంచమంతయు స్వప్నద్రష్టకు ఆత్మగతమేగాని బయట లేదు. ద్రష్టతాను విమానమెక్కి అమెరికాపోయి, పలువురతో ప్రసంగించి. వ్యవహారములు పరిష్కరించుకొని వచ్చినట్లున్ననూ — తానెక్కిన విమానము, పయనించిన వేలాదిమైళ్ళ దూరము, ఆ దూరమున కావలనున్న అమెరికా దేశము, తనతో వ్యవహారగోష్ఠి జరిపిన వ్యక్తులు అన్నియు, అందఱును ద్రష్ట మెదడునందే యున్నారుగాని బయట లేరుగదా! ఇంకొక విశేషమేమన ద్రష్టయు ఆ యా కల్పిత స్వప్న జగత్తులోని వ్యక్తియే: తనను తానే తనవంటి అన్యవ్యక్తిగా గ్రహించు చున్నాడు. అనగా ఆత్మయందే, భావనాబల ప్రభావముచే అధ్యారోపితుడై తనచే తానే చూడబడుచున్న వాడాయెను. స్వప్నద్రష్టను తానే ఒక అద్దముగ మనము పోల్చి చెప్పిన, అతనికి ఆ స్వప్న ప్రపంచమంతయు అంతర్గతమే గదా! అతని నుండి దానిని విడదీయలేము. అతడు ఆ స్వప్న ప్రపంచము అప్పు డవిభాజ్యములు దృష్టాంతమున అద్దము లేనియెడల

నగరములేదు. అనగా అధిష్ఠానము లేనియెడల ఆరోప్యమేలేదు. తాను (స్వప్నద్రష్ట) లేనియెడల ఆ స్వప్నప్రపంచమే యుండదు. అయితే నగరము లేకున్నను అద్దముండును, స్వప్నప్రపంచము లేకున్నను తానుండును. గాఢసుషుప్తియందు నిద్రాణములై యున్న ఇంద్రియములకు శబ్దముచేగాని, స్పర్శచేగాని, వెలుగుచేగాని కొంత క్షోభ లేక సంచలనము గలిగినప్పుడు, సుషుప్తియందున్న పురుషుడు తిరిగి జాగ్రత్‌కు వచ్చును. శాస్త్రబోధయు యిట్టి సంచలనము (mental vibrations) గలిగించుటను ప్రబోధమందురు. ప్రబోధమున జాగ్రత్‌కు వచ్చినప్పుడు స్వప్న ప్రపంచమంతయు మిథ్యయని తెలియబడును. కనిపించినను ఉనికి లేనిదియే యని గ్రాహ్యమగును.

[N. B. :- వేదాంతమున సాధారణముగ మిథ్య, మాయ యను పదములు ఏకార్థముగ ప్రయోగింపబడుచున్నవి. కాని ఈ రెండుపదములకు భావములు భిన్నములని నాకు గ్రాహ్యమగుచున్నది. మాయ సత్వ రజస్తమో గుణాత్మకమగు శక్తి స్వరూప విశేషము; మిథ్యయన లేనిది యున్నట్లు స్ఫురించుట లేక ఒకటియై యుండి మరొక్కటిగ స్ఫూర్తి కలుగుట, అవిద్యయొక్క కార్యమని నా తాత్పర్యము. "బ్రహ్మసత్యం జగన్మిథ్య" అని శంకరులు చెప్పిన దానిని శ్రీ వి నో బా భా వే "బ్రహ్మసత్యం జగత్స్ఫూర్తి" యని సవరించెను. ఆయన దెలిపినది ప్రాతిభాసిక సత్యమని శంకరులు దెలిపినది పారమార్థిక సత్యమని అనగా కార్యకారణములు కనన్యత్వమని మనము గ్రహించిన మనకు సరియగు దృక్పథము ప్రాప్తించ గలదు]

ఇప్పు డజ్ఞానవిశేష కార్యమగు నిద్రయు, దానియందు సంస్కార బలిమిచే భాసించిన స్వప్నమును, ఉనికి లేనిపనియే గ్రహించినాము. ఈ తాత్కాలిక లేక ప్రాతిభాసిక అజ్ఞానమునకు అందరూ వాడు పదము

"తూలాజ్ఞానము" గాక, అనాదియై, అనుస్యూతముగ నున్న "మూలా జ్ఞానము'' అను మరియొక గొప్ప అజ్ఞానము అతని నావరించి యున్నది. సద్యః ప్రబోధము పొందిన తన జ్ఞానేంద్రియములు, సుషుప్తియందలి విలీనస్థితి నుండి, జాగ్రత్‌నందలి (బోధ) జ్ఞానస్థితికి వచ్చిన వెంటనే ఆ మూలాజ్ఞాన ప్రభావముచే జాగ్రత్ప్రపంచమును సత్యవస్తు రూపముగనే భావించును. కనుక ప్రధానముగ మనము తెలిసికొనవలసిన విషయము లెవ్వియన :—

(1) ఈ జాగ్రత్ప్రపంచము యొక్క స్వరూప స్వభావము లెట్టివి? (2) ఇది ఎట్లు సృష్టియై రూపొందినది— స్వభావ సిద్ధముగనా లేక మరియొక నిమిత్తము చేతనా? అగునెడల ఆ నిమిత్తము యొక్క స్వరూపమెట్టిది? (3) దీనికి ఉపాదానమగు నొక మూలపదార్థమేదేని గలదా? (4) సర్వమునకు అధిష్ఠానము పరమాత్మయందురే — అట్టి పరమాత్మతో దీనికి గల సంబంధమెట్టిది? ఆ పరమాత్మ దీనికి కారణ రూపమా? ఆ కారణ రూపమునకిది కార్యరూపమా? ఈ రెంటికిగల సంబంధమెట్టిది? స్వప్న ప్రపంచమువలె నిది యున్నట్లు స్ఫురించినను బ్రహ్మజ్ఞానముచే ప్రబోధము గలిగిన యెడల ఇదియును స్వప్నతుల్యము గనే, లేనిదిగనే నిర్ధరింపబడ గలదా? తత్వశాస్త్రము యొక్క సారాంశ మంతయు వీని సమాధానములయందే సంప్రాప్తమగును. ఈ దృష్టితోనే శంకరులు దర్పణము నుదాహరణముగ సూచించి "నిజాంతర్గతము" "యథానిద్రయా" యను పదప్రయోగముతో విశదీకరించిరి. ఈ పదముల యందలి భావములు ఒక్క అద్వైతమునకు మాత్రమే వర్తించును. అందుచేత అద్వయ సిద్ధాంతమునకు పునాదులగు 1. "కార్యకారణముల కనన్యత్వ భావము" 2. మాయా తత్త్వము జీవజగత్తులపై దాని ప్రభావము, 3. మిథ్యారూపముల పొసంగజేయు వివర్తము

4. భ్రాంతి జ్ఞానవిమర్శ, 5. అధిష్ఠానము, దానిపై తత్త్వత్రయాధ్యారోప ప్రక్రియ, 6. అపవాదప్రక్రియ మున్నగు అంశముల శ్రవణమనన నిదిధ్యాసలచే సాధించి గ్రహించిననే గాని సమాధానములు చిత్తశుద్ధితో హృదయంగమములు గాజాలవు. ఇటుల గానప్పుడు, అనుభూతి అసత్యమే. విజ్ఞానము విలాసమాత్ర వైభవము మాత్రమే యగును.

ఒక జిజ్ఞాసువు అద్వైత సిద్ధాంతమును బోధించుమని ఒక ఆధునిక విద్యావంతుని కోరగా ఆయన "ఏమున్నదయ్యా! ఒక శుక్తి (ముత్యపు చిప్ప) ఒక రజ్జువు (త్రాడు) ఒక స్థాణువు (దుంగ లేక మొద్దు) తెచ్చుకో, వాటితో ప్రయోగ పూర్వకముగ బోధించగలను" అన్నాడట. ఆయన వానిని సమకూర్చుకొని వచ్చెనట. అప్పుడు బోధకుడు చూడు! యీ ముత్యపుచిప్ప ఒకవైపున తెల్లగా యున్నది. దీనిని ఎండలో చూచినప్పుడు అది వెండివలె గన్పించును. దీనిని శుక్తి రజత భ్రమ యందురు. ఆ త్రాడును నేలపై వేసి మెలికలు చుట్టాయి. సంజచీకటి వంటి ఆ మసక వెలుతురులో అదిగో! చూడు! త్రాడు పామువలె కనిపించుటలేదా? అవును దీనిని రజ్జుసర్ప భ్రాంతి యందురు. సంజచీకటిలో ఆ దుంగను పెరటిదొడ్డిలో పెట్టిచూడు దొంగలాగున కనిపించును. కనుక ఇది యంతయు భ్రాంతివలన గలుగుచున్నది. ఈ ప్రపంచము అంతియె, మనము లేనిదానిని చూచి ఉన్నదనుకొనుచు యున్నాము. ఇట్లనుకొనుటను "మిథ్యయందురు". అనగా లేనిదియే ఉన్నట్లు మనకు కనిపించుచుండును. నీ ఆత్మను జీవాత్మయందురు. సర్వవ్యాపకమైన ఆత్మను పరమాత్మ యందురు. ఇప్పుడు నీ జీవాత్మ ఆ పరమాత్మతో ఐక్యమైన దనుకో, దీనినే "తత్త్వమసి" (అది–నేను–అయితిని) అను మహావాక్యము ద్వారా బోధించిరి. ఇంకను నీ బుద్ధికందని ప్రతి విషయమును మాయా కల్పితమని తెలుసుకో. ఇంతే అద్వైతమంటే. ఇది బాగా వల్లించు, నీవు

ముక్తుడవగుదువని బోధించనాడట. ముక్తుడనైతే యీ ప్రపంచము నందలి వ్యవహారము లెట్లు జరుగును స్వామీ! యన ఆ గురువుగారు అవి జరుగుచునే యుంటవయ్యా! నాగులచవితి నాడేగదా మనము పామును నాగేంద్రుడని పాలుపోసి పూజించుట? పంచమినాడు పుట్టలోనుండి బయటకు వచ్చిన యెడల, దానిని పామని కర్రతో కడతేర్చుట లేదటయ్యా? అని బోధించెనట. ఇట్టిదిగాదు అద్వైతము. ప్రపంచ స్వభావ స్వరూపముల తాత్వికముగ గ్రహించి, జగత్తు ఏ దృష్టితో, ఏ స్థాయిలో, ఏ అధికారికి మిథ్యగాగలదో గ్రహించి, జగత్తునుకూడ సాపేక్షిక దృష్టితో మన్నించి, తీవ్రమగు సాధనతో అనగా — రజస్తమో గుణముల నదుపునకు దెచ్చుకొని, ఆచార్యేంద్రుడై, వాసనల దుడిచివైచి కొని, సత్సంస్కారముల పాదుకొల్పుకొని, రాగద్వేషాదుల నుండి నివృత్తి పొంది, సత్వసంపన్నుడై శుద్ధచిత్తుడై బ్రహ్మాకార వృత్తియందు అవిచ్ఛిన్నముగ అనుభూతి పొందుటయే అద్వైత సిద్ధికి సాధనయగుగాని, మాయ, మిథ్య, భ్రాంతి, ఆత్మ, పరమాత్మ, తత్త్వమసి అను పదముల పఠనమాత్ర పాండిత్యముచే అద్వైత సిద్ధియను ప్రజ్ఞానప్రాప్తి లభించదని సాంప్రదాయము.

ప్రకృతము :— ఈ శ్లోకమునందు దర్పణ దృష్టాంతముతో జెప్పబడిన ఈ జగత్తుయొక్క స్వరూప స్వభావముల గ్రహించుటకు గ్రంథ ప్రారంభములో జూపిన పరిణామ ఆరంభ, వివర్త, ఆభాస (ఆవిర్భావ పూర్వకము) వాదము ఉపకరించును. మరియు "స్వాత్మానమే వాద్వయం" అను పదమునందలి సూక్తిని దెలియుటకు జైవవాదములగు ప్రతిబింబ అవచ్ఛేద, ఆభాస (మిథ్యాపూర్వక) వాదములందలి విజ్ఞానముపకరించును. ఈ వాదములు ప్రధానముగ దెలుపు విషయమేమన — జీవుడు ఒక భూమికయందు ప్రమాతగ (ఇంద్రియముల ద్వారా భ్రమను పొంద

పడు) పరిగణింపబడు చున్ననూ, అంతఃకరణముకన్నను విలక్షణమగు శుద్ధచైతన్య తత్త్వముగ మహాకభూమికయందు భాసించువాడే, సవాత్మకుడే అగును అని బోధింపబడెను. ఈ మూడు వాదములును శంకరు లామోదించినవియే, అద్వైతపరములే. స్వలక్షణము ఈశ్వరునిది, విలక్షణము జీవునిదని గ్రహింపవలెను.

ఈ శ్లోకభావమును గ్రహించుటకు, అద్వైత సిద్ధాంత బోధలయందు మనకు తఱచు వినవచ్చుచుండు "భ్రాంతి" "భ్రమ" యను పదములను ముందు విమర్శించి గ్రహింపవలయును. నీవు భ్రమపడు చున్నావయ్యా! అన్న విషయము ఒకటిగా నుండ ఇంకొకటిగా గ్రహించుచున్నావని భావము ఈ భ్రమయను భావము ఆత్మపరమాత్మల విషయమున అనగా — వేదాన్తశాస్త్ర విషయములయందు వాడునప్పుడు అధ్యాస, అవిద్య, అజ్ఞానము అను పదములతో చెప్పబడుచున్నది. అవిద్యచే ఆవరింపబడిన దశ అజ్ఞాన దశ. ఈ యజ్ఞానము రెండు విధములుగ నున్నది. (1) మూలా విద్య : ఇది అనాది, అనగా సృష్టికి పూర్వము నందుకూడా యున్నది. ఇది జ్ఞానముచే నశించును. (2) తూలావిద్య : ఇది మన నిత్య వ్యవహారముల యందు కనిపించును. అనాత్మ వస్తువుల విషయమున సంభవించు చుండును. ఇంద్రియముల ద్వారా మనస్సుచే సముపార్జింపబడును. ఇది వృత్తి జ్ఞాన సంభవము. ఇది అధిష్ఠాన వృత్తి జ్ఞానముచేతనే నశించును. మూలావిద్య నిర్విశేషాజ్ఞానమని (absolute nescience) తూలావిద్య (relative nescience) సాపేక్షిక అజ్ఞానమని తెలియుచున్నది.

ఈ యధ్యాసను మూడు విధములుగ మనము విభజించి తెలియ వలయును. 1. జీవుని విషయమున 2. జగద్విషయమున 3. ఈశ్వరుని విషయమున. వీనినే తత్త్వత్రయాధ్యాస లందురు. అద్వితీయమగు ఆత్మ సాక్షాత్కారము గలిగినప్పుడే ఈ తత్త్వత్రయాధ్యాస నశించును. అప్పుడు

"బ్రహ్మవిదాప్నోతి బ్రహ్మ" యను సత్యమనుభూతమగును. అనగా ప్రమాతయగు జీవుడు తనను పరమాత్మగనే అనుభూతి పొందును.

భ్రమ రెండు విధములుగ నున్నది. (1) ఆత్మాధిష్ఠానక భ్రమ : ఇది స్వప్న దృష్టాంతముతో తెలియపరచబడినది. (2) అనాత్మాధిష్ఠానక భ్రమ : ఇది శుక్తి రజత భ్రమ యని రజ్జు సర్ప భ్రాంతియని జడపదార్థములను అధిష్ఠానములుగ గ్రహించి చెప్పబడినది. ఇచ్చట శుక్తి అధిష్ఠానము, దా.యందు భాసించిన వెండి అధ్యారోపము. ఈ విషయము ముందు చెప్పబడిన వివర్తవాదమున విపులముగ చర్చించబడినది. గనుక వివర్తవాద విచారణయందు దూరమున వెండి యున్నట్లు తలంచి దానిని మూటగట్టుకొన నుత్సహించితిమి. ఇప్పుడా వెండి దాపునకు పోయి దానిని మూటగట్టి తెచ్చుకొందము. అనగా, ఇంతవరకు దృశ్యమును గమనించినాము. ఇక దీని కధిష్ఠానమేదో తెలియవలయును. ఆరోపమగు వెండిని తీసికొన దగ్గరకుపోవగా అది ముత్యపు చిప్పయని, దానిపై తెలుపు వెండివలె మెరసినదేగాని వెండిగాదని తెలిసినది. శాస్త్రమున అధిష్ఠానముగ జెప్పబడినది పరమాత్మ. ఆత్మయొక్క స్వరూపమును దెలిసికొనినగాని అందుపై ఆరోపమెట్లు ప్రాప్తించునో, వివర్తమననేమో గ్రహింపలేము. ఈ విషయమును వివరించుటకే శంకరులు ఉపమాన మొకటి సహకారి గాగలదని సర్వాధిష్ఠానమగు పరమాత్మ నొక యద్దముతో బోల్చి ఈ ప్రపంచము నా యద్దమునందు ప్రతిబింబించిన నగరముతో బోల్చి చూపిరి. అద్దమునం దానగరము అంతర్గతమై యున్నట్లే పరమాత్మ యందీ జగత్తు అంతర్గతముగ నున్నదనియు, అయినను అధ్యాస యనబడు మాయాశక్తి ప్రభావముచే, ఆత్మకు బాహ్యముగ నున్నట్లే దోచుచున్నదనియు బోధించిరి. నిద్రయందు కల ఎట్లో మెలకువ కాలమందును (జాగ్రత్తునందును) జగత్తు కలవంటిదే అయి ఆత్మయందే

యుండియు బాహ్యముగ నున్నట్లు మాయాశక్తి వలన తోచుచుండుననిరి. సరి. ఇక్కడ నొక యుపాధి దానియందు జీవుడు, ఎదుట వెండివంటి ఒక శుక్తి యున్నవి గనుక ఈ జీవునకు భ్రాంతి గలిగినది. మరి ఈ సమిష్టి జగద్విషయమున భ్రాంతి ఎవరికి గలిగిన, జగత్తు దృశ్యముగ ప్రభవించినది ? జ్ఞానము ఎవరికి గలిగిన ఈ జగత్తు పగటియందే జాగ్రత్తులోనే గలుగు కలగా తెలియబడునని ప్రశ్న గలుగు చున్నది ? ఈ సందేహమునకు సమాధానమే – అజ్ఞాన పరిణామముచే గలుగు బింబ రహిత ప్రతిబింబమే, ఈ వివర్తవాద హృదయము. అనగా అజ్ఞాన పరిణామ దోషము అధిష్ఠానమగు ఆత్మయందు గలిగిననే ఈ ప్రతిబింబము ప్రాప్తియగు చున్నదని గ్రాహ్యాంశము. ఈ భావమును లెస్సగా గ్రహించుటకు ముందు ఆత్మయన నెట్టిది ? ఈ ఆత్మ జీవుడని ఎట్లు వ్యవహారమునకు వచ్చును ? ఈ జీవునకు భ్రాంతి యెట్లు గలుగును ? అని చర్చించి తెలిసికొను టెంతయు ఆవశ్యకము.

ఆత్మను తత్త్వశాస్త్రము నందిట్లు నిర్వచించి, దెలిపిరి :–

శ్లో॥ యచ్చాప్నోతి యదాదత్తే। యచ్చాత్తి విషయానిహ।
యచ్చాస్య సంతతో భావః। తస్మాదాత్మేతి కథ్యతే॥
(కఠోపనిషత్ భాష్యము : శంకరులు)

ఆత్మ పదమునకుగల వ్యుత్పత్త్యర్థముల ననుసరించి నిర్వచించి తెలుపబడినవి. అవి :

1. ఆప్నోతి ఇతిఆత్మ, ఆప్నోతి = పొందునది. అనగా నిద్రాకాలమున అంతఃకరణవృత్తులు – పసంహృతము లైనప్పటి, స్వరూపస్థితి ఆత్మః లోనికి గ్రహించి తిరోభావస్థితి (Involution) పొందునది ఆత్మ.

2. ఆదత్తే ఇతిఆత్మ : ఆదానము = గ్రహించుట. జాగ్రత్కాలమున దృశ్యముల గ్రహించువాడు ఆత్మ.

3. అత్తి ఇతిఆత్మ : అత్తి=తినుట. అనగా భోగించుట. శబ్దస్పర్శాది యింద్రియార్థముల ననుభవించువాడు ఆత్మ.

4. అనుస్యూతోభవతి ఇతిఆత్మ : అవస్థాత్రయము నందనుస్యూతము గను; పదార్థ పరిణామ ప్రక్రియ యందును (flux) సంతత భావమున నుండువాడు ఆత్మ.

Atma is the original principle of consciousness which is a Continuum, irrespective of space and time, wakefulness, dream or sleep and of the same nature even with respect to the flux in the case of matter. It exhibits a process of involution during whole some sleep and an evolutionary purposeful projectivity during the dream and wakeful states. In every sphere, both animate and the inanimate it purvades the monads (Trigunas), which contribute to us the understanding of its subtlest state and the primal absolute. In every branch of knowledge say Physics, Chemistry, Biology etc., we have unitary ultimates as a quantum, an atom and a gene, contemplation on which, helps one to conceive the transcendental state of Atma and the state of actual experience of the thing-in-itself. The sought for thing-in-itself, which could only be experienced is Atma.

ఇక విచారింతము :— I యచ్చాప్నోతి = ఎందువలన పొందు చున్నాడు ? ఏమి పొందుచున్నాడు ? గాఢనిద్రావశుడై యుండు సమయ

మున అజ్ఞానముతో నేకీభావము పొందుచున్నాడు అని తాత్పర్యము. ఇచ్చట పర్యవసించునది అజ్ఞానము. ఇది కారణశరీరమునకు సంబంధించినది. అజ్ఞాన రూపమగు నీకారణ శరీరము నభిమానించు ఆత్మ ప్రాజ్ఞుడు. ప్రాజ్ఞడను పదమునకు రెండు విధములగు అన్వయము గలదు. ప్రజ్ఞ ఏవ ప్రాజ్ఞః = బాగుగా తెలిసినవాడు; ప్ర+అజ్ఞః=ఏమియు తెలియనివాడు. ఇచ్చట నిద్రా కాలమున (సుషుప్తియందు) ఆత్మ అజ్ఞానోపాధికుడై నందున, ప్రాజ్ఞడను సాంకేతిక పదముచే, బహిర్విషయముల తెలియనివాడని వ్యవహారమునకు వచ్చెను.

II యదావర్తే : ఏది జాగ్రదవస్థయందు తనకు గలిగిన యనుభవ ములను వాసనలుగ గ్రహించునో (formation of instincts), సుషుప్తియందు వానిప్రత్తేజము గలిగిన యెడల నవి స్వప్నములుగ పరిణమించును. "నిజాంతర్గతము" "ఆత్మాధిష్ఠానకము" అను పదముల చక్కగా నర్థము చేసికొనవలెనన్న మనకు ఈ స్వప్న ప్రపంచమే ప్రధానము, ఇందు మనము విచారించవలసిన అంశమేమన :— స్వప్న ప్రపంచము కలగనువానికి అంతరమై యున్నదా ? బాహ్యమున నున్నదా ? లేక అంతరముగ నుండియు బాహ్యముగ నున్నట్లు స్ఫూర్తి నిచ్చు చున్నదా ? స్వప్నమున తాను ద్రష్టయై ఆ జగత్తునందంతటను తాను వ్యవహరించుచున్న యెడల ఆ జగత్తు అతనికి బాహ్యమున నున్నట్లే గదా ! అయినను, స్వప్నమున తాను చూచిన అమెరికా మున్నగు విదేశములు, అప్పటికిపోవ తానెక్కిన విమానములు అతని మస్తిష్క మును అద్దముసంచి యున్నవిగదా ! ఇట్టి స్వప్న జగత్తునుండి, ఏదో శబ్దము చేతనో, స్పర్శచేతనో, వెలుతురు చేతనో ప్రబోధము గలిగి మెలకువ వచ్చినప్పుడు, తన ఇంద్రియములు పరల జాగ్రత్ప్రపంచ మందలి యింద్రియార్థములతో సంయోగము జెందినప్పుడు వాని యనుభవ

మును మరల పొంది మరల ఈ జాగ్రత్తనుకొనబడు (మెలకువలోనే వచ్చుకల) స్వప్న తుల్యావస్థయందు వ్యవహారమునకు వచ్చును. అప్పుడు తానుగన్న కలలోని ప్రపంచము ఆతనికి మిథ్యగా ప్రాతిభాసికముగ (చూచునంత సేపే నిజము) తోచును. లేనిదానినే యున్నదానిగ తలంచితి నని తెలిసికొనును. "అసత్కల్పార్థగం భాసతే" యని నిర్ధరించు కొనును. ఈ స్వప్న ప్రపంచ సృష్టికి అనువగు వాసనలు జాగ్రత్తునందు గలిగి, సూక్ష్మ శరీరము నాశ్రయించి యుండును. సూక్ష్మ శరీరము నభిమానించుతరి, సూక్ష్మ శరీరము తైజసాంశ ప్రధానమైనది గనుక, ఆత్మ తైజసుడని వ్యవహారమునకు వచ్చెను. ఇప్పుడు మనము తెల్సి తెలియవలసిన విషయము – స్వప్నమునుండి జాగ్రత్తుకు వచ్చినప్పుడు స్వప్నమును మిథ్యగా భావించినట్లు ఈ జాగ్రత్ప్రపంచము (బుద్ధీంద్రి యాదులతో తెలియబడు ప్రపంచము) గురూపదేశము చేతనో లేక శాస్త్ర జ్ఞానము చేతనో, యోగసాధన చేతనో, ఉపాసన చేతనో ప్రబోధము పొందిన, ఈ జాగ్రత్ప్రపంచమును కూడ స్వప్నతుల్యముగ నిర్ణయించు కొనుట కవకాశము కలదాయన, కలదు. అష్టాంగయోగ సాధనలచే, రజస్తమముల నదుపులోనికి దెచ్చుకొని, వాసనలను లయింపజేసుకొని, సత్సంస్కారముల ప్రతిష్ఠించుకొని, ఏకాగ్రతనొంది సజాతీయ వృత్తి యందవిచ్ఛిన్న ధ్యానముతో బ్రహ్మాకారవృత్తిని ప్రాప్తింప జేసికొనుటయే సాధన. దీనివలన తురీయావస్థ ప్రాప్తించి అపరోక్షానుభూతి నొందుటచే నీ జాగ్రత్తునందలి జగత్తు కూడా స్వప్నతుల్యమే, ప్రాతిభాసికమే యగును.

III యశ్చాత్తి విషయానిహ = ఇంద్రియార్థముల ననుభవించుచు నీ భౌతిక శరీరము నభిమానించుతరి ఆత్మవిశ్వుడని ప్రశస్తికి వచ్చెను. ఈతడీ విశ్వమున నెల్లప్పుడు పరిభ్రమించు చుండును. దేశకాలముల

యందీతడు సదా ఉనికి గలిగియే యుండును. ఎట్లన, ఒక వ్యక్తి గ్రహించు భౌతికములగు ఆహార పదార్థముల సారములచే స్త్రీ పురుష భేదములబట్టి శుక్ల శోణితములుగ పరిణమించి, వాని సంయోగముచే "అంగాదంగాత్సంభవతి" యనునట్లు తిరిగి మానవ రూపమున జన్మ పరంపరలనందుచు, జాతిమనుగడను పరిరక్షించుటకు దేశకాలముల యందనుస్యూతముగ వచ్చుచుండు భౌతిక శరీరముల నభిమానించు నప్పుడు ఆత్మ విశ్వుడనబడు చున్నాడు. కనుక నీయాత్మ విచారణచే.

(1) అజ్ఞానరూపమగు శరీరమున సుషుప్తిలో కారణశరీరిగా ప్రాజ్ఞుడని (2) తేజః పదార్థరూప శరీరమున స్వప్నమున సూక్ష్మశరీరిగా తైజసుడని (3) భౌతిక పదార్థరూప శరీరమున జాగ్రత్తునందు స్థూల శరీరిగా విశ్వుడనియు, సమష్టి రూపమున వీనిని ఈశ్వరుడు, హిరణ్యగర్భుడు విరాట్పురుషుడని యందురు. ఇట్లు వ్యవహారమునకు వచ్చుచున్నను, ఈ మూడవస్థలయందును ఉపాధులు భిన్నములైనను, అనుస్యూతముగ తానుండుటచే ఆత్మ ఒకడే యనియు తెలియగలము.

ii) స్వప్న జగత్తునకు అధిష్ఠానము ఈ యాత్మయేననియు కనుక ఆ జగత్తు అద్దమునం దంతర్గతముగ నున్న ప్రతిబింబమువలె ఆత్మయందంతర్గతముగనుండు నవకాశము గలదనియు తెలియనగును.

iii) ప్రబోధచే సాధనచే అపరోక్షానుభూతి లభించినయెడల జాగ్రత్ప్రపంచమున్ను స్వప్నతుల్యముగ, మిథ్యగనే తెలియబడగల అవకాశమున్నదనియు గ్రాహ్యమగును.

iv) ఇంద్రియములు అంతఃకరణమునందు లయించు సుషుప్తి యందును, పంచభూతములు త్రిగుణాత్మకమగు ప్రధానమునందు లయించు

ప్రళయమునందును (during the process of involution) ఆత్మ స్వరూపయే. ప్రాతిభాసికమగు పదార్థ పరిణామమునందు (during manifestation and evolution) స్ఫూర్తినిచ్చు మారురూపములు, అసత్తు లేక మిథ్య, లేక పరిణామ సత్యములనియు ఇదియును సదాత్మక పదార్థ విభూతియగుటచే, ఆ పరిణామ ప్రక్రియకును అనుస్యూతముగ, సంతత భావరూపమున నుండునది సదాత్మకమగు ఆత్మయని తెలియ నగును. ఈ ఆత్మవిచారణచే సదసద్వివేకమున్ను ప్రాప్తమగును:

v) సదసదతీతమై, (ప్రకృతి వికృతుల కతీతమై) దేశకాలము లకును అతీతమగునది ఆత్మయని గ్రహింపనగును.

కనుక నీయవస్థాత్రయముతో గూడిన ఆత్మవిచారణచే, మూలాజ్ఞాన ప్రాతిపదికపై గ్రహించిన యెడల జాగ్రత్తుకూడా స్వప్నము వంటిదని ప్రబోధము ప్రాప్తించినచో "స్వాత్మానమే వాద్వయం" అను సత్యమును ధృవపరచగలదనియు తెలియుచున్నది. ఈ మూడు స్థితులయందును మూడు విధములగు శ రీ ర ము ల నభిమానించుటనే తాదాత్మ్యాధ్యాస యందురు (illusory knowledge caused by identifying with illusory bodies. ఆత్మకు జీవభావము గలుగుట కీ తాదాత్మ్యాధ్యాసయే కారణము. మరియు ఆత్మ అంతఃకరణముతో తాదాత్మ్యము జెందుటచే గలుగు "అహం" అను చిత్తవృత్తిచేత తనకు తానే కర్తృత్వభో క్తృత్వ భావముల నారోపించుకొనుట. జీవభావమునకు రెండవ కారణము. ఇట్లు తనను జీవుడని భావించుకొని సజాతీయ. విజాతీయ, స్వగతభేదములను, దేశకాల ములను, అధ్యాసవలన సృష్టించుకొని, తానొక వ్యష్టిగా గిరి గీసికొని రాగద్వేష కామక్రోధాదుల ప్రభావమునకులోనై తానుచేయు కర్మఫలముల ననుభవించుచు, జనన మరణరూప సంసారమున గమనాగమనముల జేయుచుండును. ఇట్టి జీవభావమునుండి జ్ఞానముచే, సాధనచే, మెలకువ

గలిగి తన బ్రహ్మాత్మక భావమును పొందుటయే ప్రబోధము. ఫలము స్వస్వరూప జ్ఞానప్రాప్తి.

iv) యశ్చాస్య సంతబోభావః :— ఈ యవస్థాత్రయమునందు అనుస్యూతముగ నున్నవాడనను భావము. ఈ భావమును గ్రహించుటకు జగత్తు యొక్క మిథ్యా స్వరూపమును తెలిసికొనవలయును. స్థూల, సూక్ష్మ, కారణశరీరముల నభిమానించు విశ్వ, తైజస, ప్రాజ్ఞ భావముల తొలగించుకొనవలయును. "అహంజీవః" అను భావమును, అహంగ్రహోపాసనతో, యోగసాధనతో, తొలగించుకొని "అహంబ్రహ్మ" యను బ్రహ్మాకార వృత్తిచే అపరోక్షానుభూతిని పొంది సర్వాత్ముడు గావలయును. సాధనకు ఇదియే సరియగు ప్రక్రియ. ప్రతిబింబ ప్రాప్తివిధానమును, నిజాంతరంగ భావమును చక్కగా తెలియవలెనన్న అవస్థాత్రయములో స్వప్నావస్థను లెస్సగా తెలిసికొనవలయును. అజ్ఞానమున రజస్తమోగుణ ప్రాబల్యమనియు, అందు ఆవరణశక్తి తమోగుణాత్మకమనియు, విక్షేపశక్తి రజోగుణ ప్రాబల్య జనకమనియు అన్వయించుకొనని యెడల అజ్ఞాన స్వరూపమును అజ్ఞాన కార్యములను చిత్తశుద్ధితో, అన్వయించుకొనకయే, గ్రహింపజాలమేమో! ఆత్మస్వరూపుడగు మనము ఈ యావరణ విక్షేపశక్తులగు రజస్తమస్సుల ప్రభావ ప్రాబల్యముచేతనే జీవుడుగా భావించుకొనుట జరుగుచున్నది. ఈ గుణములు, వాని ఈ శక్తులు, మాయాస్వరూపముగ సమన్వయము జేసికొని మనము గుర్తించిన, విషయగ్రహణమునకు సహకరింప గలదు. విమర్శ ప్రకాశములు భిన్నములుగావు. అక్షరము ప్రకాశము, క్షరము విమర్శము.

భ్రాంతి జ్ఞానము జీవేశ్వర జగత్తుల విషయమున అధ్యాస యనబడును. ఏదో యొక దోషములేనిదే అధ్యాస కలుగదు. ఈ దోష

ములు ఆరు విధములుగ సాధుశ్రీ నిశ్చలదాసుగారు తమ విచార సాగర గ్రంథమున విభజించి తెలిపిరి.

1. సత్యవస్తు జ్ఞానసంస్కారము 2. ప్రమాతృదోషము
3. ప్రమాణముల యందలి దోషము 4. సాదృశవస్తు జ్ఞానము
5. అధిష్ఠానము యొక్క సామాన్య స్వరూప దోషము
6. అధిష్ఠానము యొక్క విశేషరూప అజ్ఞానము

కనుక భ్రాంతికి వస్తుసామాన్యాంశ ఆధారము, విశేషాంశ అధిష్ఠానము. సామాన్యాంశ జ్ఞానముచే భ్రాంతి తొలగును. ఈ భ్రాంతిని గురించి మరికొన్ని విశేషముల గ్రహితము కూటస్థుడనబడు ప్రత్యగాత్మకు, అంతఃకరణమునందలి మాలిన్యములచే జీవత్వ, ఈశ్వరత్వ, జగద్విషయక భ్రమలు గలుగుచున్నవని తెలిసికొన్నాము. దీనినే తత్త్వత్రయాధ్యాస అందురు. మరి పరమాత్మ సర్వాత్మకుడుగదా ! ఈ భ్రాంతి యెవరికి గలుగునను లోగడ వచ్చిన శంకకు సమాధాన మెట్లన :— భ్రమ రెండు విధములు :

(1) అనాత్మాధిష్ఠానక భ్రమ :— శుక్తి యందలి రజత భ్రమగలిగినప్పుడు అధిష్ఠానమగు శుక్తికంటే వేరుగ నొక జీవుడున్నాడు గనుక ఆ భ్రమ సంభవింప నవకాశమున్నది. ముత్యపుచిప్ప అనాత్మ పదార్థము గనుక జీవుడు దానిని జూచినప్పుడు ఆ భ్రాంతి తొలగిపోవును.

(2) ఆత్మాధిష్ఠానక భ్రమ :— ఇందు భ్రమకు ఆత్మయే అధిష్ఠానము. ఇచ్చట భ్రమను పొందువానియందే భ్రమకు అధిష్ఠానము గలదు. స్వప్న ద్రష్టను స్వప్నావస్థను ఒక్కసారి జ్ఞాపకమునకు దెచ్చుకొన్న యెడల ఈ భ్రమ స్వరూపము సుగ్రాహ్యమగును. అనగా అనాది

సంస్కార రూపము. తమోగుణ ప్రధానము అగు అజ్ఞానము ఆత్మను ఆవరించి జీవేశ్వర జగద్రూపములుగ భాసించుచున్నది. కనుక ఈ జగత్తు బ్రహ్మయొక్క వివర్తము. ఈ వివర్తము బ్రహ్మను ఆవరించిన మూలాజ్ఞాన పరిణామమువలన ప్రాప్తించును. ఇందుచే జగదుత్పత్తికి అజ్ఞానము పరిణామ్యుపాదాన కారణము, పరమాత్మ వివర్తోపాదాన కారణమనియు గ్రహించగలము. అయితే ఇచ్చట గమనించవలసిన విషయమొకటి యున్నది. ఏమన, అజ్ఞానమునకు, జ్ఞానస్వరూపుడగు పరమాత్మకు పోటీ స్ఫురించుచున్నది. అజ్ఞానమే బ్రహ్మకు పైచేయి అయి, ఆయన నావరించినది. ఈ శంకనివర్తింపుటకు నాకు తోచిన దొకటే భావము. అజ్ఞానమున్ను పరమాత్మయును మిథునభావ రూపమగు ఒకే పదార్థమను కొనిన పరమాత్మ తనయందంతర్గతముగ నున్న మాయాశక్తిని విజృంభింపజేసికొని జీవేశ్వర జగత్తులుగ పరిగణమింపజేయు చున్నాడనిన ఉపపన్నముగ నుండి చిత్తశుద్ధిలో విశ్వసింపదగునని తోచుచున్నది. రెండు విరుద్ధ ధర్మములుగల వస్తువుగ నుండుటను ఆంగ్లమున (The principle of polarity) అందురు.

బ్రహ్మ స్వయంప్రకాశము జ్ఞానస్వరూపము. ఇట్టి బ్రహ్మను అంధకారమగు అజ్ఞానము ఆవరించుటెట్లు? మహత్తు మనబుద్ధికందక పోవచ్చునుగాని ఆధునిక విజ్ఞానమున అణువుతో మనకంతవరకు పరిచయము గలిగినది. ఈ అణువునందు కేంద్రముగ నొక ప్రోటాన్ న్యూట్రాన్ గలవు. ఇది అచలము, నిష్క్రియము. దీనిచుట్టును కొన్ని వలయములలో (orbits) ఎలక్ట్రాన్స్ అత్యంత వేగముతో పరిభ్రమించుచుండును. అప్పుడు కేంద్రమునసున్న ప్రోటానును వర్తులములయందలి ఎలక్ట్రాన్స్ మరుగుపరచుటలేదు? ఐనను ప్రోటాన్ అచలము నిష్క్రియమునగు తన సహజరూప స్వభావములతోనే వెలయుచున్నదిగదా!

మరియు నిష్క్రియ బ్రహ్మకు పోల్చదగు ప్రోటాన్ లేనియెడల ఎలక్ట్రాన్ సార్థకములుగావు. ఎలక్ట్రాన్స్ లేనియెడల ప్రోటాన్ సార్థకముగాదు. ఏ అంశలేకున్నను అసలు అణువే అలీకమగును. *శక్తికి బ్రహ్మమునకుగల సంబంధమిట్టిదియేనని గ్రహించనగును.* చల అచల ములకు, పరిణామ పరిణతములకు ఏకత్వము గలదని నిర్ధింపబడుటకు అవకాశము గోచరించును. శివుడు అర్థనారీశ్వర రూపుడని చెప్పుట యందలి భావమిదియే. శివునివరకు పోసక్కరలేదు. మానవజాతి విషయ మున విచారించినను పురుషునియందు స్త్రీకి సంబంధించిన జీవరసాయన పదార్థములు (Harmones) స్త్రీ శరీరమందు పురుషునకు సంబంధించిన జీవరసాయన పదార్థములు గలవని వైద్యశాస్త్రము ధృవపరచి తెలిపినది. ప్రస్తుతకాలమున జీవరసాయన పదార్థ ప్రయోగములచే స్త్రీలను పురుషులుగ పురుషులను స్త్రీలుగ మార్పు జేయుచుండుటయు ఈ మిధున భావమును ధృవపరచుచున్నది. కనుక పరమాత్మ శివశక్తుల ఏకైక రూపమేనని విశ్వసింపనగును. ఈ మిధునభావము బాల్యాదిష్వపి జాగ్రదాదిషు అను శ్లోక వివరణమునందు చూడనగును. ఇది ప్రశ్నోపనిషదంతర్గతము. దీనివలన తన యిచ్ఛానుసారము, పరమాత్మ, తనకుతానే తమోగుణ మును విజృంభింప జేసికొని మేలిముసుగును కప్పుకొనునన్న ఉపపత్తి లభ్యమగును.

భ్రాంతిని గురించిన ఈ కొద్ది జ్ఞానముతో యిప్పుడొకసారి శంకరు లిచ్చిన యద్దమును బట్టుకొని పరికించి గ్రహింతము. ఈ యద్దము అధిష్ఠాన బ్రహ్మ. ప్రతిబింబించిన నగరము మూర్త్యష్టకము (పంచభూత ములు మనస్సు, బుద్ధి, పురుషుడు) అని సూచింపబడెను. ఇట్లు అద్వ యుడు, సర్వాత్మకుడు అగు పరమాత్మయందు గనిపించు ప్రపంచ మంతయు ఆత్మయందే అంతర్గతముగ స్ఫూర్తినిచ్చు చున్నదనియు,

అందువలననే అందుండి విడదీయబడజాలదనియు, దానికిస్ఫూర్తి దప్ప స్వతంత్రసత్త లేదనియు గ్రహింపనగును. ఈ జగత్తుకు అధిష్ఠానము పరమాత్మ. ఉపాదానము అధిష్ఠానాంతర్గతమగు అనాదియగు మూలాజ్ఞానము. ఈ యజ్ఞాన పరిణామమే సృష్టి. కనుకనే ఇది బింబములేని ప్రతిబింబమున జెల్లును. ఇచ్చట స్ఫురించునది అద్వైత మతానుసారము లేనిదియే, ఆభాసవాదానుసారము ఉన్నవస్తువే. కనుక మనము ఈ దృశ్యమును విమర్శించి తెలిసికొనుటకు "యథానిద్రయా" అని స్వప్నస్థితిని పేర్కొనినారు శంకరులు. జాగ్రత్తునందు గలిగిన వాసనల ఉద్రిక్త ఉద్వేగములవలన సంభవించినట్లు అనాదిగ వచ్చుచున్న మూలాజ్ఞానకార్య వాసనలచే నేర్పడు జాగ్రత్తు కూడా ఆత్మానుభూతి పొందినవానికి స్వప్నతుల్యముగాదు. స్వప్నమే యని గ్రహింపవలయును. కనుక నీ దృశ్యమానము (Phenomena) దీనికి కారణమగు అజ్ఞానము, మిథ్యయే యని గ్రహింపవలయును. వస్తుతత్త్వదృష్ట్యా సత్యములుగావు. ఇదియే వివర్తవాద సారాంశము. ఈ కల్పితజగత్తు, కల్పితభోక్త, పరమాత్మ యందంతర్గతములే, గాని బాహ్యములులేవు. ఏకతత్త్వమేగాని భిన్నములుగావు. ఐనను మాయాశక్తి ప్రభావముచే పరమాత్మకు బాహ్యదేశమందున్నట్లే భావింపబడుచున్నవి. అఘటితఘటనా సమర్థమగు పరాశక్తి యొక్క (యోగమాయ యొక్క) త్రిగుణాత్మక సామ్యరూప స్థితియే ప్రకృతి. ప్రకృతి యందలి క్రియాశక్తియే మాయాశక్తి. ఈ శక్తియే పదార్థరూపము నొందగలదు. మరల శక్తిరూపమునకు రాగలదు. Energy and matter are two states of the one primal substance) జ్ఞానముచే అజ్ఞానముపశమింపబడిన లేక అజ్ఞానము జ్ఞానమునందు విలీనమైన అజ్ఞాన పరిణామ రూపమగు వివర్తభావము పోయి అధిష్ఠాన మవశేషమగును. అద్దము అనాత్మ పదార్థము గనుక ప్రతిబింబప్రాప్తికి ఒక బింబము నపేక్షించును. పరమాత్మ కేవలచైతన్యము గనుక

అవచ్ఛేదకమగు నొక బింబముయొక్క అపేక్ష లేకనే తనయందే తానొక ప్రతిబింబ కల్పనజేయు నవకాశమును విస్మరింపరాదు. బ్రహ్మయను అధిష్ఠానమగు దర్పణము కేవల చైతన్యము కనుకనే ఆత్మాధిష్ఠానక భ్రమకు ప్రసక్తి బింబరహిత ప్రతిబింబమునకు ప్రాప్తి అని గ్రహించి మరల పూర్వపక్షము చేయరాదు. ఉపమాన మెప్పుడును ఏకదేశమే. "నహిదృష్టాంతే సర్వసామ్యం" (No illustration can be run on all force. కనుక తర్కమునకు తాపీయక విషయగ్రహణ సౌలభ్య పర్యంతమే జడమగు దర్పణము నుపయోగించుకొందము. చైతన్య దర్పణమునందు స్వరూప సాక్షాత్కారము నొందుదము.

"యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమే వాద్వయం". ఇచ్చట ప్రబోధమన జాగ్రత్తునందునను యున్న అనాదియగు యజ్ఞానము నుండి తత్త్వమస్యాది వాక్యార్థ విచారణచే నివృత్తి పొందుట. తత్ అనగా దివ్యతత్త్వము. దానికి సంబంధించిన సాకార నిరాకార సగుణ నిర్గుణ, కేవల విశిష్టాదివాదములు త్వం అనజీవుడు అతనికి సంబంధించిన బింబ ప్రతిబింబ అవచ్ఛేద ఆభాసాదివాద విచారణతో మహావాక్యార్థమును గ్రహించి ఈ శరీరత్రయముతో తాదాత్మ్యము జెంది. పొందిన "అహం" అను వృత్తిని పూర్వము సంపాదించుకొన్న వాసనలను, సంస్కారములను తుడిచివైచుకొన్నప్పుడుగాని, తన స్వస్వరూపమగు ప్రత్యగాత్మత్వము సాక్షాత్కరించదు. అనగా తాను అద్వయ పరమాత్మరూపుడుగ అనుభవమును పొందుటయే. అప్పుడు పరమాత్మ ప్రత్యగాత్మ ఒకే ఆత్మ. "ఏకమేవ అద్వితీయం" అనునదే "స్వాత్మానమే వాద్వయం". అను వాక్యార్థము. జీవభాగము తొలగినప్పుడే, ఇది సాధ్యము. జీవభావము పోవుటకు జైనవాద ప్రక్రియల మననముజేయుట, యద్వ్యాప్తి విషయా వ్యాప్తి అను శ్లోకభావము, యస్యైవస్ఫురణం అను శ్లోకభావము మననము చేయవలయును.

గ్రాహ్యాంశము : జ్ఞానముచే, ధారణ, ధ్యాన, సమాధులచే బ్రహ్మాకారవృత్తిని పొందనివానికి నాగేంద్రుడు దేవుడని యెంత చదివినను స్వప్నముగనే పర్యవసించుచుండును. స్వప్నమునందు నాగేంద్రుని సాక్షాత్కరించుకొనుటకు అష్టాంగయోగ సాధనతో గూడిన శ్రవణ మననములు అత్యంతావశ్యకములు. ముందు ఆచార్యేంద్రుడగు వానికే, అనగా గీతయందు చెప్పబడిన స్థిత ప్రజ్ఞునకేగాని, పడకకుర్చీ పాఠకునకు అద్వైత సిద్ధి కుందేటి కొమ్మువలె అర్థసృష్టిలేని శబ్దసృష్టిమాత్ర వైభవమే యగును. శంకరులు తత్త్వవేత్త, జ్ఞానసిద్ధుడు, సూత్రప్రాయముగ ప్రగాఢ సిద్ధాంతముల పద్యరూపమున ప్రస్ఫుటము జేయుకవి. రజ్జువునందు పామునేగాక పామునందలి నాగేంద్రుని దర్శింపగలుగు ఆచార్యేంద్రుడు, యోగసిద్ధుడని మనము విస్మరించరాదు. వేదాంతము బుద్ధికి విలాసవస్తువుగాదు, అలంకారప్రాయముగాదు, కఠోరసాధనాప్రాప్యము. జ్ఞానపూర్వకమగు యోగసాధనయే శంకరులకు మన మర్పింపగల గురుదక్షిణ.*

అద్దమునందలి ప్రతిబింబమువలె, చైతన్య దర్పణమునందు అనగా సర్వాధిష్ఠానమగు పరబ్రహ్మమునందు తత్త్వత్రయమనబడు జీవేశ్వర జగత్తులు, అంతఃప్రపంచమేగాని భిన్నములు, బాహ్యములుగావని ఎవరు గ్రహించి అనుష్ఠింతురో, వారు ప్రత్యగాత్మయే బ్రహ్మాభిన్న సచ్చిదానంద పరమాత్మ స్వరూపమని అనుభూతినొంది తరింతురనియు, మాయా కార్యముల వివరముగ గ్రహించినచో అనగా ద్వైతవాదములను, ఆత్మవాదములను చదివి చదివి మననము జేసినచో, తత్-త్వం-అసి వాక్యార్థము గ్రాహ్యమై "ఆత్మానమేవాద్వయం" అను అనుభూతి నొందుదురని బోధించిన సద్గురువు [illegible] నమస్కారము.

ప్రతి శ్లోకమునను నాల్గవ పాదము "తస్మై శ్రీ గురుమూర్తయే నమయిదం శ్రీ దక్షిణామూర్తయే" అని యుండును. మొదటి మూడు పాదముల యందును దృశ్యమంతయు పరమాత్మ యందంతర్గమన్ని, ప్రమాత పరమాత్మలు అద్వయమగు ఏకాత్మ స్వరూపులేనని అద్వైత బోధ జేసియు, నాల్గవ పాదమున అట్టి గురుమూర్తికి నమస్కరించుచున్నానని ద్వైతపరముగ ముగించుటచే — ముందు ద్వైత భావముతో పూజించి, తరువాత విశిష్టాద్వైత భావముతో ఉపాసించిన, పిమ్మట పొందిన అనుభూతి వలన అద్వైత భావము స్వయంసిద్ధమగునని తెలుపుటయే గమనీయ సూక్ష్మవిషయము. అంతవరకును విధినిషేధ పూర్వకమగు ధర్మాచరణతో భౌతికమును మన్నించుచు, లక్ష్యము మాత్ర మద్వైతసిద్ధిగనే విశ్వసించి చరింపవలయు ననుటయే గ్రాహ్యాంశము.

ప్రతిబింబము = నిర్వీర్యము, నిస్సత్వం

ప్రతిరూపము = చైతన్యం, సత్తగలది.

2. శ్లో॥ బీజస్యాన్తరివాఙ్కురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పున
ర్మాయా కల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతం
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యః

స్వేచ్ఛయా ॥తస్మై॥

టీక : ఇదం జగత్ = ఈ ప్రపఞ్చము; ప్రాక్ = పుట్టుటకుపూర్వము; బీజస్య = విత్తనము యొక్క, అన్తః = లోపల, అఙ్కురః ఇవ = మొలకవలె నిర్వికల్పమ్ = భోక్తృభోగ్యాది వికల్పరహితమై ఆత్మమాత్రముగనే యుండెను; పునః = మరల (తరువాత) మాయాకల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతం = ఈశ్వరాధిష్ఠితమగు మాయచే కల్పింపబడిన దేశకాలములచే వివిధ నామరూపములచే విభక్తమగు ఈ జగత్తును; మాయావీ ఇవ = ఐంద్రజాలికునివలె, మహాయోగీ ఇవ = గొప్పయోగి వలెను; యః = ఎవ్వడు; స్వేచ్ఛయా = తన ఇచ్ఛామాత్రముచేత; విజృంభయతి అపి = సృజించి విస్తరింపజేయునో, అట్టి జ్ఞానోపదేశికాచార్య రూపమునను్న శ్రీ దక్షిణామూర్తి కొరకు నమస్కారము.

తా॥ సృష్ట్యాదియందు ఈ ప్రపఞ్చము నామరూప భోక్తృభోగ్యాది వికల్పరహితమై సన్మాత్ర (ఆత్మరూప) ముగ నుండెను. "ఉత్పత్తేః ప్రాక్ కార్యం సత్" పుట్టుటకు పూర్వము = కార్యము కారణరూపముగా నుండును. అఙ్కురము (మొలక) ప్రకటమగుటకు పూర్వము, బీజము నందే యుండునుగదా ! ఆత్మయందలి మాయాశక్తిచే దేశకాలము లేర్పడి వివిధ విచిత్ర ప్రపఞ్చము ఏర్పడినది. ఇచ్ఛామాత్రముచే మహాయోగి వలెను, ఐంద్రజాలికుని వలెను, వివిధ రచనా చిత్రిత జగత్తును సృజించిన పరమచేతనుడు పరమేశ్వరుడు గురుమూర్తి. ఆ గురుదక్షిణామూర్తికి నమస్కారము.

వివరణ :— మొదటి శ్లోకమున (విశ్వందర్పణ) భౌతికమగు ఈ ప్రపఞ్చమును సమష్టిసృష్టి పూర్వకముగ గ్రహించి ఈ దృశ్యమాన మంతయు తనకు కారణమగు అధిష్ఠానమునందే అంతర్గతముగ నుండియు గుణత్రయాత్మకమగు మాయాశక్తి ప్రభావముచే, పరమాత్మకు బాహ్య దేశమందున్నట్లు స్ఫూర్తి నిచ్చుచున్నదని బోధింపబడినది. అంతర్గత భావమునకు అద్దమును, ఆత్మాధిష్ఠానక భ్రమకు స్వప్నావస్థను (యథా నిద్రయా) ఉపమానములుగ తెలుపబడినవి.

ఈ శ్లోకమున ఒక గింజయందు కారణరూపమున నున్న మొలక వర్షాది పరిస్థితుల ప్రభావముచే కార్యరూపములగు, కాండము, శాఖలు. పత్రములుగ పరిణమించి పుష్పించి ఫలించుట జూడ, బీజాంకుర న్యాయముతో వ్యష్టిగత సృష్టియందును మాయాశక్తి యొక్క ప్రభావమెట్లు సూక్ష్మమగు కారణముగ స్థూలమగు కార్యముగ పరిణామముల పెచ్చునో వివరింపబడినది. "మట్టి" అనునది అకు, కాయ, కొమ్మను వర్తించునట్లు అనగా దాని అవయవ విభాగములయం దనుసృతమైనట్లు, సర్వ ప్రపంచమున ఆత్మతత్త్వముండుట, ప్రకటితమగుచునే యున్నది. బీజాంకుర న్యాయమున, గింజకు దానియందే కారణ రూపమున నున్న అంకురము నకు, సజాతీయమగు నొక నియత సంబంధము గలదనియు (a specific and homogenous relation ship) అదియె కార్యకారణ రూపములగు పరిణామ ప్రక్రియల వలన స్పష్టమై, మరల కారణరూపమగు అంకుర సహితమగు బీజముల నొసంగును, ఇట్లు పోషపోషము, చెట్టు ముందా ? విత్తు ముందా ? యను ప్రశ్నకు అనవస్థా దోషము నాపాదించుచున్నదని భావము అనవస్థాదోషముచే కార్యకారణములని పృథక్క రించి చెప్పబడుచున్నవానికి అనన్యత్వము లేదా ఏకరూపతనే పారమార్థిక దృష్టితో మనము నిర్ధరించుకొనవచ్చును. కనుకనే శూన్యము నుండి

కారణముద్భూతము కాజాలదు. కాని సత్తే అసత్తుగ భాసింపననువగు ననియు విశ్వసింపనుపపత్తి గన్పించుచున్నది. ఈ బీజాంకుర న్యాయ వ్యవహారమును సంకల్పమే కారణముగ ఆవిర్భావమే కార్యముగ దెలుపుచు స్పైనోజా (spinoza) అను పాశ్చాత్య తత్త్వవేత్త దెలిపిన భావమును గమనింతము.

"Whereever there is an external material process it is but one side or aspect of the real process. Thinking substance and extended substance are one and the same thing. An emotion is a state of mind that manifests itself by sensible changes in the organs of different systems of the body. Just as the emotion, as felt, is a part of the whole, of which, changes in the circulatory, respiratory digestive and other systems is the Basis, so an idea is a part along with the bodily changes of one complex organic process. Even the infinitismal subtlities of mathematical reflection have their correlates in the body. Thinging substance and extended substance are one and the same thing". ఈ భావమునకు యోగశాస్త్రమందలి నాలవ అధ్యాయమునందలి 12 వ సూత్రము ఆలంబన మిచ్చుచున్నదని నేను భావింతును.

"అతీతా నాగతమ్ స్వరూపతోఽస్త్యధ్వ భేదాద్ధర్మాణామ్"

వినాశము పొందునది అతీతము = భూతకాలము, అనాగతం = భవిష్యత్తు అవ్యక్తమగునది. ఈ రెండు ధర్మములు అద్వయమే. అట్లే గుణములు పరిణామ నిత్యములు. వాని వికారములు అందుల కభిన్నములే

గనుక పరిణామి నిత్యములేగాని, స్వరూప సత్యములుగావు. కూటస్థుడగు ప్రత్యగాత్మ మాత్రమే స్వరూప సత్యము.

The past and future exist in their own nature, qualities having different ways. The past & future though non-existing in a manifested form exists in a fine form. The idea is that existence never comes out of non-existence. Thus, we infer that the Karanam and Karyam are one and the same.

మనము ఒక గింజను చీల్చి పరిశీలించినయెడల అందు ఒక సూక్ష్మమగు అంకురము దప్ప, పత్ర, పుష్ప, ఫలాదులు గన్పించవు. అయితే ఈ యంకురమునుండి యివి యన్నియు ఎట్లుత్పత్తియై వచ్చినవి? అని యడిగినచో ఆధునిక విద్యావంతులు అవి ప్రకృతియొక్క నైజ స్వభావము వలననే యేర్పడుచున్నవని చెప్పుదురు. అణువు నందణు శక్తివలె ఈ ప్రకృతి శక్తి ఆ బీజాంకురమునం దిమిడియున్నదని చెప్పి ఒక శక్తి యునికి సంగీకరించినందుకు సంతోషము. ఆ ప్రకృతి శక్తి యొక్క స్వరూప స్వభావము లెట్లుండునని యడుగ — అది అంతియే. అంతకంటె నికజెప్పుటకు అనువుగాదు, అని స్వభావవాదులందురు. ఇక వివరింప వీలులేదను దానినే మన శాస్త్రకారులు అనిర్వచనీయ మందురు. ఈ యనిర్వచనీయ శక్తినే మన ఋషులు "మాయ" యని వ్యవహరించిరి. మరియు ఇతోధికముగ అది సత్త్వరజస్తమో గుణాత్మకమనిరి. ఈ గుణములు సామ్యావస్థ యందున్నప్పుడు దానిని అవ్యక్తము (the unmanifested) అనిరి. ఇది సృష్టికార్యమున కుపాదానము గనుక ప్రధానమనియు పేరిడిరి. అందు రజోగుణము ప్రకోపించి స్పందించిన, ప్రకృతియొక్క సామ్యావస్థకు భంగము గలిగి అది "మహత్తు"గ

రూపొందును. అనగా పదార్థముద్బుద్ధమగుట కనువగుస్థితి. ఇట్లు ఆ గుణత్రయ స్వభావము సామ్యావస్థయం దిట్లుండుననియు (అవ్యక్తముగ Potential or unmanifested), పరిణామావస్థ యందిట్లుండు ననియు (kinetic or manifesting state) విశదీకరించుటయే గాక శరీరముపైనను, మనస్సుపైనను వాటి ప్రభావ లక్షణములను వివరించి వర్గీకరించియు దెలిపిరి. భౌతికమునకు వర్తించుమేరకు వీనిని విచారించి చూచిన ఆధునికులు పేర్కొను చలన శక్తి ధర్మములు (Newton's laws of motion) ఈ గుణత్రయమునకు తులనాత్మకముగ స్ఫురించుచున్నవి. విచారింతము :— 1. The law of Inertia: Every body continues to be in a state of rest or of its uniform motion in a straight line, unless it is compelled by an external force to change its state (whether rest or motion)

Tamas is the primary property of the field (క్షేత్ర ధర్మము) It gives u .e fact that particles of matter or even material objects tend to retain their states of motion or rest and offer resistence to the force acting on them. This establishes the objective existence. తమస్సును ఆంగ్లమున "ఇనర్షియా" అందురు. ఇనర్ట్ అనగా స్తబ్ధత నిష్క్రియత, అలసత అను భావముల దెల్పు గుణము. ఈ పదముయొక్క రూపాంతరమే "ఇనర్షియా". దీని లక్షణములే తమోగుణ ధర్మములగు 1. అజ్ఞానము (lack of intelligence or nescience) 2. అంధకారము (స్వప్రకాశము లేకుండుట) 3. భారము (resistence to an external force), 4. అలసత (సోమరితనము) 5. మాంద్యము (reluctence to move or act) చలన

మును నిగ్రహించు ధర్మము. ఈ 5 న్యూ టమోగుణ ధర్మములే గనుక ఇనర్షియా ధర్మము తమోగుణ తుల్యముగ స్ఫురించుచున్నది. చలన రహితస్థితి శిథిలతకు కారణము గనుక నిద్రిరుద్రుని యంశయన జెల్లును.

II. Law of force : (శక్తి ధర్మము) the rate of change of momentum of a body is directly proportional to the force acting on the body and takes place in the direction in which the external force acts.

"అణోరణీయాన్ మహతోమహీయాన్ (కఠోపనిషత్) అణువు కంటెను మిక్కిలి చిన్నది (microcosm) ఆకాశాది మహత్పదార్థముల కంటెను (macrocosm) మిక్కిలి గొప్పది అగు స్థూలసూక్ష్మములు రెంటియందును స్పందనశక్తి నిహితమై యున్నది (దాగియున్నది). కనుకనే పరిణామ ప్రక్రియ సాధ్యమగుచున్నది. సర్వపదార్థమునకు, స్పందనశక్తి పరిణామ ప్రాప్తి వ్యాప్తిని గలిగించుచున్నది. ఇది సృజనాత్మకము గనుక సృష్టికర్తయగు బ్రహ్మయొక్క అంశగా దోచుచున్నది.

III. The law of equilibrium :- To every action there is always an equal and opposite reation. ప్రతియొక్క క్రియకును, సమాన పరిమాణమున, వ్యతిరిక్త ప్రతిక్రియ యుండును. (as the positive and the negative ధన-ఋణ శక్తులవలె) ఇందుచే స్థాయీభావము (equilibrium) గలుగును. ఇది స్థాయీభావము (these opposites will have the effect of a binding force, which only can preserve and maintain the statusquo). నిలుపును గనుక నిది విష్ణ్వంశయని చెప్పవచ్చును. అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరు లెట్టిశక్తులతో ఈ సృష్టి స్థితి సంహార

ముల జేయుదురో పై జెప్పిన న్యూటన్‌గారి మూడు చలన సంబంధ ధర్మములున్నూ భౌతిక ప్రపంచ విషయమున తుల్యధర్మముల దెలుపుచున్నవి. మూల ప్రకృతి ఈ మూడు ధర్మములుగల మూడు విభిన్న పదార్థములగు సత్త్వరజస్తమో గుణాత్మకమని యెరింగితిమి. ఈ మూల ప్రకృతిని "మాయ" యను నామముతో వ్యవహరించుట వలన ఈ మాయ పదార్థముయొక్క చరమమూలపదార్థ లేశములగు సత్త్వరజస్తమో గుణాత్మకమైన భావపదార్థమనియు కనుకనే స్తబ్ధ, స్పందన, స్థాయీ రూపములగు శక్తులు మాయవే ననియు గ్రహించుట కభ్యంతరము గన్పించుటలేదు. అందుచే పరమాత్మ యొక్క విమర్శ ప్రకాశములలో దృశ్యరూప కారకమగు (objective existence) విమర్శ మాయయే యగును. సృష్టి స్థితిలయముల బొందుచున్న వ్యాపృత్త్యాత్మక పరిణామ సత్య (మిథ్య) పదార్థము ఈ మాయయే యని గ్రహించిన శాస్త్రార్థములు మనకు సుగ్రాహ్యములు గాగలవు ఇది పారమార్థికసత్య పదార్థము మాత్రము గాజాలదు. అందుచేతనే "యా-మా-సామాయ" ఏది ఉన్నట్లు కనిపించి తాత్వికముగ లేనిదో అది మాయ యనిరి. ప్రకాశదృష్ట్యా లేనిది, విమర్శవాదృష్ట్యా ఉన్నది— కనుకనే ఉండియు లేనిది మాయ. ఈ త్రిగుణములను "తేవ్యక్త సూక్ష్మగుణాత్మానః" అని పతంజలి (iv) 13 న చెప్పియున్నాడు అనగా వ్యక్తములు సూక్ష్మములగు మహదాది ప్రకృతి కార్యములన్నియు గుణస్వరూపములె యని భావము. ఈ మూడింటియొక్క స్థూలావస్థయే ఈ దృశ్యప్రపంచము. కనుక నివి తత్త్వములే. ఈ గుణము లభివ్యక్తమగుటనుబట్టి భూత వివ్యక్తులను కాలభేదములు చూపట్టుచున్నవి. వీని నతిక్రమించిన వారికి కాలభేద మసంభవము.

ఇంతవరకును భౌతిక విజ్ఞానముచే న్యూటన్ మన త్రిగుణ జ్ఞానపు భౌతిక స్థాయివరకు వచ్చినట్లు తెలియుచున్నది. అనగా

త్రిగుణముల అభివ్యక్త (ఉద్భూత) స్థితిని మాత్రము గమనించెను. గాని అవ్యక్తస్థితి ఆయనచే స్పృశింపబడి యుండలేదు. పతంజలి మహర్షి అవ్యక్తమగు అనుద్భూత స్థితినికూడ వివరించి చెప్పిరి. ఈ త్రిగుణ సిద్ధాంతమున రహస్య విషయమేమన ఈ విశ్వమంతయు స్థూలము సూక్ష్మము అగు రెండు రూపములతో యున్నది. మానవుడున్నూ స్థూల సూక్ష్మరూపకుడే. ఈ త్రిగుణముల ప్రభావమును కార్యములను సూక్ష్మ రూపమగు మానవుని మనస్సుకు వర్తింపజేసి సమీక్షించిన, దేవాసుర తత్త్వముల విభజించి, విమర్శించి, సంస్కరించి లోకసంక్షేమమునకు పారమార్థికతకు దోహదము జేయవచ్చునని మన శాస్త్రములు నొక్కి వక్కాణించినవి.

త్రిగుణములకు మనస్సుపై ప్రభావము : అతీంద్రియ శక్తి సంపన్నులగు మన ఋషులు సూక్ష్మరూపమగు మనస్సుపైగల ప్రభావము నిట్లు విశదీకరించిరి :—

(1) తమోగుణ ప్రధానమగు మనస్సు : సోమరితనము భారము గలిగి కదలికకు విముఖమై యుండును. అజ్ఞాన యుక్తముగ విమర్శనా శక్తి లేక విచక్షణ లేకియుండును. చద్దియన్నమువంటి చల్లని పదార్థ ములు పాతబడి స్వల్పదుర్గంధ యుక్తముగ నుండు ఆహారముల నభిల షించును. మద్యమునంటి మాదక పదార్థములపై ప్రీతి యుండును. దుష్క్రియలజేయ నుద్యుక్తుడై యుండును. హీనమగు భాషతో ప్రసంగిం చును. ఇతరులకు క్లేశకారకములగు పనులజేయుట, వారికి దుఃఖమును గల్గించుట యందాసక్తి గలిగియుండును. అతని క్రియలు అనాలోచిత ములు ఉద్రిక్త పూర్వకములుగ నుండును. (Impulsive nature)

(2) రజోగుణ ప్రధానమున : మనస్సు అనేక కోరికలతో నిండియుండును. అందు అధికారము, అహంకారము, దర్పము, ధనములు, లైంగిక క్రియలయందు ఆసక్తిగలిగి యుండును భోగవిలాస ప్రసక్తి మెండుగ నుండును. రాగద్వేషములు ఆతని నియామకులు, అధర్మాచరణ, డాంబిక కార్యాచరణకు నవి ప్రోత్సహించును. కారము, వేడిగలవి, ఉత్తేజకరములునగు ఖాద్యముల నభిలషించును.

(3) సత్వగుణ ప్రధానమగు మనస్సు : ప్రశాంత ప్రసన్న చిత్తము (mental equipoise) సంయగ్దర్శనము (right cognition) మంచితనము (Love for humanity) సానుభూతి sympathy) సమాధానము (మోదఖేదములయందు సమభావము) ధర్మసంబద్ధములగు కోరికలు (Righteous desires), విధివిహిత క్రియాచరణ, శుచియగు సద్యఃపచితములగు వంటకములు. హెచ్చుకారము. ఉప్పు లేక ఉత్తేజ కరములుగాని పదార్థములు, పాలు, పండ్లు, మధురరసము నభిలషించును. ఘ్రాణేంద్రియ విషయమున కలువ, పద్మము, పారిజాతము సత్త్వగుణోత్తేజకరగంధ యుక్తములు: మల్లె, గులాబి రజోగుణోత్తేజ కరములు: గోరింట, ఉల్లిపూలు తమోగుణోత్తేజకరములు, జంతువుల విషయమున ఆవు సత్త్వగుణ ప్రధానము, గుర్రము రజోగుణ ప్రధానము, మహిషసూకరములు తమోగుణ ప్రధానములు : ఈ సత్త్వ రజస్తమో గుణముల పరిణామమువలననే అనగా పదార్థ ప్రాదుర్భావము చేతనే భూతభవిష్యత్తులను కాలభేద ప్రసక్తి గలుగుచున్నది. వీని నతిక్రమించిన సర్వము వర్తమానమే యగును. అనగా కాలమునకు ప్రసక్తి యుండదు.

మానసిక తత్త్వములను (mental or psychological states) దృష్టియందుంచుకొని విచారించిన ఈ భౌతిక శాస్త్రములయందు

ఏమియు లభ్యముగాదుగాని, పారమార్థికమును పరిగణించి చూచిన గీత యందలి గుణత్రయ విభాగయోగమునను, దేవాసుర సంపద్విభాగ యోగ మునను, ప్రధానముగ మనస్సుపై ఈ త్రిగుణముల కెంత ప్రభావ ప్రాబల్యముగలదో గీతాచార్యులు విపులముగ వివరించి దెలిపిర ఆ ప్రభావముల ఫలితముగ ఒకని ప్రవర్తనయందెట్టి పరిణామములు గలుగునో, వాని ఫలితములు సాంఘిక సంక్షేమమును, విశ్వశాంతి, పారమార్థికతను జ్ఞానాజ్ఞానములను ఎట్లు నిర్ణయించగలవో విస్తృతముగ వివరించెను. గీతాప్రస్థానమున నీ త్రిగుణాత్మక శక్తికి భగవానుడు రెండధ్యాయముల స్థాయిని (హోదా) గల్పించి ఆ గొప్పదనమును గణనీయ ముగ ప్రస్తావించి. ఆ మాయాశక్తిని నా వశమున నుంచుకొని నా రచన లకు (సృష్టి స్థితిలయములకు), అద్దానిని సాధనముగ నుపకరించుకొందు ననియు ప్రవచించిరి. ఈ బోధ. గ్రహింపనేరని మందబుద్ధులు శంకరులు జెప్పిన విషయమును యథాతథముగ గ్రహింపనేరక, ఆయన ఈ మాయ యను పదమును ఆచ్ఛాదనముగ జేసికొని తన యజ్ఞానమును కప్పిపుచ్చు కొనిన ప్రచ్ఛన్న బౌద్ధుడనిరి. బౌద్ధులలో నొకవర్గమువారు (హీనయానులు) శూన్యవాదులు. మాయా కార్యముల నపవదించి చూచిన యెడల, అనగా ప్రపంచమునందలి దృశ్యములను మిథ్యగా నపవదించి చూచినయెడల పర్యవసించునది శూన్యమేనని వారు చెప్పుదురు. కనుకనే అధ్యారోపాఽప వాదమును శూన్యఫలిత ప్రక్రియగా వారు గ్రహించిరి. కానీ విమర్శించి చూచిన శూన్యవాదులకు అధిష్ఠాన పదార్థములేదు. అధ్యారోపమునకు ఒక అధిష్ఠాన ముండవలయునని వారికి స్ఫురించలేదు. శంకరులు అధ్యా రోపము నపవదించి అధిష్ఠానమును ప్రపంచించిరి. "మాయా మాత్ర మిదంద్వైతం। అద్వైతం పరమార్థతః॥" (మాండూక్యం) "మాయాంతు ప్రకృతిం విద్యాత్। మాయినంతు మహేశ్వరం" (శ్వేతాశ్వతరం) అను ఉపనిషద్వాక్యములు శంకరుల భావమునకే ఆలంబనము నిచ్చుచున్నవి.

కనుక శంకరుని విమర్శించువారు శబ్ద ప్రమాణమును విడచి అనుమా: ప్రమాణావలంబులై విమర్శించుచున్నారు.

మాయకు లక్ష్యార్థము మోసముగాదు, లేనిది యనియుగాదు. ఐనను క్ష యజ్ఞానులు దెలుపు మోసము లేనిది, హుళక్కి అను నర్థముల సాపేక్షిక దృష్టితో, మనము మన్నించినను విమర్శకుల వాదములో పపత్తి లేకపోలేదు. మన యింద్రియముల శక్తులు పరిమితములు. కు శక్తులు గోళకముల ద్వారా బహిర్గతమై యింద్రియార్థములతో సేరినప్పుడు భిన్నభిన్న వృత్తుల పొంది, అవి మన అంతఃకరణమున ందించగల పరిమిత జ్ఞానముచే వాటి స్థాయికందని వస్తుజ్ఞానమును టుల త్రోసివైచి చెప్పుట పరిపాటియే గదా! చూచిన వస్తువుయొక్క త్వజ్ఞానమును పొందజాలక వస్తుజ్ఞానము మాత్రమే పొంది ఒకదాని ంకొకటిగా రోపింపజేయుటచే జీవుడు మోసగింపబడుటయు సంభవమగు న్నది. గనుక మోసమని యర్థము జెప్పువారిని మనము మన్నింప ్పను తాత్త్వికముగ జూచినయెడల తమోగుణ ప్రభావమే ఆవరణ క్తి, రజోగుణ ప్రాబల్యమే విక్షేపశక్తి యని గ్రహింపగలము. ఈ క్తుల తన యధీనమందుంచుకొని, జీవుల కర్మఫలములు పరిపక్వ ుచుండ (as maturity of karmic principles occurs) ని కారణములు కార్యరూపమునొంది ప్రారబ్ధానుభవ ప్రాప్తికే పరమాత్మ మోగుణాత్మకమగు తన శక్తిని విజృంభింప జేసుకొని దానిచే తనను ఆవరణ జేసికొనును. రజోగుణ ప్రాబల్యముచే ప్రకృతికి పరిణామావస్థ రంభమైనప్పటి నుండియు సూక్ష్మ సృష్టి స్థూలమునకు, స్థూలాతి స్థూల నకు పరిణమించును. సృష్టిని గురించిన మన జ్ఞానము, మాయయనియు, ానమనియు, అవ్యక్తమనియు వ్యవహరింపబడుచున్న మూల ప్రకృతి కియే ప్రారంభమగును. ఇదియే అపరాప్రకృతి. త్రిగుణములు

పరిణమింప ప్రారంభించి సృష్టికి అనువగునట్లు పరిణమించిన సూక్ష్మాతి సూక్ష్మస్థితియే మహత్తనబడును. అది అహంకారముగ (a sense of the self) పంచతన్మాత్రలుగ, (pure and unalloyed elements only) పంచీకృత పంచభూతములై (coalesced elements) వాటి యంశల కలయికచే భిన్నవస్తురూపముల బొంది, కొంతకాలము స్థితినొంది తరువాత లయించి లేనిదగుటచే మోసమను యర్థమునకును నిఘంటువు నందు స్థానము గల్పించవచ్చును. మిథ్యయన స్వరూప సత్యముగాక పరిణామసత్యము మాత్రమగు నిదియే. షడ్దర్శనములలో న్యాయవైశేషిక సాంఖ్య దర్శనములయందు లభించు జ్ఞానముతో తృప్తులమగునెడల నింతవరకు సత్యమే. కానీ యోగదర్శనము యీ యంతఃకరణము నంతర్ముఖముజేయు సాధనలను వానిచే చిత్తము శుద్ధమై, ఏకాగ్రత నొంది, చిత్‌శక్తితో మేళవము నొందుటచే ప్రాప్తించు తురీయావస్థను, దానియందు గలుగు జ్ఞాన ఆనంద పూర్వకమగు అనుభూతిని వివరించి బోధించినది. ఈ యోగశాస్త్రమునకు లక్ష్యము వేదాన్త దర్శనము వేదాన్త దర్శనమునకు సాధనము యోగదర్శనముగా గ్రహింపనగును. అనగా యోగసాధనకు మార్గమును నిర్దేశించు విజ్ఞానము తత్త్వశాస్త్రము నందున, తత్త్వశాస్త్ర భావములకు ఫలము యోగశాస్త్రమునను గలవు. ఇదియే రాజయోగము. హఠయోగాదులుగావు. అవి సూక్ష్మ శరీరమునకే పరిమితములు.

వేదాన్త దర్శనము ప్రాకృతమగు నీ మూల ప్రకృతికి ఆధారమగు నొక అప్రాకృత, నిష్కల చైతన్యమును వివరించి నిర్ధరించినది. ఈ మూల ప్రకృతికి మూలమగునది సర్వాధిష్ఠానమగు సినిమా తెరవంటి అధిష్ఠాన మొకటిగలదని స్పష్టీకరించినది. దానిపై బొమ్మలు కనిపించు నంతవరకు సుఖదుఃఖాది భావములుండునని తెలిపెను. మరొక పరమ

సత్యము "బొమ్మలు లేకున్నను తెర యుండునుగాని తెరలేని యెడల బొమ్మలుండజాలవు" అని తెలిపి బొమ్మల ప్రాతిభాసిక సత్యమును తెరయొక్క పారమార్థిక సత్యస్వరూపమును అనగా జగత్తుయొక్క మిథ్యా స్వరూపమును ఆత్మయొక్క పారమార్థిక సత్త్యమును సుబోధ మొనరించెను. ఆ తెర యెట్టిదో అందు బొమ్మలెట్లు ఆశ్రయమును బొంది ఆడుచు పాడుచు గర్జించుచు ఘర్షణ పడుచు శృంగారాది నవరసానుభూతి మనకెట్లు గల్పించుచున్నవో విచారింతము. ఆ తెర గుణములేని గుణి వంటిది. ఆయుర్వేదమున గుణములేని గుణియుండుట కవకాశము లేదని చెప్పబడినది. ఒక సంఘటన: పూర్వము నలందా విశ్వవిద్యాలయము నందు ఒక ప్రధానాచార్యుడుండెను. విద్యాభ్యాసము పూర్తి జేసికొని పోవనున్న తన శిష్యుల విజ్ఞానమును ఒరిపిడిబెట్టి చూడ సంకల్పించెను. శిష్యుల బిలిచి వారితో — వైద్యమునకు పనికిరాని యేదేని యొక ఓషధిని దెచ్చి నాకు గురుకట్నముగ సమర్పించుడని కోరెను. శిష్యులందఱు మంచిదనిచెప్పి వెళ్ళి వెదకి అందఱు తలకొక ద్రవ్యమును వైద్యమునకు పనికిరానిదిగ నిర్ణయించి తెచ్చిరి. వాని యన్నిటియందును విశిష్టములగు వైద్యగుణములు గలవని ఆచార్యుడు త్రోసిపుచ్చెను. జీవకనామధేయుడగు నొక శిష్యుడు మాత్రము వెదకి వేసారివచ్చి ఆచార్యా! తాము కోరిన ద్రవ్యము నాకు లభింపలేదు. ప్రతి దానియందును రస, గుణ, వీర్యములు గన్పించుచున్నవి, కనుక వాటిని చికిత్సకు పనికిరాని వానినిగ నిర్ణయింప నవకాశము గన్పించలేదు, నాయసమర్థతను మన్నింప వేడుచున్నాననెనట. అప్పుడాచార్యుడు పరమానందము నొంది, జీవకా! నీవొక్కడివే శాస్త్ర హృదయము గ్రహించినవాడవు ఉత్తీర్ణుడవైతివి. గురుకట్నము నిచ్చి ధన్యుడవైతివి. నా యానందమును ప్రకటించుటకు నీకు శిష్యకట్నము నిత్తునని ధనరాసుల నొసంగెనట. జీవకుడు తరువాత పాటలీపుత్ర ప్రభువగు బింబిసార చక్రవర్తికి ఆస్థాన వైద్యుడాయెను. బుద్ధభగవాను

నుకున్నుతన చికిత్సా కౌశల్యముతో సేవలొనర్చెనట. కనుక గుణములేని గుణి ఈ ప్రపంచమున లభింపదు. గుణిగుణముల విషయమునను ఇదియే వైశేషిక దర్శన సిద్ధాంతము. దానికి ప్రాప్తిస్థానము వేదాంత దర్శనమే యగును.

సగుణ నిర్గుణములందురే, అసలు గుణమననేమి ? అని యొక శంక. కొందఱు అహింస, అస్తేయము. మున్నగునవి సద్గుణములు హింస, స్తేయము, అసత్యము మున్నగునవి దుర్గుణములందురు. ఇవి మానవ వ్యవహార సంబంధములు. కొందఱు జడత్వాదులు ప్రకృతి గుణములు, కించిజ్ఞత్వాదులు జీవగుణములందురు. ఇవి లేకుండుటచే ఈశ్వరుడు నిర్గుణుడు, సచ్చిదానందములచే సగుణుడందురు. నిర్గుణుడన సత్త్వరజస్తమో గుణాత్మకమగు ప్రకృతి నతిక్రమించిన శుద్ధచైతన్య స్థితియనియు, సగుణుడన సత్త్వరజస్తమో గుణాత్మికయైన మాయతో సంబంధము గలిగినట్లు భాసించు స్థితియనియు, వేదాన్తులు బోధింతురు. గుణమువలన ప్రాకృత పదార్థమునకు చరమరూపములగు సత్త్వరజస్తమో గుణములేయని గ్రాహ్యమగుచున్నది. ఇవి పంచదారకు తీపి, వేపకు చేదు, జలమునకు శైత్యమువంటి భౌతిక గుణములుగావు.

They are univalent elemental ultimates (ie) ultimate units of the pancha bhootas, which, in their Avyakta or, potential state are together known as Prakruti or Pradhana and in their kinetic state, manifest as matter—subtle or solid, animate or inanimate. organic or inorganic, stationary or moving about, They are of three categories :— Inert & stable (Tamas); active and vibrating (Rajas); Tranquil, intelligent and capable of balencing and binding together of the other two stable & vibrating forces.

This is Satwa, the aspect of Vidya. The other two belong to the Avidya aspect. The opposite forces of Vidya & Avidya existing in Prakruti show a *midhunabhava in the relm of relativity too.

ఈ సందర్భమున తంత్రశాస్త్రముల యందలి భావములకూడ విచారించి తెలిసికొనిన యెడల మనకు సమ్యగ్దృష్టి లభించును ఇందు, ఈ నిర్గుణ చైతన్యమున, ఈ యచలమున, ఈ పూర్ణమున "శక్తి" యను భావమొకటి యున్నదనియు అది జ్ఞానశక్తి ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, అని మూడు విధముల ప్రస్ఫుటమగు చుండుననియు తెలిపిరి. ఆశక్తియే లేనియెడల ఈశ్వరుడు శక్తిమంతుడుగాక నిష్క్రియుడే యగుననియు; అందుచే సృష్టి స్థితిలయములు సంభవము గానేరవనియు తెలిపిరి. ఫలప్రదాయినియగు నీ శక్తిని స్త్రీ రూపమునగాని, పురుష రూపమునగాని, ఉత్తమాధికారివైన నిష్కలమనిగాని భావించి సేవింప వచ్చుననిరి.

శ్లో॥ యాదేవీ పరమాశక్తిః । పరబ్రహ్మవిధాయినీ ।
బ్రహ్మానందాభిధానాయై । తస్మై దేవ్యైనమోనమః ॥
శ్లో॥ చిన్మాత్రాశ్రయ మాయాయాః । శక్త్యాకారే
ద్విజోత్తమాః ।
అనుప్రవిష్టాయా సంవిన్నిర్వికల్పం స్వయంప్రభా॥
శ్లో॥ పుంరూపం వాస్మరేద్దేవీం । స్త్రీరూపంవా విచింతయేత్ ।
అథవానిష్కలంధ్యాయేత్ । సచ్చిదానందవిగ్రహమ్ ॥
(కులార్ణవతంత్రము)

శక్తిమంతుడు లేనిచో శక్తికి ఆశ్రయము లభింపదు. కనుక ఆధారముండదు. అట్టిచో శక్తి, శక్తిమంతు లిరువురును భిన్నమగు సత్యస్వరూపములే యని అంగీకరించిన "అద్వయము" అను పదమునే అపవదింపవలసి వచ్చును. మరి సామరస్య మెట్లు సాధింపవచ్చునన్న, విరుద్ధ ధర్మములుగల రెండు భావములు ఏకైక రూపమున నుండుట పొసగునని గ్రహింపవలయును. దీనిని ఆంగ్లమున (Polarity) అందురు. అది యెట్లన :— పార్థివమగు ఇనుప గుండు తైజసమగు అగ్నిచే తప్తమైనప్పుడు దానియందు పార్థివగుణమగు ఘనము(బరువు) తైజస గుణమగు లాఘవము (తేలిక) విరుద్ధములైనను ఏకరూపముననే యున్నవి. దాహకత్వము పార్థివపదార్థ గుణముగాదు. ఘనగుణము తైజసపదార్థగతమును గాదు. ఐనను రెండు విరుద్ధ ధర్మములు ఒకే పదార్థమున నున్నవి. ఇట్లే ధన (positive) ఋణ (negative) ములను రెండు విరుద్ధ ధర్మము లున్నప్పుడేగదా విద్యుత్తునకు సత్వము ! అయస్కాంత విషయమునను ఈ రెండు భిన్నములుగ దోచు ధర్మము లున్నప్పుడేగదా ఆకర్షణ శక్తి ఉద్బుద్ధమగుట ! ఇందు ఒక శక్తి రెండవదాని కున్ముఖముగాని యెడల క్రియాశక్తి వెలుగుగా, వేడిగా, చలనముగ (light heat and motion) ప్రకటితము గాజాలదు. అట్లే నిర్గుణమునందును, శక్తి శక్తిమంతున కున్ముఖమైనప్పుడే నాదము (the primordeal creative stress but not sound) ఉద్బుద్ధమగును. నాదమన శబ్దము గాదు ధ్వని గాదు ఇది శబ్దమునకు పూర్వాతిపూర్వమగు రూపము. అచలమునందొక అద్యస్పందనము. ఇది పరాశక్తి యొక్క దివ్యస్థితియందు ప్రప్రథమ రూపరహిత సృష్టికి నాందిమాత్రమే. ఇదియే ఓంకారము. ఇది పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ యను నాలుగు స్థితుల పరంపరతో స్థూలరూపమునకు వచ్చును. ఈ నాదమే శుద్ధమాయ. ఇది బ్రహ్మయందు యోగము పొందియుండి బ్రహ్మస్వరూపమే యైనట్టిది.

అర్థసృష్టియందు ఈ నాదప్రభావముచే బిందూత్పత్తి యగును. బిందువన సూక్ష్మాతి సూక్ష్మ తమమగు, సృష్టికార్యమును (unmanifest creation) ఉపక్రమణజేయ ననువగు ప్రప్రథమ శక్తి పరిణామస్థితి. ఈ బిందువునందు ఇంకను ప్రసరించు నాదము కళను అనగా అవ్యక్త సృష్టికి నాంది పలుకును. ఇంతవరకు మనము మూల ప్రకృతికి పూర్వాతి పూర్వ దివ్యసూక్ష్మసృష్టి (అప్రాకృత లేక శుద్ధసృష్టి) భూమిక యందున్నాము. తదుపరి వచ్చునది అవ్యక్తమనబడు, త్రిగుణ సామ్యావస్థా పూర్వకమగు అపరాప్రకృతి. ఇదియే మూలప్రకృతి, ప్రధానము, లేక మాయ. ఇట్టి మాయను పరమాత్మయొక్క ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తి యుక్తమగునట్టి తత్త్వముగ గ్రహింపనేరక యేదో యొక కనుకట్టు విద్యగా బోధింపబడు చున్నాము. పరమేశ్వరుడు పరమేశ్వరియు అద్వయమగు ఒకే అర్ధనారీశ్వర తత్త్వము. కనుక మాయ యనునది పరమేశ్వరు డెంతసత్యమో అంత సత్యమగు భావము లేక అంతే సూక్ష్మ తమమగు సత్త్వము. మాయాశక్తియే సత్త్వగుణ ప్రాబల్యముచే సూక్ష్మ తమమగు మనస్సుగను రజోగుణ ప్రాబల్యముచే, మూలమగు స్థూల పదార్థముగను స్ఫురించుచు స్వస్వరూపమున చిద్రూపిణిగనే యుండును. శుద్ధ విద్యాతత్త్వము నుండి ప్రభవించు అపరాప్రకృతి త్రిగుణ అవ్యక్తావస్థ. అందుండి ప్రభవించు మహత్తు త్రిగుణ వ్యక్తదశకు నాంది. అందుండి ఉద్భూతమగు అహంకారము (sense of Egoism or I) అందుండి తన్మాత్రలు (pure and uncombined elemental units) అందుండి పృథివ్యాది భూతపంచకము, నామరూపములు మాయాశక్తివలననే గలుగుచున్నవి. కనుక నీ మాయాశక్తి (spirit) అందుండి గలుగు 36 తత్త్వములు (matter) అవిభాజ్యములు, కారణ కార్య దృష్ట్యా అనన్యములు. అనగా ఏకరూపత్వమే సిద్ధము. ఐనను ఆదిశక్తి

యగు చిత్ శక్తి (దృక్ లేక ప్రకాశము subject) తనను తాను దృశ్యము (విమర్శ లేక object) గ చూచుకొను లక్షణము గలిగియుండుటచేతనే ఈ అష్టమూర్తులు భాసించుచున్నవి. "చిదేవశక్తిః" అనుట యందలి భావము "శక్తియే చిత్" అనిగాని చిత్ యొక్క శక్తి కాదని, "శక్తి శక్తిమతోరభేదః" అను వాక్యము సుస్పష్టము జేయుచున్నది. (It is not a quality potency or attribute but the thing-in-itself. Siva is consciousness as stasis and Sakti is consciousness as dynamis. It is Maya that reveals God కనుకనే ఆమె సత్యజ్ఞాన ప్రసూనాంబ. Without knowing the Sakti, the manifested power of God there is no means for knowing him. From Maya alone springs up duality & relativity. Beyond Maya there is neither the enjoyer nor the object for enjoyment.

"శుద్ధస్ఫటిక సంకాశం *స్వతంత్రాద్యారోపం । బ్రహ్మైవభాతి ఉరుధైవ విచిత్రవేషం" (కైవల్యోపనిషత్). మిథునరూపమగు ఏకాత్మయే (the one entity with dual aspects is the truth) సత్యము లేక పరమార్థము. చిత్శక్తియే ప్రకాశము. మలిన మాయాశక్తి (విమర్శ) భౌతిక భూమిక యందలిది, కనుక ఆవిర్భవించిన శక్తి లేక మాయయే జగత్తు. ఆవిర్భవించని శక్తియే చిత్శక్తి లేక ప్రజ్ఞానము (consciousness absolute) ఇందుచే ఖనిజ లోహములను, నిర్జీవపదార్థములని భావించుచు మన ఇంటి సామానులును సుశోభింపజేసిన మాయాశక్తి రూపములే యగును. మరియు సామాన్య చైతన్యము సధిష్ఠానముగ గలిగియున్నవే యనియు తెలియవలయును. హోమియోపతివారి పంచదార మాత్రయందు ఔషధసారమెంత సూక్ష్మతమమో అట్లే యుండుండెడి సామాన్య చైతన్యాంశా భాగముసూ మన బుద్ధికందనిది అగు. ఈ చర్చ

యందలి గ్రాహ్యాంశమేమన—ఈ నామరూపాత్మకమగు స్థూలమంతయూ శక్తియొక్క ఆవిర్భావము. దానియందు సామాన్య చైతన్యము అధిష్ఠానముగ నున్నందుననే దానికి ఉనికి ప్రాప్తించుచున్నది. *శక్తిని ఆవిర్భావరూపమగు ఆభాసయని శాక్తేయులు, వివర్త ప్రక్రియచే మిథ్యాపూర్వక అభాసయని అద్వైతులు బోధింతురు. ఎవరెట్లు గ్రహించినను ఆ వస్తువునందలి "విమర్శ" శక్తిచే దృశ్యము భాస్యమగుటయే మనసు సత్యవస్తు జ్ఞానానుభూతి లభ్యమగుటకు ఆటంకముగా దెలియుచున్నది. అందుచే చిత్తమునకు దృశ్యముపై రాగమున్నంత వరకు ఆధారమగు చితియొక్క జ్ఞానముగలుగదు. నిష్కామకర్మ, ఉపాసనలతో చిత్తశుద్ధి ప్రాప్తించిననాడే సత్యవస్తు దర్శనమగును. లోకమాన్య తిలక్ మహాశయులు ఈ కారణముననే తమ గీతారహస్యమునందు కర్మయోగమునకు విశిష్టత గల్పించి బోధించియుండిరి. సారాంశము : ఈ జగత్తంతయు శక్తి+తత్త్వముల అంశాత్మకమే (aspects of matter and spirit) యై సామాన్య చైతన్యము నధిష్ఠించి భాసించుచున్నది. ఈ సామాన్య చైతన్యము తమోగుణాత్మక ఆవరణశక్తిచే ఆవరింపబడి, రజోగుణ స్పందనశక్తిచే చేతనప్రాప్తి గలిగి (ప్రాణశక్తిని పొంది) సత్వగుణముచే కొంత స్థాయీభావము నొంది జగత్తుగ భాసించుచున్నది.

ఈ ఆవరణనే సాంఖ్యులు "ప్రకృతి" యను ప్రత్యేక తత్త్వమనిరి వీరు శుద్ధసృష్టి భూమికలగు శుద్ధవిద్య, ఈశ్వర, సదాశివ, శివ, శక్తి, తత్త్వముల దర్శించి స్పృశింపలేదు. అద్వయమత కర్తలు, సృష్టిని బ్రహ్మనాశ్రయించి అనాదియైయున్న ఒక అనిర్వచనీయ మహాశక్తి యనిరి. (అది సత్ అసత్గ ఒకేసారి భాసింప సమర్థము (A simultaneous Is and Is-not) అనిరి. శాక్తేయులగు అద్వయవాదులు మాయ తన స్వస్వరూపమునకు భంగము లేకుండగనే, తన్నుతానే ఆవరించుకొన

గలుగు శక్తియనిరి. ఇది కాశ్మీరశైవుల ఆభాస పరమార్థ వాదమునకు తుల్యముగ నున్నది. కనుకనే శాస్త్ర వివరణయందు వీరికి చిదాభాసుని ప్రసక్తియే గలుగదు. అనగా మాయయందు ప్రతిఫలించిన చైతన్యము ఈశ్వరుడనియు అంతఃకరణమునందు ప్రతిఫలించిన చైతన్యము జీవుడనియు అంగీకరించరు. మాయ బ్రహ్మయొక్క బుభూష, ఇచ్ఛాశక్తియే యనియు ఈ శక్తికి శక్తిమంతునితో అభేదమేననియు, కనుక చిత్ శక్తియే స్వకీయ ఆవరణ శక్తిచే తన్ను తా నావరణ జేసికొన్నందున సృష్టికార్యము జరుగుచున్నదనియు తెలుపుదురు. జీవుల అనాది సంస్కారముల పరిపాకానుగుణ్యముగ సృష్టికార్యము చిన్మయియగు యోగమాయ ద్వారా జరుగుచున్నదని అందుచే సర్వము చిన్మయమేననియు తెలుపుదురు. సాన్నిధ్యముయొక్క ఫలితమే కదలిక. మాయయొక్క సాన్నిధ్యమే సృష్టి. సూదంటురాయి ప్రభావముచే ఒక చిన్నమేకునకు ఆకర్షణశక్తి సంక్రమించినట్లు *అజ్ఞానము చిత్ శక్తి ప్రభావముచే చిదాభాసుని ద్వారా జ్ఞానశక్తిగ ప్రకాశించునని శంకరులు, జ్ఞానమునందే అజ్ఞాన తత్త్వము నిజాంతర్గతముగ నున్నదని శాక్తేయులు చెప్పుదురు. (**Sentiency is an integral constituent of all existence even in the mineral kingdom.** కాని, మాయ అనాదియయ్యును జ్ఞానముచే నశించునని చెప్పుచున్నదే శాస్త్రము! సదా పరమాత్మయొక్క ఆలంబనముచే ఉనికి గలిగియుండు మాయ నశించుటెట్లు సపన్నమగును? ఇచ్చట నశించునది శక్తియుగాదు దానికాధారమగు పదార్థమున్నుగాదు, వానిని గూర్చిన భ్రాంతి జ్ఞానము మాత్రమే, శుక్తియందు రజతభ్రాంతి నశించునట్లు నశించును. ఉదాహరణకు జీవన్ముక్తుని తీసికొందము. అతని భ్రాంతి మాత్రమే నశించి ముక్తుడగుచున్నాడు గాని విదేహాము క్తుడగుట లేదుగదా! మాయాతత్త్వము నీకోణమునుండి గ్రహించిన యెడల మిథ్యాత్వమననేమో సుబోధకమై అద్వైత భావసిద్ధి గలుగును. మాయ

బ్రహ్మస్వరూపముగనే గుర్తింపనగును. దృశ్యమంతయు మాయాశక్తి విజృంభణచే కార్యముగ భాసించి, కొంతకాలము స్థితి గలిగియుండి దేశకాలములచే పృథగ్భావము నొంది భిన్నభిన్నములుగ గోచరించినను, దాని నిజస్వరూపము మాత్రము సర్వాత్మాధిష్ఠానకమే.

"మాయావీవ విజృంభయత్యపి మహాయోగివయస్వేచ్ఛయా". బీజాంకుర న్యాయముతో నింతవరకును నియతసృష్టి (Determinism) తెలుపబడినది. ఇది సమాధిస్థితి లభించువరకును వర్తించును. కారణ కార్యముల కేకత్వము సూచించును. సమాధిస్థితి ప్రాప్తించిన తరువాత నీ నియమబద్ధ ప్రక్రియలు అతిక్రమింపబడగలవు. ఎట్లన :– ప్రపంచమున జీవకోటియందు మానవుడే ప్రజ్ఞావంతుడు, కాని ఆతని శరీరమునగల కోటానకోట్ల జీవకణములుకూడ బహుప్రజ్ఞావంతములు, స్వతంత్రములు కూడనై యున్నవి. మానవుడు తన ప్రజ్ఞతో తన హృదయమునందలి కణముల శాసింపలేడు, రక్తకణముల శాసింపలేడు, గుండె స్పందననాపలేడు, రక్తప్రసారమునాపలేడు. సమాధిస్థితి సిద్ధించిననాడే యిట్టి కార్యముల స్వేచ్ఛతో చేయగలడు. (In the process of evolution the human being is the highest in the order of intelligence. But the cells in his intestine lungs or other viscera are more intelligent more independent and capable of subtlest functions. One can't master the functions of the different organs in his body. It is only yoga that can master these functions by releasing and letting loose the powers hidden in one's body. We have therefore to admit the presence of a superior intelligence who only is capable of independent action, creation or dissolution. We may designate that intelligence as God and understand that he

could never be understood by human intelligence but could only be realised by intuition and experience. He is some thing like the subatomic particle—so subtle and yet so potent and capable of free will".

మాయాజీవ యన మాయ కలవానివలె నున్నవాడు. కొద్దిపరిధిలో ఐంద్రజాలికుడుగా వచ్చును. బ్రహ్మాండ భావమున సృష్టికర్తగా వచ్చును. మహాయోగియన అణిమాదిసిద్ధులబొందిన యోగి గావచ్చును. బృహద్భావమున యోగీశ్వరేశ్వరుడగు పరమాత్మ గావచ్చును. వీరి మాయాశక్తి విజృంభించిన యెడల నూత్నమగు సృష్టి ప్రక్రియలు సంభవించుచున్నవి. వీనియందు ఒక విధానము మనకు గోచరించుచున్నది. అది బీజాంకుర న్యాయరూపమున జరుగుచున్నది. ఇది ప్రవాహము వంటిది. నాటిన బీజమునకు సాజాత్యమగు మొక్కయే వచ్చుచున్నది. ఈ ధర్మము మూలప్రకృతి, పంచీకృత పంచభూతములుగ పరిణమించినప్పటి నుండియు సత్యముగనే యున్నది. అనగా ఈ సృష్టి ఒక నియతక్రమపద్ధతిన పరిణామము బొందుచుండును. ఈ ప్రక్రియను పాశ్చాత్య శాస్త్రీకులు Teleology యందురు. "A branch of metaphysics, the doctrine of final causes and of the uses which every part of nature was designed to subserve the agreement from design in proof of the existence of God". సదాత్మకుడగు పరమాత్మ ఉనికిని ధృవపరచుటకు అదికారణ సిద్ధాంతానుసార నిర్ణీత ప్రక్రియకు (design) అను ప్రమాణముగ ప్రకృతి యందలి ప్రతి అంశయు పురోగమించును అని తెలుపు సూత్రము.

"యఃస్వేచ్ఛయా".: ఇక స్వేచ్ఛాసృష్టి (Free will) ఎట్టిది? జగత్పరిణామ ప్రక్రియలో మారుచున్న స్థితుల తనువగు శరీరావయవ నిర్మాణముగాని లేదా ఒక నూత్నజాతి (species) ని గాని తన ఇచ్ఛా

సంకల్ప మాత్రముననే నూత్నసృష్టిని జేయసమర్థుడు పరమాత్మ. పరమాత్మ యోగీశ్వరేశ్వరుడు గనుకనే మాయాశక్తిని తన వశము నందుంచుకొని సూర్య, చంద్ర, భూమ్యాదిగ్రహములు ఒకదానికొకటి యెంత దూరమునందున్న, ఆకర్షణశక్తి నెంతవరకు పరిమిత పరచిన సంక్షోభము గలుగకుండునో యెరింగి వానినట్లు నియమించు సమర్థుడు, పరమజ్ఞాని. ఇది భగవంతుడు సర్వదా చేయుచుండు ప్రాణాయామము (ప్రాణశక్తిని నియమించి ధరించి యుండుట). అంతియగాని ప్రాజ్ఞుడుగ నున్నవాడు సుప్రభాతము పాడినప్పుడు జాగ్రత్తునకు వచ్చుటవంటిది గాదు. పరమాత్మ స్వేచ్ఛా సంకల్పానుసారము క్రొత్తయోనుల సృష్టించి తరువాత నియమబద్ధ ప్రపంచ కార్యమునకు దోహదము జేయగల మాయావి. ఈ భావమును పాశ్చాత్య తాత్త్వికులు Vitalism లేక "Emergent Evolution అందురు. The philosophical doctrine that the behaviour of the living organism is at least in part, due to a vital Principal, which cannot possibly be explained wholly in terms of Physics & Chemistry : Evolution, like the work of an artist is creative and therefore unpredictable; that a vague need exists before hand, with in the animal or plant before the means for satisfying the need develops. అనగా జీవకోటి యందలి ప్రతిచేతనాంశయును పాక్షికముగనైన, భౌతికములగు ఫిజిక్స్, రసాయన శాస్త్రముల (chemistry) జ్ఞానముతో నిరూపింప అనువుగాని ఒక శక్తియుక్తమగు భావములననే (by a potent principle) ప్రాదుర్భవించును. కళాకారుని రచనవలె (imaginative nature) విశ్వపరిణామ క్రియయు నిర్మాణాత్మకము గనుకనే అనూహ్యము. ఒక జంతువునందుగాని, వృక్షమునందుగాని అది వర్ధిల్లుటకు ముందుగా, మనమూహింప సాధ్యపడని ఒక అస్పష్ట అవసర పరిస్థితి (a vague

need) అంతరముగ నుండియే యుండును. వర్ధిల్లజేయు శక్తిని దెలుపు భావమును (Vitalism) అందురు. ఆ అస్పష్టావసరమును పూరించి ఆ యవసర సృష్టిని సద్యఃకాలమునజేసి ఆ జీవి మనుగడకు సహకరించు నదే అత్యవసర పరిణామము (emergent evolution).

ఈ శ్లోకమున మనము గ్రహించవలసిన విషయములు 1. బీజములో అంకుర రూపమున (కారణరూపమున) ఒక మహావృక్షమున్నట్లు సృష్టికి పూర్వము ఈ దృశ్యమానమంతయు కారణ రూపముననే యుండెను. 2. సృష్టి కార్యము జరుగుటకు అద్వయ మిధునరూపమున నున్న మాయాశక్తి (the divine intelligence) విజృంభించి కళా (సృష్టి) రూపముదాల్చును. 3. మరల నిర్వికల్పస్థితి, మరల సృష్టియు మాయాశక్తి విజృంభణచేతనే జరుగును. 4. ప్రాకృత సృష్టిలోనున్న బీజాంకుర న్యాయబద్ధముగానట్టి స్వతంత్ర నూత్నసృష్టి పరమాత్మ జేయ స్వేచ్ఛగలిగి యున్నాడు. *అనగా సృష్టికి కారణము ప్రకృతి యొక్క సహజ, నైజ, స్వతంత్ర శక్తిగాక ప్రకృతిని నియమించగల స్వతంత్ర శక్తిమంతు డొకడున్నాడు అనుటయే "యః స్వేచ్ఛయా" యను పద భావము. అనగా స్వేచ్ఛా సృష్టి సాక్షివివర్తముచే ప్రాప్తించును. ఈ విషయముల విమర్శించి గ్రహించిన ప్రకృతివాదులు జెప్పునట్లు సృష్టి యందు బీజాంకుర న్యాయబద్ధమగు (determinism) నొక శక్తి యున్నను అద్దాని కాలంబనమునిచ్చు స్వరూపసత్యము, త్రికాలాబాధితమగు మహత్తర సర్వసర్వాత్మక శక్తి ఒకటి యున్నదని తెలియపలయును. అది, అద్వితీయము. శక్తిమంతునితో యోగమున నున్నప్పుడు అది పరమాత్మ యనియు వివర్తమో ఆవిర్భావమో సంభవమగునప్పుడు "పాదోస్యవిశ్వాభూతాని" యనినట్లు ఆ శక్తి యొక్క ఒక పాదభాగము మాత్రమే స్వచ్ఛందముగ ప్రసరింపబడును. మిగత మూడుపంతుల మేరకు

అమృత స్వరూపముగనే, శక్తిమంతుని స్వరూపమే అయియుండును ఈ చర్చచే వివర్తమున ద్వైవిధ్యమును గమనింపనగును.

1. సాక్షివివర్తము: "బ్రహ్మబ్రహ్మణి బృంహితమ్". అనగా బ్రహ్మ తనకుతానే మాయా కల్పిత బహుభవనముగ విజృంభించును అనిభావము. "ఆత్మకృతేః పరిణామాత్" (బ్ర. సూ.) (The self evolves of its own free will) బ్రహ్మ తన స్వేచ్ఛాసంకల్పము చేతనే పరిణమించును కనుకనే బ్రహ్మసత్యం జగద్బ్రహ్మవివర్తమని గ్రాహ్యమగుచున్నది. ఇది దృష్టి సృష్టి వాదమునకు అనుబంధమగును. ఇది ఆత్మాశ్రయ భ్రమచే సంభవించును. Here the nescience and the consequent illusion is self evolved and self superimposed. ఇందు అధ్యాస ఆహార్యము. *ఈభేదము గమనీయము, గణనీయము.

2. ప్రమాతృ వివర్తము :— ఇది చిదాభాసుని భ్రాంతిచే గలుగు వివర్తము. దీనిని అజాతవాదమనియు అందురు. ఇది ముందు తెలిపిన సృష్టి దృష్టి వాదమునకు అనుబంధము. ఇది ఆత్మాధిష్ఠానక భ్రమచే ప్రాప్తించు వివర్తము. ఇందు ప్రమాత ఆశ్రయము ఆత్మ అధిష్ఠానము అగును కనుక అధ్యారోపము ప్రమాతవలననే చేయబడునట్లు స్పష్టమగుచున్నదిగాని బ్రహ్మమే, తన స్వేచ్ఛా సంకల్పముచే, చేయునట్లు స్ఫురింపదు. అనగా అధ్యాస ఆహార్యముగాదు. Here Bramha is not self evolved by His free-will, but is super imposed by the Pramata)

అధ్యాత్మమున, నిర్వికారుడగు ప్రత్యగాత్మ, కర్తృత్వ భోక్తృత్వ రూపమగు సంసార భావముతో విస్తరించుటయు, అద్వితీయాఖండ

రూపుడగు పరమాత్మ ఈశ్వర భావమునుజెంది నామరూపములుగ స్ఫురించుటయు, బీజమునుండి అంకురము వృక్షముగా విస్తరించు క్రమపద్ధతి యగు అసత్కల్పమునకు (apparent creation) మరల నిర్వికల్పమగుటకు (dissolution) మాయాశక్తియే కారణము. కనుక విశ్వమను రూపములో మానవ మస్తిష్కముచే గ్రహింపబడు వస్తుసంపద యంతయు (abundence of phenomena) అధిష్ఠానమగు పరమాత్మ తన మాయాశక్తిచే కల్పించిన సద్రూప విలాస విలసనమే (illusory. manifestations of the real\ అని భావింపవలయును. జీవుని యందు వాసనారూపముగ సూక్ష్మశరీరము నాశ్రయించియుండు కర్మల ననుభవింప నవకాశము గలిపించుటకే ఈ యసద్రూప విలాససృష్టి జరుగుచుండుట. (Creation of the animate and inanimate or organic and inorganic is intended to enable the Jeeva to enjoy the reactions of his good or bad actions done in accordence to his innate instincts which stimulate Ragadwesha etc., with which he is imbued. The effort put forth to control the instincts is Bharateeya culture or paramardhika sadhana. సత్వరజస్తమోగుణముల స్వరూప స్వభావముల గ్రహించి రజస్తమోగుణ ప్రభావజన్య మానసిక ఉద్వేగముల నదుపులోనికి దెచ్చుకొని శుద్ధ సత్వమును పెంపొందించుకొని, వాసనాక్షయము జేసికొని అప్రాకృత భూమికల అంచుల జేరుటయే వేదాంత శాస్త్రమున పారమార్థిక సాధన యందలి ముఖ్యోద్దేశము. ఇది ప్రాప్తించనివారికి తత్-త్వం రెండును అసిగాక మసియే యగును. ఈ భావము చెప్పుకొనుటకు చాల అనువుగ నుండునుగాని ఆచరణ విషయమున దుర్గమమే. ఒక ఉపనిషద్వాక్యమును గమనించుడు.

శ్లో॥ ఈశావాస్యమిదగ్ంసర్వం । యత్కించ జగత్యాంజగత్ ।
తేనత్యక్తేన భుంజీథా । మాగృధః కస్యస్విద్ధనమ్ ॥

ఇది ఈశావాస్యమున మొదటి మంత్రము. భావము : ఈ ప్రపంచ మంతయు పరమేశ్వర వ్యాప్తము. తఈశ్వర స్వరూపమే. అంతయు సర్వాత్మ లేక ఏకాత్మయే. అందుచే త్యాగబుద్ధితో నీ కావశ్యకమున్నంత వరకే అనుభవింపుము. ఇతరుల ధనముల నాశించి తెచ్చి కూడబెట్టకుము. మార్క్సు, ఎంగిల్సు, మున్నగు సామ్యవాదులకు ఎన్ని యుగముల పూర్వము సామ్యవాద సిద్ధాంతము భారతమున సుప్రతిష్ఠితమై యుండెనో గమనించుడి. ఈ మంత్రమును వల్లెవేసి ఆచరణను త్రోసిపుచ్చి ఉపనిషత్తుల జదివితిమని సంతృప్తులగు వారును . "అనిత్యాని శరీరాణి అందరి ధనము మనకేరాని" యనుభావానుసారము జీవయాత్ర సాగించునెడల పారమార్థికము లభించునా ? ఉపనిషత్పారాయణము మాత్రముననే ముక్తి లభించునా ? సాధన లేనివారికి గీత ఉపనిషత్తులు కుంటివానికి కర్రకాళ్ళవలె మాత్రముపకరించునుగాని, పరుగిడి గమ్యమును జేరుట కుపకరించు సహజ పాదేంద్రియములు మాత్రము గాజాలవు. సాధనలేని శాస్త్రపఠనము బుద్ధికి విలాసమాత్ర వైభవమే యగును.

(1) పుట్టుటకు పూర్వము కార్యము కారణరూపమున నుండునని (2) కనుకనే కార్యకారణములకు అనన్యత్వము నిశ్చితమని బీజాంకుర న్యాయ దృష్టాంతముతో బోధించి, (3) అసత్తు నుండి ఈ సృష్టి జరుగదని నిర్ధరించి (4) సదాత్మకమగు నిర్వికల్పస్థితిని అందుపై మాయాశక్తిచే ప్రాప్తించు అసత్కల్పస్థితిని బోధించు సద్గురు దక్షిణామూర్తికీ ఈ నమస్కారము.

3. శ్లో॥ యస్యైవస్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే।
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్।
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
॥తస్మై॥

టీక :_ యస్య_ఏ ప్రత్యగ భిన్నపరమాత్మ యొక్క, సదాత్మకమ్_ సద్రూపమగు స్ఫురణం_చైతన్యము, అసత్కల్పార్థగం _ లేనిదానితో సమానమైన (స్వతన్త్రి సత్తా లేని) ప్రపంచమును వ్యాపించినదై, భాసతే _ ప్రకాశించుచున్నదో, యః _ ఎవ్వరు; తత్_త్వం_అసి _ నీవు పరమాత్మవు, ఇతి_అను, వేదవచసా _ వేదవాక్యముచే, ఆశ్రితాన్_ శిష్యులకు, సాక్షాత్_అవ్యవధానముగ, బోధయతి _ తత్త్వమును అపరోక్షమగు నటుల బోధించునో ఆ శ్రీ గురుమూర్తి అగు దక్షిణామూర్తికి నమస్కారము.

తా॥ స్వతః సత్తాప్రకాశములేని జడమైన జగము, ఎవని అనుగ్రహముచే సత్తాస్ఫురణలు కలిగి భాసించుచున్నదో; ఎవడు "తత్_త్వమ్_అసి" అను మహావాక్యోపదేశముజేసి తన నాశ్రయించిన ముముక్షువులను కృతార్థులను జేయుచున్నాడో, ఎవరిని సాక్షాత్కరించుకొనుట వలన సంసారమున (జనన మరణముల నొందుచు సుఖదుఃఖముల ననుభవించుచు గమనాగమనముల జేయుట) నుండనవసరములేదో అనగా జన్మరాహిత్యము ప్రాప్తమగునో ఆ సద్గురు దక్షిణామూర్తికి నమస్కారము.

ఈ సత్స్వరూపుడగు యే పరమాత్మసత్త (existence absolute) అసత్కల్పములగు నామరూప ప్రపంచములుగ భాసించుచున్నదో అనగా

చైతన్యమునందే స్వీయ ప్రభావము చేతనే స్ఫూర్తిని బొందుచున్న నామరూపములు తాత్త్వికముగ అసద్రూపములుగావు. అని "తత్-త్వమ్-అసి" యను వేదవాక్యమును విచారణజేసిన తెలియునని, ఈ భావమును సాక్షాత్కరించుకొనిన (అపరోక్షానుభూతి నొంది) వానికి పునఃజన్మ గలుగదని బోధించు సద్గురు దక్షిణామూర్తికి నమస్కారము.

ఋషులు పరమాత్మను అఖండ సచ్చిదానంద స్వరూపుడుగ నిర్ణయించి చెప్పిరి. మన కండ్లకు కనుపించని పరమాత్మను సత్స్వరూపుడు, సర్వాత్మకుడనియు, యింద్రియములకు ప్రత్యక్షముగా గోచరించుచు, అనుభూతుల నిచ్చుచున్న నామరూపములుగల వస్తు సంపదను అసత్తు, అనిత్యం, మిథ్యయని చెప్పుటెట్లు పొసగునని ప్రశ్న. ఈ ప్రశ్న వేదాంత శాస్త్రమున నొక గడుసమస్యాపూరణముగ, మనన యోగ్యముగ మానవజాతి నెదుర్కొనుచున్నది. ఇందుకు సమాధానమే ఈ శ్లోకభావము. ఇది గ్రహించుటకు ముందు 'సత్' అననేదో, 'అసత్' అననేదో ఒక నిశ్చితాభిప్రాయము గలుగవలెను. దీనికే సదసద్వివేకమని శాస్త్ర పరిభాష. పదార్థము మూడు విధములుగ వర్గీకరింపబడినది :-

1. సత్పదార్థము :- త్రికాలముయందును ఉనికిగలిగి సర్వమునకు అధిష్ఠానమై యుండునట్టిది.

2. అసత్తనగా తుచ్ఛపదార్థము :- శబ్దముదప్ప అర్థ (వస్తు) రూపములేనిది. ఉ॥ కుందేటికొమ్ము, గగన కుసుమములు.

3. మిథ్యాపదార్థము :- అర్థసృష్టి యున్నను శబ్దసృష్టి అందుకు భిన్నముగా యుండునది; ఒకటియైయుండి ఇంకొకటిగా స్ఫూర్తినిచ్చునది ఉ॥ ఎండమావులు; ఇచ్చట అర్థసృష్టి సూర్యకిరణములు; కాని శబ్దసృష్టి

నీరు. ఇప్పుడు ఈ మూటిలో ఏ పదార్థముతో, ఏ ప్రక్రియతో ; నీ జగత్తు సృష్టి జేయబడినది ? లేక స్వతంత్రముగనే సృష్టియైనదా ?

1. శూన్యమునుండి పుట్టినదని కొందరు చెప్పుదురు శూన్యము నుండి శూన్యముదప్ప యితరము ఉత్పత్తిపొంద నవకాశము లేదుగదా ! కానీ ఈ ప్రపంచములో సూర్యుడున్నాడు చంద్రుడున్నాడు, భూమి యున్నదని తెలుసుకొనుచున్నాము. ఈ ఉన్నాడు, ఉన్నది యను పదము లనే పరిభాషలో 'అస్తి' యని 'భాతి' యని యందురు. ఇంకనూ ఈ వస్తువ నాకు యిష్టము అనుచున్నాము. యిష్టమునకు పరిభాషాపదము ప్రియము. ఈ అస్తిభాతి యనునవి సత్తు చిత్తుల సూచకములు, ప్రియము ఆనందలక్షణ సూచకము. కనుక శూన్యమునుండి ఈ భావముల స్ఫురింప జేయు పదార్థములు పుట్టనేరవు. అర్థ సృష్టిలేని శబ్దసృష్టి తుచ్ఛము.

2. బీజాంకుర న్యాయానుసారము పరిణామ ప్రక్రియతో భౌతిక సృష్టి జరుగుచుండుట అనుభవమున మనము గమనించుచున్నదే. మూల ప్రకృతి నుండి, సూక్ష్మము నుండి స్థూలమునకు, సత్త్వరజస్తమో గుణ ముల ప్రాబల్య ప్రభావముచే పంచీకృత పంచభూతములుగ, వానియంశల సంయోగముచే నేర్పడు వస్తుసంపదగ, దృశ్యమానముగు నదంతయు, పరిణామ ప్రక్రియగనే అంగీకరించ వచ్చును. పరిణామ రూపముగు నీ సృష్టియంతయు వివర్తముగ నెట్లు గ్రహింపదగునో తరువాత వివరింతము. ప్రకృతము ఈ భౌతిక పదార్థము పరిణమించుచున్నదే గాని నశించుట లేదని మాత్రము గ్రహింతము. ఇందుకుదాహరణము :- ఒక ఆవుదూడను గమనింతము. అది చాలా చిన్నదిగ నున్నది. నిర్జీవ పదార్థమని మనము తలంచుచున్న ఎండుగడ్డి, జనపకట్టను దెచ్చి ఆ దూడను పోషించిన, ఆ గడ్డి జీర్ణమై దాని రక్త, మాంస, అస్థి (బొమిక) చర్మము, వెంట్రుకలు, కొమ్ములు యింకనూ మన కాఫీకి పాలుగా

పరిణామము చెందుచున్నవి. అనగా ఆ నిర్జీవ పదార్థమగు గడ్డిగాదము జీవరసాయన పదార్థములై రక్త, మాంస, అస్థి, శుక్రము మున్నగు ధాతువులుగ పరిగణమించినది. దూడ పెద్ద ఆవుగా రూపొందినది. ఆ యావు విసర్జించిన మలమూత్రములు భూమియందు నైట్రోజిన్ సోడియం, పొటాషియం, కేల్షియం, యిత్యాదులుగ రూపాంతరము పొంది, మరల వృక్షజాతి కాహారమగుచున్నది. వృక్షములు ఈ పదార్థమును మనకు ధాన్యరూపమున పండ్లరూపమున యిచ్చుచున్నవి. ధాన్యాదులును మన కాహారమై మరల మలములుగ విసర్జింపబడు చున్నవి. పదార్థము **(matter)** న కిదియొక సంసార చక్రము మాత్రమే. మూల పదార్థము రూపాంతరములఁ నొందుచున్నదిగాని నశించుటలేదు. జడపదార్థము ఒకప్పుడు జీవపదార్థముగ మరల జడపదార్థముగ పరిగణమించుచున్నది. ఈ పరిణామ ప్రక్రియను తిరోగమన పథమున పరికించిన **(process of involution)** అనగా భూతముల నుండి తన్మాత్రలకు అందుండి యహంకారమునకు అందుండి మహత్తునకు యిలా సూక్ష్మతరభూమికలకు అధిగమించుచూపోవ, చివరకు సత్వరజస్తమోగుణ సామ్యరూపమగు మూలప్రకృతి వరకే పోగలము. అక్కడ ఆగవలసినదే. కనుక యిదంతయూ జడపదార్థమే. శుద్ధ చైతన్యము చేతనే యిది యంతయూ స్ఫూర్తిని బొందుచున్నది. జీవచైతన్యము చేతనే రాగాదిగుణపూరితమై సుఖదుఃఖములకు, కర్తృత్వ భోక్తృత్వములకు తావిచ్చుచున్నది. దృశ్యములు పరమాత్మయొక్క చైతన్య విభూతులని, అసత్పదార్థములని గ్రహించ వలసియున్నది. ఇందునుబట్టి ఈ నామరూపములు స్ఫూర్తినిచ్చుచున్నను త్రికాలాబాధితములు గావన్నియు, చైతన్యసత్తా మాత్రములుగావని తేలుచున్నది. ఇందువలన నిది మిథ్యావస్తు స్ఫూర్తిగ పరిగణింపబడు చున్నది. నిజరూపము శుద్ధ చైతన్యమే అయియుండ, భిన్నరూపములతో స్ఫూర్తి గలుగు చున్నందున మిథ్య యనబడుచున్నది.

పరిణమించునది జడపదార్థమని సాంఖ్యమతము, అజ్ఞానమని వేదాంతులమతము. పరిణమించుటకు అజ్ఞానము భావపదార్థమా ? యని ప్రశ్న. అజ్ఞానము ఆవరించి యున్నంతవరకు భావపదార్థమే. *ప్రజ్ఞానానుభూతి గలిగినంతనే అది అందుననే సమరసించిపోవును. అప్పుడు దీనికి ప్రత్యేక భావముండదు. ఇట్లు భావపదార్థముగ భాసించి ప్రబోధచే సమరసించిపోవు దానినే మిథ్యా, మాయా లేక ప్రాతిభాసిక పదార్థమందురు. కనుక అవిద్య, మాయ, అజ్ఞానము అనునవి వేదాన్తి మతములో అభావములని చెప్పబడవు. పారమార్థికములనియూ చెప్ప బడవు. మిథ్యాభావములు, ప్రాతిభాసిక భావములనియు చెప్పబడును. ఈ వైలక్షణ్యమును (descrimination or distinction) ద్వైత విశిష్టాద్వైతులకంటెను వేదాన్తులు పృథక్కరించి దెలిపిరి. ఇదియే అసత్కల్పార్ధగం భాసతే యను వాక్యభావము.

3. సత్పదార్థము : ఇది జీవచైతన్యమునకుగూడ అధిష్ఠానమై యున్న కూటస్థ చైతన్యము. ఇది ఒక యుపాధి శిథిలావస్థకు వచ్చిన యెడల మరల నింకొక యుపాధిని చేరును. ఆ చైతన్య సత్తాప్రభావము చేతనే ఆ యుపాధి మరల పెరిగి కొంతకాలము స్థాయీ భావమునొంది తరువాత లయించుచున్నది. మరల నింకొక ఉపాధిని పొందును. ఈ విరామకాలమున సూక్ష్మశరీరమునే యుపాధిగ ధరించుచున్నది. స్థూలమును విడచి సూక్ష్మశరీరమున నున్నట్లు, ప్రబోధచే సూక్ష్మమునుకూడ పరిత్యజించి, కారణ శరీరమును లయింపజేసికొని ఉపాధిరహిత స్థితి నొందిన, అనంత, అఖండ, అద్వయ పరమాత్మయే యగును. కనుకనే కూటస్థుడు త్రికాలాబాధితుడు. సర్వమును ప్రకాశింప జేయగలడు, స్ఫూర్తి నివ్వగలడు, గనుక స్వప్రకాశుడు. ఉపాధిరహితుడైన ఆ ప్రత్యగాత్మయే, సర్వాత్మకుడుగ, అఖండ చైతన్యముగ సత్పదార్థముగ నెరుంగబడును.

సారాంశములు :— 1. అనాదినుండి గలుగుచున్న యనుభవముల సంస్కారములవల్ల, ఆరోపిత పదార్థములయందు భ్రమరూపమగు జ్ఞానమే గలుగు చుండును. అధ్యాసయందు, అధిష్ఠానము, సామాన్య రూపముగ, ఆరోప్యతాదాత్మ్యమునంది గోచరించుచుండును. ఎట్లన అధిష్ఠానమునకు సామాన్యాంశ, విశేషాంశయను రెండంశలు గలవు. ఉ॥ 'శుక్తి రజత భ్రమలో 'ఇది' 'రజతం' అని చెప్పుచున్నాము శుక్తియందు ఇది' అను రూపం సామాన్యాంశము, శుక్తియొక్క స్వరూపం విశేషము.

2. అధిష్ఠానము : విశేషరూపమున పూర్తిగా తెలియబడినయెడల భ్రమగలుగదు. సామాన్య రూపము తెలియబడనప్పుడున్నూ భ్రమ గలుగదు. అధిష్ఠానము పూర్తిగా తెలియబడక, సామాన్యము తెలియబడినప్పుడు, అధ్యాస గలుగును. అనగా అధిష్ఠాన సామాన్య జ్ఞానము అధ్యాసకు కారణము. వివర్తమున సంభవించు విధానమిదియే. కనుక ప్రపంచము పరమాత్మ యొక్క వివర్తము. కనుకనే ఈ శ్లోకము మననయోగ్యము. పరమాత్మ విశేషము. విశేషము ద్రష్టయందలి తమోగుణ ప్రాధాన్యతచే అనగా అజ్ఞానముచే ఆవరింపబడినప్పుడు, అధిష్ఠాన సామాన్య జ్ఞానము మాత్రమే గలుగును. అనగా భ్రమజనిత జ్ఞానము గలుగును. భ్రమలయందుపాదానము పరమాత్మ, ఆయన సామాన్యాంశలగు విశేషణములే వస్తువులయందనుగతమై భ్రమలకు కారణమగును. కనుక అవిద్యయొక్క ఆవరణ విక్షేపశక్తులే జగత్కారణము. ఈ యవిద్యయే బృహత్స్వరూపములో మాయ యనబడును. *ఈ మాయాశక్తియే విక్షేపమును గల్పించి లోకవ్యవహారమున పరిభ్రమింప జేయునప్పుడు "అవిద్యా స్వరూపిణి". బ్రహ్మాకారవృత్తి యుదయించినప్పుడు బ్రహ్మవిద్యా స్వరూపిణి, చిద్రూపిణి సద్విద్యాతత్త్వము. దీనినే హైమవతి యని పూజింతురు.

పరి : సత్పదార్థము పరిణామిగాదని గ్రహించితిమి. ఈ భ్రమను గలిగించునది ఆవరణయనుడు, అజ్ఞానమనుడు, మాయయనుడు, మరి యేపేరైననూ పెట్టుడు, ఈ శక్తి కొాక వ్యక్తిత్వము గలిగించినాము గదా ! మరి పరమాత్మ అద్వయుడెట్లని యొకశంక. దీనికి సమాధాన మెట్లన అధిష్ఠాన పదార్థము మిథున రూపమైనది. మిథునమును ఆంగ్లములో (Polarity) యందురు. అనగా రెండు విరుద్ధ ధర్మము లొకేపదార్థముగ ఏకైక రూపమున నుండుట. ఇచ్చట ఒక పదార్థము శుద్ధచైతన్యము లేక పరమాత్మ; రెండవది ఆ "చిత్" యొక్క శక్తి "యోగమాయ". యోగమున రెంటికి ఏకైకముగ సమ్మేళనము. అనగా ఆ పరమాత్మయందే తాదాత్మ్య సంబంధము గలిగి ఏకరూపమే అయియుండుట. ఉదాహరణకు మనము విద్యుత్తునందు ధన, ఋణ (positive and negative) అంశలు రెంటిని పేర్కొనుచున్నాము ఐననూ ఆ రెంటికి భేదమును భావమును స్థిరీకరించిన యెడల అసలు విద్యుత్తే యుండదు. ఒకటి లేనియెడల రెండవ దానికి యునికియే యుండదు. ఆ శక్తి నిష్క్రియముగా నున్నప్పుడు వేడి వెలుగు, చలనము యుండవు. ఇట్టిదే ఆ సత్స్వరూపము. మిథున రూపమగు శక్తి విజృంభించి ఋణాంశ ధనాంశ సన్ముఖమైనప్పుడే దీపములు వెలుగును, పంఖాలు తిరుగును, స్టౌలు ఉష్ణోగ్రతపొంది పచనకార్యయోగ్యములగును. మేగ్నెటిక్ (సూదంటు రాయి) శక్తియునిట్టిదే. ఇది భౌతికమునకు సంబంధించిన యుదాహరణ. పారమార్థికమున, శివశక్తులకు లేక బ్రహ్మశుద్ధమాయలకు, గల స్వరూప తాదాత్మ్యమును, అందువల్ల సంభవమగు కార్యములు గ్రహింప నుపక రించును. అనగా పరమాత్మయు శుద్ధ మాయయు మిథున రూపమగు ఏకైక పదార్థమేనని బోధించును. పరమాత్మయొక్క ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తుల సమగ్ర స్వరూపమే మాయ. "యాదేవీ పరమాశక్తిః పరబ్రహ్మ విధాయినీ" అని పూర్వశ్లోకమున జెప్పబడినది. పరమాత్మ

సృష్టిని సంకల్పించినప్పుడు మాయాశక్తి విజృంభించుటకు ముందుగా నాదమగును. ఇది శబ్దసృష్టియందు జెప్పబడు ధ్వనిగాదు. అర్థసృష్టి యందు ఇదియొక ప్రాథమిక స్పందన మాత్రమే. (The primordeal stress) లేక ప్రాథమికక్షోభ. ఈ క్షోభచే బిందువేర్పడును. బిందువన సృష్టికార్యమున కనువగు స్థితికి వచ్చిన పరాశక్తియే, శుద్ధమాయయే, భౌతికమున నొక అస్పష్టమగు మసక పదార్థము వంటిది (a Nebulous or cloudy state, not clearly seen or understood) అను స్థితి ఉదాహరణగ గ్రహింపనగును. ఈ బిందువుపై యింకనూ గలుగు నాదప్రభావముచే "కల" యుద్భుద్ధమగును. కలయన సృష్టి. ఈ భూమిక యందలి సృష్టిని శుద్ధ సృష్టియని శాస్త్రేయులు నిర్వచింతురు. శుద్ధమనగా పంచీకృతీభూత సృష్టిగాదు. భూతసృష్టిని మాయికాసృష్టి యందురు. అనగా సత్వరజస్తమో గుణాత్మకమై మాయ యను నామముతో శఙ్కరులచే వ్యవహరింపబడిన ప్రకృతి పరిణామముచేతగాని, తన యందలి ఆవరణ, విక్షేపములను తమోగుణాత్మకశక్తి విశేషములచే వివర్త ప్రక్రియగ జరిగినది మాయికాసృష్టి. కనుక సృష్టికి శుద్ధభూమిక, మాయికాభూమికలు గలవు, మొదటిది నాద, బిందుకళాత్మకము. రెండవది సత్వరజస్తమో గుణాత్మకము. మొదటిది పరాప్రకృతి జన్యము, రెండవది అపరాప్రకృతి కార్యము ఈ దృక్కోణమునుండి సంయమన సామర్థ్యము గల అంతఃకరణ యను దూరదర్శినితో జూడలేనివారు *ద్వైత భావమును పొంది జీవేశ్వర జగత్తులను మూడు అనాది పదార్థముల అంగీకరింప వలసియే వచ్చును. శుద్ధ సృష్టియందు, శాస్త్రేయులచే జెప్పబడిన శుద్ధ విద్యాతత్త్వము తరువాతిదయి శాఙ్కరేయులచే జెప్పబడిన మూల ప్రకృతి నుండియే వివర్త వాదమునకు నాంది ప్రస్తావన, పరిణామ, ఆరంభ, ఆభాసాది వాదభేదములకు అవకాశము లభించినది. ఒక పాదము మేరకుగలదను వివర్త భావమును, ఆవరణ విక్షేపశక్తుల ప్రభావమునకు

లోనై యున్న, అంతఃకరణ – బుద్ధీంద్రియములతో గూడియుండు నంత కాలము, అధిష్ఠానమును (విశేష్యమును) గ్రహించుట కవకాశములేదు. ఈ యంతఃకరణము నంతర్ముఖముజేసి, జ్ఞానస్వరూపమగు చైతన్యముతో యోగసిద్ధిచే సాక్షాత్కారము (అనగా చూచుటగాదు అపరోక్షానుభూతియే) బొందిననే అనుభవమునకు రాగలదు. అనగా, నిర్వికల్ప సమాధిస్థితిలో బ్రహ్మాకార వృత్తిని బొందినప్పుడే అనుభవము గాగలదుగాని అన్యథాశరణం నాస్తియని తోచుచున్నది. ఈ స్థితికిరానిదే తత్త్వమును గ్రహించితిననుట ఆత్మవంచనయే.

ప్రకృతము : ముందు జెప్పబోవు అష్టమూర్తుల స్వరూప స్వభావ ముల గ్రహించియే "యస్యైవస్ఫురణం సదాత్మక మసత్కల్పార్థగం భాసతే" యని ఈ సృష్టియంతయూ సదాత్మకమగు పరమాత్మయొక్క స్వప్రకాశముచేతనే స్ఫూర్తిని గలిగియున్నదని, అవి పరమాత్మ విభూతు లని, సగుణ బ్రహ్మస్వరూపములే యని జెప్పబడినవి. ఇదియొక కోణము నుండి పరిశీలించిన మిథ్య. మఱియొక కోణమునుండి విమర్శించి గ్రహించి సాధనతో అనుభూతిని బొందిన యెడల, సత్పదార్థమే యగునని విశ్వసించగలము.

సాధనయందొక అంశముగ, "సాక్షాత్తత్త్వమసీతి వేదవచసాయో బోధయత్యాశ్రితాన్" అని బ్రహ్మాకారవృత్తి ప్రాప్తికి, పథమును జూపెను. ఈ వాక్యమందుగల తత్–త్వం–అసి–యను మూడు పదముల విచారిం తము. "తత్" యననేది ? "త్వం" అనబడు నీవెవరు ? అని విచారించి తెలిసికొనిన యెడల అసి–అయియుంటివి (ప్రాప్త ఉపలబ్ధి భావము) అను పదమునకు సార్థకత గలిగింపనగును. తత్ అన అది. అది యేదో గ్రహించుటకే ఈ ప్రస్థానములు షడ్దర్శనములు యిత్యాదు లును. మనకుగల విజ్ఞానముతో, సంస్కారబలముల మలుపులతో, విషయగ్రహణ సామర్థ్యముతో, ప్రయత్నింతము. ఇందు దార్శనికులు

ప్రతిపాదించిన అన్ని భావముల సమన్వయముతో ఒక్కొక్క మెట్టు ఎక్కినగాని వేదాన్త దర్శనమందలి భావముల గ్రహించి సత్యమును దర్శింపజాలము ఏదోయొక దర్శన ప్రతిపాదిత జ్ఞానముతో తృప్తిజెంది, సమీక్షజేయు సామర్థ్యము లేనియెడల ఆ నేర్చిన దర్శనమందలి పాక్షిక జ్ఞానము ఒక ఉచ్చుగా మనకు దగుల్కొని ప్రగతిని పొందనీయదు. కనుక మేధావులగు దర్శన కర్తలందరి సిద్ధాంతములను సమన్వయము జేసి కొనవలయును ఇప్పుడు "తత్" అనునదేది ? :— ఏద్దైతే ఈశ్వరు నకుగల సమిష్టి యజ్ఞానముతో (collective ignorence) కూడని దైన శుద్ధచైతన్యమో, ప్రజ్ఞానమో, అఖండము, అద్వయము, నిష్కలము, నిక్క్రియమో, సర్వాధిష్ఠానమో అదియే "తత్" పద లక్ష్యార్థము. "త్వమ్" యనగా వ్యష్టి యజ్ఞానముతో గూడి, స్థూల, సూక్ష్మ, కారణ, శరీరముల నభిమానించుచు, వానితో తాదాత్మ్య భావము నొందుచు తజ్జనిత తాదాత్మ్యధ్యాసచే కర్తృత్వ భోక్తృత్వముల నారోపించుకొని సుఖదుఃఖానుభూతుల నొందునో అట్టివాడే "త్వమ్" లేక నీవు అనుశబ్ద వాచ్యుడు. ఇట్లు విచారించగా జీవేశ్వరుల కిరువురకును, పరమాత్మయే అధిష్ఠానమని, ఇరువురిలో నొకరు వ్యష్టి అజ్ఞానముతో నుపహితుడై దానిచే ప్రభావితుడై, అహమను భావమును బొందినట్లును, రెండవవారు సమిష్టి యజ్ఞానరూపమగు మాయచే నవచ్ఛిన్నుడయ్యు దాని ప్రభావమునకు లోనుగాక దాని కధిపతియై నియామకుడుగ నుండినట్లును దెలియుచున్నది. ఈ సందర్భమున నొక చిన్న యుదంతమును దెలిపెదను. ఒక యజ మానికి పదిమంది నౌకరులు గలరు. ఆయన ఆ పదిమందిచేత తన యిచ్ఛానుసారము ఆదేశించి సేవల జేయించుకొనుచుండెడివాడు. ఈతడే కీశ్వరుడు. మాయతోగూడి సాహచర్యము జేయుచున్ననూ, దానిని తన ఇష్టానుసారము ఒక కుంచిగా, ఒక కలముగా, ఒక పనిముట్టుగా నియోగించుకొని తన రచనల జరుపుచుండును. ఇంకొక యజమానికిన్ని

పదిమంది నౌకరులు (జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు) గలరు. ఆయనకు మనస్సను నౌక సలహాదారుడు సహచరుడుగ సంప్రాప్తమయ్యెను. యజమాని ఈ మనస్సను వాని సలహాలను విని, తన నౌకరులు తెలివి గలవారని, వారివల్ల తనకు సుఖప్రాప్తి గలుగునని విశ్వసించి ఆ నౌకరుల సూచలన నామోదించి, హర్షించి, జీవయాత్ర సాగించుచుండెను. తుదకు తన నౌకరుల సలహాలు తనకు దుఃఖప్రాప్తిని గలిగించినవని గ్రహించి మనస్సను ఆ మంత్రిగారిని తన సామర్థ్య సాధనలచే వశపఱచు కొని పరిచారకుల నడుపునందుంచి సుఖప్రాప్తి నొందెనట. ఈతడే జీవుడు ఒక దశయందు అజ్ఞానమునకు లోబడి చరించువాడు- మరియొక దశయందు అజ్ఞానమును తొలగించుకొని సుఖప్రాప్తి నొందినవాడు.

ఈ మాయకు నాలుగు భూమికలు గలవు. (1) యోగమాయ : ప్రళయస్థితియందు పరమాత్మతో యోగము జెందియుండు చిత్‌శక్తి. (2) శుద్ధమాయ : సత్వరజస్తమో గుణాత్మకము గాకయుండి శుద్ధ సృష్టియందు అయిదు భూమికలలో ప్రవృత్తినిజూపి శివ, శక్తి, సదాశివ, ఈశ్వర, సద్విద్యలను స్థితుల ప్రదర్శించునది. (3) అవిద్య : జీవతత్త్వ మును రజస్తమో గుణప్రాబల్యముగల తన యావరణ విక్షేపశక్తులతో క్రమ్మివేసి భ్రాంతి జ్ఞానము గలిగించి, విపర్తమును జూపునది. (4) బీజాం కుర న్యాయానుసారము నియత సృజన, స్థితి, లయశక్తుల ప్రదర్శించు నది. ఈ మాయయొక్క ప్రభావముల నింకను పరికించిన తెలియు సూత్రములు :— (1) పదార్థము మనస్సుయొక్క విలసనమని **(matter is the manifestation of mind)** తెలియును. (2) పూర్ణ బింబరహిత పరిచ్ఛిన్న ప్రతిబింబ ప్రాప్తిని గలిగించును. (3) ఆత్మయందె అంతర్గతముగ నున్న దృశ్యమును, బాహ్యదృశ్యముగ స్ఫురింపజేయుట. (4) నిరతిశయ, నిర్గుణ బ్రహ్మయందు గలుగు

అదృశ్యస్పందనము (The primordeal stress that causes un-manifest creation is capable of independent creation) స్వేచ్ఛాసృష్టిజేయ సమర్థము. ఇది సత్త్వప్రధానమై రజస్తమోగుణములు అప్రధానమగు శుద్ధసృష్టి.

(5) సాతిశయ లేక అపరాప్రకృతి (Relative nature composed of the trigunas) సత్త్వరజస్తమో గుణాత్మకము. సృజన, స్థితిలయాత్మకము, ఆవరణ విక్షేపసమర్థము. క్రమబద్ధమగు, బీజాంకుర న్యాయసమ్మతమగు సృష్టి, ఈ అపరాప్రకృతి ధర్మములు.

(6) ఏకకాలమందే సత్తు—అసత్తు—గా తెలియబడునది. అనగా మిథ్యారూప సృష్టి. (a simultaneous Is and Is not). మాయాశక్తియొక్క భూమికలను కార్యములను ఇట్టివని గ్రహించితిమి. ఇక జీవేశ్వరుల విషయము, వారికిగల సంబంధమును విచారింతము. ఇరువురకును అధిష్ఠాన మొక్కటియే ఐయున్నది; మాయయొక్క భూమికలతో సంబంధమున్నది. అజ్ఞానమను తమశ్శక్తి యుపాధిమాత్ర పరిమితము. అనగా ఈశ్వరుడు (తత్) మాయయను సమిష్టి యుపాధియు, జీవుడు (త్వమ్ అవిద్యయను వ్యష్టియుపాధియు విశేషణాంశలుగ గలిగి యున్నారు. శాస్త్రజ్ఞుడు తత్—త్వమ్ పదములకు "అసి" పదమును వర్తింప జేయుటకు జహల్లక్షణమని (జహాత్ = వదలుట) అజహల్లక్షణమని (వదలకుండుట జహదజహల్లక్షణమని విశేషణాంశయగు అవిద్యనువదలి విశేష్యాంశయగు చైతన్యమును పరిగ్రహించుట) యు, ఇది వాచ్యార్థము అది లక్ష్యార్థము అని గంభీర పదములతో చెప్పుదురు. కాని శాస్త్రీయ విజ్ఞానము లేనివారికి "అసి" పదప్రయోగ విధానము తేటయగుటలేదు. విషయ మొక్కటియే యైనను ఈ తార్కికపద సంభ్రమము లేకుండ సులభ సమన్వయ మెట్టునన—జీవునకిగల అవిద్యా కల్పిత భావములను

అనగా "దేహం ప్రాణమింద్రియాణ్యపి చలాంబుద్ధింవ శూన్యం విదుః" అను వాటిని, మాయాశక్తి కల్పిత విలాసములుగ (manifestations) గ్రహించి వ్యష్ట్య జ్ఞానమును తొలగించుకొనిన, జీవభ్రాంతి ప్రక్షాళితమై, శేషించునది భాసించునది అధిష్ఠానమగు ప్రత్యగాత్మయే. అటులనే జీవు డారాధించు ఈశ్వరునకు మాయాశక్తి యొక్క ఉపలక్షిత భావమును అపవదించిన భాసించునది, నిర్గుణ, నిష్కళ, నిష్క్రియమగు, విభువగు, అధిష్ఠాన పరమాత్మయేగదా! జీవునకిట్లు మాయాకల్పిత మహావ్యామోహ ములు లేనిదే బ్రాహ్మీస్థితి! ఆ స్థితియందుపాధిరహిత ప్రత్యగాత్మను ఈశ్వరుని, ఒకే అధిష్ఠాన పదార్థముగ గ్రహించి యనుభూతి పొందుటయే "అసి" పదమునకు సార్థకత. ఈ స్థితియందు నామరూపములు లేవు. గనుక "తత్త్వమసి" అను వాక్యమే ఉండదు. వ్యావహారికమున జీవ బ్రహ్మైక్య బోధకమగు నీ మహావాక్యముతోడనే యేనిని రేఖారూపమున సూచించు చిన్ముద్రతోడనే సత్పదార్థము అసత్పదార్థముగ నెట్లు భాసించి స్ఫూర్తి జెందుచున్నదో ఉపాధులు అంతఃకరణ లేనియెడల అఖండమగు అద్వయమగు అధిష్ఠానమగు ఆనంద స్వరూపానుభూతి నెట్లు ప్రాప్త ప్రాప్తముగ నెరుంగనగునో బోధించెను.

చివర పాదమున దేనిని సాక్షాత్కరించుకొనినయెడల పునరావృత్తి నొందక భవాంబుధినిదాట సాధ్యమగునని చెప్పెనో అది అసత్కల్పార్థ ముగ నున్న సన్మాత్రమేయని సగుణ నిర్గుణములకునూ ఏకత్వమును బోధించెను. అయితే సాక్షాత్కరించుకొనుటకు ఆయనకొక శరీరము, కాళ్లు, చేతులు, ముక్కు, కళ్లు యున్నగదా సాధ్యము? నిరాకారుడను చున్నదిగదా శాస్త్రము! మరి సాక్షాత్కార మెట్లుపొసగునో? అనగా సాక్షాత్కారమనునది అపరోక్షానుభవమే యని గ్రహింపనగును. ఇట్టి యనుభవము ఆ పదార్థమునందు (ఎఱ్ఱగా కాలిన యినుప గుండునందగ్ని

వ్యాప్తి నొందినట్లు) నీవును వ్యాప్తినొంది తాదాత్మ్యము నొందినప్పుడే స్వరూపానుభవము లభ్యము. ఇదియే తాదాత్మ్యమునకును తాదాత్మ్యధ్యాన మనుగల నదీసముద్రము.

"స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే సంశయంబువిడదు సాధకునకు చిత్రదీపమునను చీకట్లు బోనట్లు ॥వి॥" అని వేమనయోగి దెలిపెను. "ప్రమాణమాత్ర శృణుమే ప్రత్యక్షం నామనేతరత్ : సర్వప్రమాణ సత్తానామ్ వదమబ్ధిరపామివ । ప్రమాణ మేకమేవేహ । ప్రత్యక్షంతదతః శృణు॥ (He alone knows the aboslute reality who knows it by direct intuition) అని వశిష్టుడు జెప్పెను. కనుక సాక్షాత్కారమన స్వానుభూతి యని దెలియనగును. అట్టి యనుభవము నంతఃకరణము నంతర్ముఖముజేసి ధ్యానధారణ సమాధుల సాధించినప్పుడే గలుగును. సాక్షాత్కారమన- దేనిని సంయమనముజేసి తదాకారవృత్తిని బొంది ఆ ధ్యేయము యొక్క నిజరూపముతో తాదాత్మ్యము జెందుటయే యని తెలియవలయును. అదియే పునరావృత్తి లేకుండ భవాంబుధిని దాటించునని తెలియవలయును. అనగా నిర్వికల్ప సమాధిస్థితిని సిద్ధించు కొన్నవానికే, బ్రాహ్మీస్థితి యొక్క అనుభవ ప్రాప్తి గలుగునుగాని- పఠకపుర్చీ పాఠకునకు పారమార్థిక ప్రాప్తి గలుగదని బోధజేసిన దక్షిణామూర్తికి నమస్కారము.

4. శ్లో॥ నానాచ్ఛిద్ర ఘటోదరస్థితి మహాదీప ప్రభాభాస్వరం।
జ్ఞానం యస్యతు చక్షురాది కరణద్వారా బహిస్స్పందతే
జానామీతి తమేవభాన్తమనుభాత్యే తత్సమస్తం జగత్
॥తస్మై॥

టీక :— నానాచ్ఛిద్ర = బహురంధ్రములుగల; ఘట=కుండయొక్క, ఉదర = లోపల; స్థిత = ఉంచబడిన; మహాదీప = పెద్ద దీపముయొక్క; ప్రభా = వెలుగు (వలె); భాస్వరం = ప్రకాశించుచున్న; యస్య = ఏ పరమేశ్వరుని యొక్క; జ్ఞానంతు = అంతఃకరణమందు ప్రతిబింబించి జీవచైతన్యము లేక సాక్షి చైతన్యమని వ్యవహరింపబడుచున్న జ్ఞానము (అభాసగాదు) చక్షురాది కరణ ద్వారా = జ్ఞానేంద్రియముల ద్వారా, బహిః = వెలుపల వసు దేశములకు లేక వస్తువులున్న ప్రదేశములకు, స్పందతే = ఇంద్రియములనుండి, ఇంద్రియార్థములు లేక భోగ్యవస్తువుల మీదికి ప్రసరించుటకు స్పందన (vibration) పొందుచున్నదో; జానామి+ ఇతి = దీనిని; ఇట్లు తెలిసికొనుచున్నాను. (ఎట్లు ?) అనగా భాన్తం = నిరపేక్షికముగ అనగా స్వయంప్రకాశుడై విషయములను ప్రకాశింప జేయుచు, తం-ఏవ = ఆ సాక్షిచైతన్యము లేక జీవచైతన్యమునే, అను = అనుసరించి; ఏతత్ = ఈ; జగత్ = ప్రపంచము; సమస్తం = అంతయు భాతి = ప్రకాశించుచున్నది, అనగా పరమాత్మ స్వరూప జ్ఞానమే ప్రకాశించు చున్నది. అట్టి పరంజ్యోతియగు దక్షిణామూర్తికి ఈ నమస్కారము.

తా॥ పలురంధ్రములు గల ఘటమునందలి జ్యోతియొక్క కాంతి వోలె ప్రకాశించు ఏ పరమాత్మ చైతన్యము చక్షురాదీంద్రియ గోళకముల ద్వారా, బహిర్గతాంతఃకరణ వృత్తి ప్రతిఫలితమై; ఘటాదిబాహ్యవిషయ ప్రకాశమగుచున్నదో, స్వయంప్రకాశమగు ఏ పరమాత్మ స్ఫురణము